ఔరంగజేబు బీజపూరులో నొక వత్సరము వఱకు నుండెను. ఈ కాలములో నతని కన్ని దిక్కులను విజయము చేకూరెను. శంభాజీయొక్క ఉత్తర
1689 దేశములో నిఁక రాయుగడ ప్రతాపగడ మొదలైన దృఢమైన కోటలు తప్ప తక్కిన వన్నియును మొగలుల వశమాయెను. పన్హాలా టాటూరాల మధ్యనున్న దుర్గశ్రేణియెల్ల గోఁబడెను. పైఁజెప్పఁబడిన తక్కిన కోటలనుఁగూడ జయించిన సంపూర్ణ దిగ్విజయ మవునని యతఁడు తలంచి యాపనిని సక్రమంబుగఁ జేయు నారంభించెను. కాని సైన్యమందు జాడ్యములు ప్రారంభమై యతని యుద్యమమునకు కొంత భంగము కలిగించెను. కాని నీరానది యొడ్డున అక్లూజు గ్రామము చేరగనే జాడ్యములు తగ్గిపోయెను.

ఈ కాలములోనే ఇంగ్లీషువారు ఓడదొంగతనము చేయుచున్నటుల చక్రవర్తి తెలిసికొని ఈస్టిండియా కంపెనీ ఫాక్టొరిలను కొన్నిటిని పట్టుకొన నాజ్ఞాపించెను. మొగలు యోధ లెప్పుడైన పట్టుకొనఁబడినపు డిట్లు శిక్షించుట ఔరంగజేబునకు మామూలే. ఆయన సూరతులోని ప్రెసిడెంటును రెండు మూఁడు సారులు ఖైదుచేసెను. ఈ పర్యాయము వారిని బొంబాయినుండి తఱిమివేయ వలసినదని సిద్ది యాకూతుఖానున కాజ్ఞయిచ్చెను. కాని యింగ్లీషువారు, దర్బారులోని యుద్యోగస్థులకు లంచమిచ్చి, వినయ విధేయతలతో వేడుకొనినందున క్షమింపఁబడిరి.

ఔరంగజేబు అక్లూజునం దుండగ మహారాష్ట్రులయొక్క దోపిడి మూకల వార్తలు తఱుచుగ వినవచ్చుచుండెను. నాసిక దగ్గర నొక గొప్ప దోపిడిమూక వచ్చెననియు నచ్చటి మొగలు సైన్యమెదిరించునంత సంఖ్య లేదనియుఁ దెలియవచ్చి కుమారుడగు అజమ్‌షా నతఁడు బంపెను. కొంత సైన్యమును కొంకణమునకు దండెత్త నతఁడు ప్రయాణము చేసెను. అబూహుస్సేను క్రింద ప్రసిద్ధిజెందిన తుకుర్రిబుఖాను అను యోధునొకని కొల్లాపురముపై నాయన సన్నాహము చేసెను. తుకుర్రిబుఖా నచ్చటకుఁ జేరినతరువాత నచ్చటి వర్తమానము లన్నిటిని బాగుగ నాకళింపుఁజేసికొని, శంభాధి సంగమేశ్వరు

వనములో బ్రమత్తుఁడై యుండెనని యోజించి వానిని స్వయముగ ఖైదీగఁ బట్ట సాహసప్రయత్నము నాలోచించెను.

సరియైన వర్తమానమును సంపాదించి, పర్వతమార్గములతోఁ జక్కఁగఁ బరిచయులైన వారిని వెంటదీసికొని, చురుకైన కొలది కాల్బలమును యశ్వ సైనికులను కొందఱి నెన్నుకొని, కొల్లాపురమునుండి తన సాహసకృత్యంబు పైన తుకర్రిబుఖానుఁడు బయలుదేరెను.

తుకర్రిబుఖాను కొడుకు ఇక్లాసుఖానుఁడు వేగులవారి కించుకైన నెడ మియ్యక, సత్వరంబుగఁ జని, మహారాష్ట్రులు కోటద్వారమును మూసికొనకు పూర్వ మందుఁ బ్రవేశించి, యడ్డమువచ్చినవారి నెల్ల నఱికివేసి తండ్రికి మార్గముఁ జేసెను.

శంభాజీ యనుచరు లనేకులు తత్క్షణము పాఱిపోయి రక్షించుకొనిరి. మిగిలినవారిని కవికులేశుఁడు పోగుచేసికొని యజమానుని గాపాడ యత్నించెను. కాని కవికులేశుఁ డొక్క బాణంబున నేలఁబడెను. శంభాజీ మాఱువేషముచే దప్పించుకొనఁ బ్రయత్నించెను గాని, యతఁ డాతొందరవలనను చిత్తభ్రమణము వలనను దీయ మఱచిన మేని భూషణంబులచే గుర్తింపఁబడెను. కవికులేశుఁడు గాక శంభాజీతో నింక 24 గురు ఖైదీలుగ పట్టుకొనఁబడిరి.

తుకర్రిబుఖాను తన ఖైదీలను సురక్షితముగ కొల్హాపురమునకుఁ దీసికొని వచ్చెను. అప్పుడు భీమాయింద్రాయిణీ నదీ సంగము దగ్గరనున్న తుల్జాపురమున, చక్రవర్తి శిబిరమునకు వారు బలమగు సైన్యరక్షణక్రిందఁ దీసికొని రాఁబడ నతని కాజ్ఞయయ్యెను.

శంభాజీ నెవ్వరునుఁ గాపాడఁ బ్రయత్నముచేయలేదు. అతని ప్రియ మిత్రుని యవివేక వ్యవహారంబులును, అతని దుర్నడతయు ప్రజలలో ననేకుల కసహ్యమును గలిగించెను. ఒకవేళ నతని సైన్య మతనికొఱకు సాహసమే మైనఁ జేయఁదలచినను, దాని ప్రస్తుత యంగవైకల్యం బట్టి ప్రయత్నమున కనుకూలము కాకుండెను.

చక్రవర్తి శిబిరమునకు ఖైదీలు వచ్చినంతనే, వారుబంధింపఁబడి యొంటెలపై నెక్కింపఁబడిరి. శంభాజీ తల పాగఁ దీసివేయఁబడెను. మృదంగ తాళాది వాద్యంబు లనేకములు హాస్యంబుగ నతనిముందు వాయింపఁబడెను. వేలకొలది జను లిరుప్రక్కలనుండియు యతని శిబిర ప్రవేశమునుఁ జూడవచ్చిరి. ఖైదీలు ఔరంగజేబు ముందు నిలువపెట్టఁబడి తరువాత కడపటి యుత్తరువగు వఱకును ఖైదున కాజ్ఞాపింపఁబడిరి.

మోగలు సరదారులు కొందఱు, శంభాజీ ప్రాణముఁ గాచిన దుర్గము లన్నియు కాపలి సైన్యములచే నియ్యఁబడునని, యటుల సలహా నిచ్చిరి. ఔరంగజేబు కూడనట్టి షరతుపై రక్షింపవలె నని బహుశః తలంచి యుండవచ్చును. కాని శంభాజీ యిప్పటికి తెలివిఁదెచ్చుకొని లజ్జా పశ్చాత్తాపాక్రాంత మనస్కుండై యింత యవమానంబు తరువాత మరణము తప్ప మఱేదియు కోరఁడయ్యె. కావున నే భటుఁడైన నాగ్రహమున తనను తొందఱఁబడి చంపుటకనేక విధంబుల దూషణప్రలాపము లాడఁజొచ్చెను. ఈ యవస్థలో ఔరంగజే బతఁడు ముసల్మానైన యెడల ప్రాణములు రక్షించెదనని సందేశ మంపెను. శంభాజీ యందుకు 'చక్రవర్తి నాకు తన కూతురు నిచ్చినయెడల నేను ముసల్మాను నయ్యెదను' అని ప్రత్యుత్తరమిచ్చుచు మహమ్మదును దూషించుచుఁ బల్కెను. చక్రవర్తి యిందుకు మండిపండి, యతని నుదాహరణంబుగఁ జేయఁదలచి, యెఱ్ఱఁగ గాలిన యినుపకమ్మి నతని కండ్లపై గాయుటకును, నాలుకనుఁ దెగఁగోయుటకును, తరువాత శిరచ్ఛేదముఁ జేయుటకు నుగ్రముగ నాజ్ఞ యిచ్చెను.

శంభాజీ యీ యాజ్ఞ ప్రకారము 1689 సం॥ ఆగస్టునెల తుల్జాపూరము యొక్క శిబిరపు బజారునందు తన ప్రియుఁడగు కవికులేశునితోడ బహిరంగముగ నురిదీయఁబడెను. ఈ తుల్జాపూరు భవానీదేవి, కనఁబడు ప్రతి స్త్రీ యందును తన స్వరూపంబును గాంచి యనుపమాన స్త్రీ గౌరవంబుఁగల తన ప్రియదాసుండగు శివాజీకి, నా డఫ్జులుఖానుఁ డెదిరివచ్చినపు డెట్టి విజయంబు నొడగూర్చెనో, నే డతని కుమారుఁడగు శంభాజీ స్త్రీల మానంబన నవలీలగఁ

జూచినందువలన నతనికెట్టి ఘోరదండన జరుగఁజూచెనో, యించుక విచారింప నగు. బ్రాహ్మణ మంత్రియగు కవికులేశుండు తక్కినవిషయములం దెంత యయోగ్యుఁడైనను, కొందఱు మహారాష్ట్రులు, శంభాజీని పట్టి యిచ్చెనని, యితని యెడల ద్వేషముచే చెప్పువాక్యము మాత్రము సరిగాదు.

శంభాజీయొక్క గుణము లన్నియు నీవఱకే విపులముగ వర్ణింపఁబడి యున్నవి. అతఁడు తండ్రియొక్క క్షాత్రంబుఁ గొంత వారసత్వమున గ్రహించి, సామాన్యమైన సామర్థ్యమునందు లోపము లేనివాఁడే గాని, వెలది, పానంబు, పరుషము, దుర్వ్యయము మొదలైన దుర్వ్యసనము లున్నకొద్ది సుగుణములనుఁ గప్పివేసెను. అంతకంటె దీర్ఘజీవిత మింకను పాపహేతువగును గాని లాభకారి కాఁజాలదు.

శంభాజీని గూర్చియు శివాజీని గూర్చియు నప్పటికాలపు ప్రజలలో నున్న యభిప్రాయములను, కాఫీఖాను అను మోగలు చరిత్రకారుడు తాను వినెనని చెప్పిన కథ నొకదాని నిందు జెప్పుట యుక్తము కాకపోదు.

"నేను (శివా కట్టిన) రాయగడ కోటవద్ద నొక యింటిలో, అబ్దులు రజాకుఖాను లారీతో కొంతకాలము గడపినపుడు ఆయూరి ప్రజలనుండి యీ క్రింద వృత్తాంతమును వినియున్నాను:— నరకలోకమున కుపమించి వర్ణింప దగిన యీ దేశభాగమంతయు నొక్క మహాశిలయై యున్నది. వేసవికాలమున వాస్తవ్యులకు విషాదంబుగ నుదకంబులు శూన్యమగును. కావున శివాజీ తనభవనముప్రక్క నొక చిన్న భావిని త్రవ్వించి, దానిప్రక్క నొకరాయిని తివాసివలె చెక్కించి, యాసనముగఁ జేసికొని వెనుక నింకొకరాయి నానుకొని కూర్చుండెడి వాఁడు. షాహుకారులయొక్కఁ గాని యింక నితర పేదజనుల భార్యలు గాని యచ్చటకు వచ్చినపుడు, వారిని తన తల్లితోడులవలె గారవించి వారి పిల్లలకు తదృతుఫలంబుల నొసంగుచుండెడివాడు. కాని శంభాజీ సింహాసనాసీనుండైనపుడు ఆ అరుగుపైననేఁ గూర్చుండెడు వాఁడు. ప్రజల భార్యలు నీళ్ల కచ్చోటికి పోక తప్పకుండెను. వారు కుండల నీళ్లు నించుకొని, యొకచేతితో నెత్తి మీద కుండను నిలువఁబెట్టుకొనుచు, రెండవచేతిని తమ కటియందుంచుకొని,

శంభాజీ యాసనము దగ్గరకు వచ్చినతోడనే యా దురదృష్టపు కుక్క వారి నవమానించి యొకటి రెండు ఘడియలు నిలువఁబెట్టెడివాఁడు. అంత టా యసహాయులగు స్త్రీలా కుండల నక్కడ పారవేసి శోకార్తలై పాఱిపోయెడివారు.''

శంభాజీ యెడల ప్రజ లప్పుడెంత యయిష్టులై యున్నను, శివాజీ యొక్క కుమారుని హత్యవిని కోపఘూర్ణిత మానసులైరి. ఈ దారుణ హత్య వారిని భయాపహులం జేయుటకు మారుగ క్రోధావేశుల్లం జేసెను.

ప్రకరణము. 13.

మహారాష్ట్రుల జాతీయస్వాతంత్ర్య యుద్ధము.

1689—1708.

శివాజీ తన యేర్పాటులన్నియును పూర్తిచేయకుండగనే చనిపోయెను. శంభాజీ తన దుర్నడతవలన ముప్పుదెచ్చుకొని నాశము నొందెను. ఔరంగజేబు దక్షిణమునకు దండెత్తిన మూడు నాలుగు సంవత్సరములలో దక్కనునందు నర్మదా నదినుండి తుంగభద్రా నది వఱకున్న దేశ మతని పాదాక్రాంతమాయెను. మహారాష్ట్రుల యొక్క సమదేశమంతయు నతని స్వాధీనమయ్యెను. పర్వత దుర్గములును చాలవఱకతని వశమాయెను. తక్కినవియు నతని వశము త్వరలోగా నున్నవి. మునుపటివలె బీజపూరు గోలకొండలు మహారాష్ట్ర నాయకులకు మొగలులపై నెదుర్కొనుటకుఁ దోడగుటసున్నయయ్యె. ఆరాజ్యాధిపతులు దూరదేశములందు కారాగారబద్ధులై యుండిరి. శివాజీయు నతని తోడి దేశాభిమానులును సంగ్రామరంగములందు తమ రక్తమును వ్యర్థముగ నోడ్చిరేమో యని చూపట్టెను. షాజీ శివాజీలు దేశముపైఁ బడకుండ నరువది వత్సరము లడ్డగించుటకుఁ బ్రయత్నించిన మొగలు మహావెల్లువ, నేఁడు విసురుగఁ గొట్టుచు నెదురేమియును లేకఁ బోవుచున్నది. దీని నిరోధించుటకు సాధన మేమియు నున్నట్లు కనఁబడలేదు. కాని యీ ముందు విశద పఱుపఁబడబోవు నిరువది సంవత్సరములందును మహారాష్ట్రులయం దుదయించిన దేశభక్తులు, తమపట్టు విడువక, మహారాష్ట్ర దేశమునందలి కోటలనుండి కర్ణాటకము కోటలకు తఱుముంబడి, యచ్చటినుండి మరల నుత్తరమునకు తరుమఁబడి, యచ్చటి కోటలనుండి మరల వెలువరింపఁబడి, సమదేశమునందు ఒకచోటనుండి మఱియొకచోటకుఁ బోవుచు ఔరంగజేబు సైన్యమునకు విరామము లేని యుద్ధ నరగల్పివాంబుంచి

యుద్ధంబున పీడించి, చిట్టచివర కాతని నలియించి, తమ స్వాతంత్ర్యమును మరల సంపాదించుకొనిరి.

లభించిన ఫలంబులనుఁ బట్టి విచారించిన యెడల, నీ యిరువది సంవత్సరములును మహారాష్ట్ర చరిత్రయం దత్యంత ప్రశస్తంబైన కాలంబు. శివాజీ యెప్పుడును మొగలు సామ్రాజ్యము యొక్క యావత్బల సంపదలతోడను పోరాడి యుండలేదు. అంతియకాక, జయసింగుచే చుట్టు ముట్టఁబడినపుడు, చాల నష్టముమీద మొగలులకు లోఁబడెను. ఇదియునుఁ గాక, దక్షిణమున నున్న మహమ్మదీయ రాజ్యములను వారిపై ప్రయోగించు ననుకూల మింకొకటి యతఁడు గలిగి యుండెను. అంతకు పైన నతఁడు పర్వత దుర్గముల రక్షణము క్రింద పోరాడుచు వచ్చెను. ఈ విషయము లన్నిటిలో, నీ స్వాతంత్ర్య యుద్ధముఁ జేసి జయశీలురైన దేశభక్తాగ్రేసరు లననుకూలురై యుండిరి. శివాజీ వంటి, స్వాల పరాక్రమంబుచే జనుల నాకర్షించి యుత్సాహ యుతులం జేయఁగల, నాయకుం డెవ్వఁడును వారికీ సమయమున లేఁడు. ఔరంగజేబుయొక్క స్వంత సైన్యాధిపత్యము క్రిందనే, యుండి తూర్పు యందలి యావత్సామ్రాజ్య సైన్యముతోడను వారు పెనగులాడ వలసివచ్చెను. శంభాజీయొక్క క్రూర దురాగతంబుల వలన మంచి యనుభవశాలురగు నాయకులు చంపఁబడిరి వారి కోటలన్నియు వాతని నిర్లక్ష్యముచే రక్షణ కసంసిద్ధములై యుండె. వారి రాజగు శంభాజీ కుమారుఁడైన సాహు మొగలులచేతిలో ఖైదిగ నుండె. వారు స్వదేశమునుండి తఱుమంబడి కర్ణాటకమందు కాపురముండ వలసినవారైరి. ఇట్లు వారు నిర్ధనులై, సైన్యరహితులై, పర్వత దుర్గ బహిష్కృతులై, నిరుపాధికులై, బలములం గూర్చుకొని, కోటల మరలఁ బట్టుకొని, క్రొత్తవిధంబగు యుద్ధపద్ధతి నవలంబించి, స్వరాజ్యమే గాక, దక్కను కర్ణాటక మొగలు సుభేలందు చౌతు సర్దేశముఖీలహక్కును గూడ నార్జించిరి. రాజారాము, ప్రహ్లాదనిరాజీ, శాంతాజీ ఘోరేపురే మొదలైన కొందఱీ యుద్యమము నారంభించిన వీరపురుషులు, స్వాతంత్ర్య యుద్ధము సమాప్తము కాక మున్దే పరలోక గతులైరి. కాని వారి స్థానంబుల భక్తి శ్రద్ధలతో నితరు లాక్రమిం

చుచు వచ్చిరి. ఔరంగజేబు దక్కను కీ దండయాత్రఁజేసి యిట్టి యుద్ధంబును గల్పింప కుండినయెడల, మద్రాసు ప్రెసిడెన్సీయందు తంజావూరు వలెనే, బొంబాయి ప్రెసిడెన్సీ యం దొక చిన్నమహారాష్ట్ర సంస్థానము మాత్రముండెడిది. మొగలు చక్రవర్తి క్రింద నా సంస్థానాధిపతి యొక్క చిన్న సామంతుఁడై యుండెడివాడు. శివాజీచేఁ బ్రేరేపింపఁబడిన దేశభక్తి యుత్సాహములతని తరువాతి తరములో కార్యకారి గాక యుండెడిది. మహారాష్ట్రంబున నున్న యైకమత్యాభావము మరల జనుల మనంబులఁ బ్రవేశించి వారి నొక్క జాతి కాకుండ నడ్డగించెడిదే.

కావున నన్ని యాపదలును నివారణమై, జనులయం దొక నూతన శక్తి మరల నుదయించిన దనిన, నా యోగ్యత యంతయును ఔరంగజేబుయొక్క యత్యాశకారోపింపవలసి యుండును. మహారాష్ట్ర జనుల నట్టడుగున కాతఁడు కలియఁబెట్టెను. వారి దేశభక్తి నాతఁడు శోధించెను. ఈయిఱువదిసంవత్సరముల యుద్ధములయొక్క కఠినశిక్ష వారిజాతీయ కఠినశిక్ష. ఇందువలననే వారి నాయకులజాతీయ దేశభక్తిస్వభావలక్షణంబులు దృఢంబు నొందినవి. ఇందు వలననే దీని తరువాత రాఁబోవు మూఁడు తరంబు లందును వారు ఇండియా యందలి దూరప్రదేశములకు జయశీలురై బయలు వెడలిరి. ఈ విషయమునందు, శివాజీ తన బహుళకథా శోభాయమానంబగు జీవితమునందు ప్రారంభించి, నిర్వహించిన సంగ్రామముకంటె, నీ స్వాతంత్ర్యయుద్ధ మెక్కువ యుపయోగకారి యైనది. కేవల బందిపోటు వాండ్రును, దారి దోపిడి గాండ్రును, అట్టి శత్రువుపై నట్టి యుద్ధమున జయంబు నొందఁజాలరు. అంతకంటె నుత్తమమైన నీతిబలమే సంఘముయొక్క యుత్తమపురుషుల సుగుణంబుల నెల్ల బహిర్గతంబు చేసినది. సాహస విక్రమను, ఉదాత్తసహనము, పరిపాలనాసామర్థ్యము, ప్రతి భంగపాటునకును పై కెగసిన యాశా సంకల్పము, నిశ్చలమైన విశ్వాసము, దేశకాల పురుషాతీతంబైన యుత్తమాదర్శభక్తి, సామాన్య యాపదల యందు సోదరభావము, సంపూర్ణ ఆత్మ సమర్పణా శక్తి, సామాన్యలాభమునకు పరస్పర స్వార్థత్యాగానురక్తి, స్వధర్మోద్యమం బగుటవలన స్వయుద్యమ ఫల పరిపాకము

నందు నిశ్చయతయు, మొదలైన సుగుణములే, యీ తరముయొక్క దేశభక్తులను, ఇండియా యందే జాతియు నడ్డగింపఁజాలని యాపదనుండి, దేశమును మోక్ష ప్రాప్తి నొందఁజేయ సమర్థులగునట్లు చేసినవి. ఈ సుగుణములను నేర్పుటకును, కఠినమును ఉపయోగమునైన నీ సుశిక్ష నొసంగుటకు నీస్వాతంత్ర్యయుద్ధము పాఠశాలవలె, మహారాష్ట్ర చరిత్రయందు బహుకార్య సమంచితంబుగ నెంచఁబడును.

ఔరంగజేబు అపకారివలె వచ్చి యుపకారియై చనియె. అతఁడు దలఁచిన దొకటి, దైవము దలఁచినది మఱియొకటి. దేశభక్తి యుదయించిన దేశమునందు శీఘ్రముగనో యాలస్యముగనో స్వాతంత్ర్యంబు రాకమానదు. దేశభక్తి యీశ్వర స్వరూపము. అదియొక ధ్రువతారము. అది క్రమక్రమంబుగ పూర్ణవికాసమునొందక మానదు, దానికి సలుపఁబడిన విరోధంబులెల్ల దానికి దోహదంబులై చెలంగును. కావున ఔరంగజేబు దాని తన వైరంబుచేత త్వరితగతిని ప్రకాశంబునకు తీసికొని వచ్చుటకు ఈశ్వరునియొక్క యుద్యమమునకుపకరణం బయ్యెను. కావున నిటులనే చరిత్రయందు, సర్వసంఘములయెడల సమానదృష్టినిఁ బరపు నీశ్వరునియొక్క కరాంగుళిని మనము గనుఁగొనుచుందుము. కావున కేవల యుపకరణంబుగ నేర్పడిన ఔరంగజేబు తదుద్యమంబైన తరువాత పంచభూతంబులందుఁ గలిసిపోయెను. ఈశ్వరుని కరాంగుళి మాత్రము శాశ్వతంబుగ మనదేశ చరిత్రమునందు దృగ్గోచరంబగుచుండె.

ఇట్లు మహారాష్ట్ర స్వాతంత్ర్య యుద్ధముయొక్క యర్థఫలంబుల నుపోద్ఘాతంబుగ వర్ణించిన పిమ్మట కథాసూత్రంబు చదువరులు గమనింప సులభంబుగను, మనోహరంబుగ నుండునని తలంచెద.

శివాజీ భార్యయగు సోయరాబాయి మరణ దండన విధింపఁబడిన తరువాత నామె కుమారుఁడగు రాజారాము సవతి యన్నయగు శంభాజీచే రాయగడ కోటయందు ఖైదుచేయఁబడి యుండెను. ఆతఁడు పాఱిపోకుండ కాంచబడుట కెంత యవసరమో యంతకంటె నిర్బంధ మాతఁడు పెట్టఁబడియుండలేదు. రాజారాము కోటలోపల మాత్రము స్వేచ్ఛగ తిరుగుట కనుమతింపఁ

బడెను. అతని మొదటిభార్య చనిపోయిన తరువాత నతనికి మఱి యిద్దఱు తరుణీమణుల నిచ్చి శంభాజీయే వివాహముచేసెను. అందు మొదటిభార్య తారాబాయి యను నామె మోహితీ వంశజురాలు. రెండవ యామె కాగల్ దేశముఖుడగు ఘాట్గేయొక్క పుత్రిక. రాజారాము, అన్నగారి భార్యయగు యశోబాయి యెడలను, ఆమె కుమారుఁడగు శివాజీ (మారుపేరు సాహు) యెడల నాదరణఁగలవాఁడై వారఁదనతోడను శంభాజీ యురిఁదీయఁబడు నప్పటికి, రాయగడయందుండెను.

శంభాజీ యొక్క దుర్వార్తను వినిన తోడనే ముఖ్యులగు మహారాష్ట్ర నాయకులందఱును రాయగడకు వచ్చి సభచేసి యశోబాయితో నాలోచించి అప్పటి కాఱు సంవత్సరముల వయస్సున నున్న సాహూయొక్క బాల్యదశ యందు రాజారాము సంరక్షకుఁడుగా నుండి రాజ్యమేలుటకు తీర్మానించిరి. రాజా రాము యొక్క వయస్సప్పటి కిరువది వత్సరములు. కాని యాతఁడు తండ్రి యొక్క యనేక గుణసంపదలకు వారసయ్యెను. తండ్రియొక్క ధైర్యము, సామర్థ్యము, దుర్వ్యసన రాహిత్యము, శాంతౌదార్య స్వభావము, మఱియు దేశజనులయందు మనోధైర్యమును గల్పింపఁ గలశక్తి యాతనియందు మరలఁ జూపట్టెను. అతఁడు తన యావజ్జీవమును, సాహూ తరువాత ఔరంగజేబుచే పట్టుపడి దర్బారునందు ఖైదీగనున్నను, అతని హక్కుల యెడలగల యాదర ణముచే సింహాసనము నధిష్ఠింపక, సంరక్షకుని వలెనే రాజ్యము చేసెను. ఇతని యొక్క ముఖ్యహితోపదేశి ప్రహ్లాదనీరాజీ ఇతఁడు శివాజీకాలములో న్యా యాధీశుఁడైననీరాజీరావుయొక్క కుమారుఁడు. శంభాజీయొక్క రాజ్యకాలము లోనితఁడుఉద్యోగమునందు లేకవ్యవహారములనన్నియు తటస్థముగవీక్షించుచుం డెను. మహారాష్ట్రులలో నా కాలమున నందఱిలోను బుద్ధిమంతుఁడుగ పరిగణిం పఁబడియెడివాఁడు. బ్రాహ్మణులనుస్తుతించుటయందు కడుమితవాదియైనగ్రాం టుడఫ్ కూడ ప్రహ్లాదుఁడు సామాన్య పురుషుఁడు కాఁడని యొప్పుకొనుచున్న వాఁడు. సంపూర్ణస్వార్థ రాహిత్యమందు బ్రాహ్మణరాజతంత్రజ్ఞులలో నితఁ డద్వితీయుఁడని చెప్పవలసి యున్నది. రాజారాము వలెనే యితఁడును, స్వదేశ

రక్షణాకార్యము సమాప్తము కాక పూర్వమే స్వర్గస్థుఁడయ్యెను. కాని వారి దేశమునకుఁ దటస్థించిన యాపద చాలవఱకు దొలఁగి యిఁక జయము కొలది కాలములో నున్నదని సంతుష్టిగఁ జూచిన కృతార్థతనుఁ బొందెను.

నాఁడు సభయందు కూడిన దేశభక్తులందఱిలోను, ప్రహ్లాదనీరాజీ, నిజమైన యాపత్కాలంబున ధీరమానసంబులు సంపాదించు నాధిక్యతతో, ప్రముఖుండై నిలచెను. వారు స్థైర్యము తోడను, వివేకముతోడను, ఐకమత్యముతోడను, తమ కార్యాలోచనలఁ జేయఁ దొడంగిరి. ఔరంగజేబు యొక్క శక్తి ప్రయత్నములను వారు చక్కఁగ పరిశీలించిరి. తమ యొక్క నిరోధసాధనంబులను లెక్కచూచుకొని, శుష్కధనాగారంబులను, శిక్షాపేతబలంబులను దుర్గముల పదార్థగ్రాస రాహిత్యంబును, శీఘ్రకాలమున నవి శత్రువశంబగు ననుమానమును, ధైర్యము వీడక చింతించిరి. కావున వారి ప్రథమ ప్రయత్నము దుర్గంబులయందు పదార్థ సంగ్రహణంబు సేయుటకును, సాధ్యమైనంత కావలి సైన్యమును గూర్చుటయు నై యున్నది. కోటలకు సంబంధించియున్న భూములనుండి వారసత్వముగ జీవనములను కావలి సైన్యములు బడసి యున్న శివాజీ యొక్క పద్ధతి వారికిప్పు డత్యంత యుపయోగకారి యయ్యెను. ఈప్రతిష్ఠాపనలను భద్రముగఁ గాపాడవలయునని యాజ్ఞలు తక్షణము బంపఁబడెను. కోటల యొక్క హవల్దారు లందఱును ధాన్యమును సాధ్యమైనంత సంగ్రహింపవలసిన దనియే కాక, కోటలరక్షణ క్రిందనున్న భూములలోని గడ్డికోసి కోటలలో మేటులు వేసి గుఱ్ఱములకొఱకు సిద్ధముఁ జేయ వలసినదనియు, నాజ్ఞాపింపఁబడిరి.

రాజారాము రాయగడ నుండి విశాలగడ వఱకు నొకకోట నుండి మఱియొక కోటకు దిరుగుచు, మొగలుల దృష్టి భేదించుట, కొక్కచోట స్థిర నివాసము చేసికొనకుండ నుండుటకు, తీర్మానింపఁబడినది. ఒకవేళ మహారాష్ట్రము నందుండు టాతనికి క్షేమంబుఁ గానిచో కోరమండల తీరముననున్న జింజీ కోటకుఁ బోవుటకై వారాలోచించిరి.

యశోబాయియు కుమారుఁడును రాయగడయం దుండిరి. రాజారాము యొక్క కుటుంబము విశాలగడకుఁ బోయెను. మహారాష్ట్ర ప్రముఖులు సమయానుసారంబుగ కార్యంబులను నడుపవలయుననియు, తమ యశ్వసైన్యంబులు చాలవఱకు ప్రస్తుతము రాజారామునకు కొలది దూరముననే యుండి యతనిని రక్షింప సన్నద్ధులై యుండుటకు నేర్పాటులు చేయఁబడెను.

మొగలులచే మొట్టమొదట రాయగడ ముట్టడి వేయఁబడెను. సిద్ధిచే సాహాయ్యము చేయఁబడిన యియాతీకాదుఖానుడు చాల నెలలవఱకు నేమియుఁ జేయలేక పోయెను. చివరకు శివాజీ సైన్యములో సేవఁజేసిన సూర్యాజీ పీసా లను నతఁడు, వాయీదేశముఖి వారసత్వమును గూర్చి వివాదముగలిగి యసంతృప్తుఁడై యుండి, తనకు వాయీదేశముఖినిఁ దెప్పించి పెట్టుటకు ఖానుఁడు సహాయము చేసినయెడల, తాను కొందఱు మావళీలను తీసికొనివచ్చి కోటను పట్టియిచ్చుటకు వాగ్దానము చేసెను. ఈషరతు అంగీకరింపఁబడి నందున నాద్రోహి తన వాగ్దానమును జరపెను.

శంభాజీయొక్క భార్యయు, కుమారుఁడు శివాజీయు, యియాతీకాదుఖానుని వశమయిరి. వారు చక్రవర్తి శిబిరమునకుఁ దీసికొని పోఁబడిరి. ఖాను మిక్కిలి గౌరవింపఁబడి, జుల్ఫికరుఖాను అను బిరుదము నొసంగఁబడెను. ఔరంగజేబు కుమార్తెయగు బేగంసాహేబా, యశోబాయి యెడలను ఆమె కుమారుని యెడలను నెందువలననో ప్రేమాస్పదురాలై, వారిని తనరక్షణలోనికిఁ దీసికొనెను. ఔరంగజేబుయు తాను ఘోరముగ దండించిన శంభాజీ కుమారుఁడగు శివాజీయెడల కరుణాకలితుఁడై యతనికి సాహూ యని ముద్దుపేరుఁ బెట్టెను.

రాయగడ జయింపఁబడిన తరువాత, చక్రవర్తి సైన్యభాగంబులు మెరిచ్ పన్హాలాలకు సాగిపోయెను. రాజారామిప్పుడు సాధ్యమైనంతశీఘ్రముగ జింజీకి, చక్రవర్తి యతని పలాయనమునుఁ గూర్చి యనుమాన పడక పూర్వమే, పారిపోవలెనని సలహా యియ్యఁబడెను. నీలూపంతు మోరేశ్వ రీవఱకే జింజీకోటను బాగుచేయించుచు నక్కడుండెను. అతఁడు రాజారాము యుద్యమము నెడల

మఱింత యాసక్తితో నుండుటచేఁ గాను, తండ్రియొక్క పేష్వా యుద్యోగంబు నకు నియమింపఁబడెను. విశాలగడ రంగనా మొదలైన మిగిలియున్న కోటలన్నిటికిని హుకుమతుపనాయను బిరుదుతో రామచంద్రపంతు బావ్డేకారు సర్వముక్త్యారునామాతో రాజ్యమేలు నధికార మియ్యఁబడెను. రాజారామునియొక్క యనుచరులందఱును జింజీకిపోయి యున్నప్పుడు, మహారాష్ట్రమునందు వానర యుద్ధము నడిపింప నుంచఁబడినవారిలో నితఁడు ముఖ్యుఁడు. ఈయన పంతు అమాత్య యుద్యోగమియ్యఁబడెను. ప్రస్తుతము కొల్లాపురములోని బావడా యొక్క పంతు అమాత్యవంశమునకు మూల పురుషుఁడితఁడు. శివాజీ కాలములో అతనికి మోరోపంతుతోకూడ ప్రధానియు సేనాపతియు నైన అబాజీ సోనదేవుని పుత్రుఁడీతఁడు. రఘునాథపంతు హనుమంతు కర్ణాటకమునుండి శివాజీయొద్దకు వచ్చినపు, డీతఁడు చిన్నవాఁడుగాన నుద్యోగమునుండి తొలఁగింపఁబడి, యాస్థానమతని కియ్యఁబడెను. ఈతఁడు విస్తారము యోగ్యపాత్రుఁ డైనందున, రాజారాము సర్వాధికార మిచ్చుటయేఁగాక తనకుటుంబమునుఁగూడ నితనిరక్షణయం దుంచిపోయెను. మఱికొందఱు మహారాష్ట్రవీరులును తమ కుటుంబములను విశాలగడలో నితని రక్షణక్రిందనుంచి వెడలిపోయిరి. ఈయనక్రింద పరశురాం త్రింబకు అను నింకొక సమర్థుఁడగు నతఁడు సహాయముగా నుంచఁబడెను. ఈతఁడు కిన్నెయి యొక్క కులకార్ణిగా నుండి తెలివితేటల వలన ప్రసిద్ధికి వచ్చెను. ఈయన ప్రస్తుతము సతారాయందలి పంతు ప్రతినిధివంశమునకు మూలపురుషుఁడయ్యెను. సిద్ధోజీగుజారు, శూరఖేలు అను బిరుదముతో, నావిసైన్యాధిపతిగాఁ జేయఁబడి రేవుస్థానములను, తీరమును రక్షించుటకు నియమింపఁబడెను. ఈతనికి సహాయసైన్యాధిపతి శివాజీయొక్క నావి కధిపతిగాఁ బేరొందిన తుకోజీ ఆంగ్రియా యొక్క కుమారుడు కనోజీ ఆంగ్రియా. ప్రహ్లాదనిరాజీ తన దూరదృష్టివలన ముఖ్యులగు మంతూరీలందఱితోడను ఉత్తర ప్రత్యుత్తరములు సలిపి వారి యొక్క దృష్టియంతయు నొక్క యుద్యమముపై నిగుడునట్లు చేసెను.

దేశమునందలి సిలేదారులలోఁ బలుకుబడిఁగల యొక వృద్ధవీరుఁడు,

మహాదాజీనాయకు పాన్సంబల్ అనువతఁడు, సేనాపతిగ నియమింపఁబడి మహారాష్ట్రమునం దుంచఁబడెను. అతని యుపదేశమువలన వివిధనాయకులును తమతమ యశ్వసైన్యములను గ్రామములందు చిమ్మివేసి, తరువాత సేనాపతిచే చేయఁబడు నొకసంజ్ఞ కొక నియమిత స్థలంబునఁ గలిసికొనుటకును, వారి మిత్రులతోడను, సోదరులతోడలను, బంధువులతోడను, భగ్వాజెండా కనుపడిన చోటున నెల్ల గూడుకొనుటకును, నాజ్ఞపడసిరి.

రాజారాము తన కోటలన్నిటి యందు నొక్కసారి దర్శనమిచ్చి జింజీకి పాఱిపోవుటకు తన గుప్తమిత్రులను రంగనాయొద్ద కలిసికొనెను. వీరందఱును లింగాయతు వైశ్యులవేషములను ధరించి సూండా గ్రామమునకుఁ బోయి యచ్చటినుండి పూర్వ సముద్రతీరమునకు దేశము మధ్యనుండి పో నుద్యోగించిరి. ఈసమయమున రాజారాము యొక్క బృందము 25 గురుగా నుండెను. ఇందు ముఖ్యులు ప్రహ్లాదనీరాజీ, శాంతాజీఘోరేపురే, ధనాజీజాధవుఁ ఖండీరావు దాభరే. ఈయేర్పాటు బహురహస్యముగ నాలోచింపఁబడి నప్పటికిని ఔరంగజేబునకు రాజారాము యొక్క పలాయనము జాడ తెలిసెను తత్క్షణమే బీజపూరు కర్ణాటకపు ఫౌజుదారునకతని నడ్డగించుటకు వర్తమాన మంపఁబడెను. ఆవిధముగ నింక ననేకులకు వర్తమానము లంపఁబడెను. బెంగుళూరు వద్ద రాజారాముయొక్క పాదములు సేవకుడొకఁడు కడుగుటవలన ననుమానింపబడి, యాబృందమంతయు కొంచెములో పట్టుకొనఁబడు నాపదలోనికి వచ్చెను. కాని కందూబలాలు చిట్నీసుదానిని గ్రహించినవాడై మొగలు ఉద్యోగస్థులను భంగముసేయుటకు తానును మఱి కొందఱును వంటచేయుచు నచ్చటనేయుండి రాజారాము, శాంతాజీ ఘోరేపురే, ధనాజీజాధవు నొక మార్గమునను, ప్రహ్లాదనీరాజీ ఖండీవు దాభరే నింకొక మార్గమునను పొమ్మని సన్నయిచ్చెను.

కందూబలాలును, అతని సహచరులును పట్టుకొనఁబడిరి. వారుశోధింపఁబడి, ఖైదునఁ ద్రోయఁబడి యనేక విధముల బాధింపఁబడి, నిజముచెప్పుటకు బలవంత పెట్టఁబడిరి. వారందఱు నదివఱకుఁ గూర్చుకొని యున్న మఱియొక

యబద్ధపువృత్తాంతము నొక్కరీతిగ, నెంత బాధింపఁబడినను, మహారాష్ట్రము నుండి పాఱివచ్చిన వారెవ్వరిని తా మెఱుఁగమని చెప్పిరి. అటు తరువాత వారువదలి పెట్టఁబడిన పిమ్మట తమమిత్రులను గలిసికొని సురక్షితముగ జింజీ వచ్చి చేరిరి.

మహారాష్ట్రమునుండి వారు మొట్టమొదట వినిన వర్తమానము సేనాపతి మహాదాజీ నాయకుని మరణమై యున్నది. ఇందు వలన వారి యేర్పాటులకు కొంత భంగము కలిగినను మహారాష్ట్ర యుద్యోగమున కది మేలుగనే పరిణమించెను. అతని కంటె సాహస సామర్థ్యములుగల శాంతాజీ ఘోరేపురే యా సేనాధి పత్యమునకు వచ్చెను.

రాజారాము యొక్క మొట్టమొదటి యేర్పాటు తండ్రివలె యష్టప్రధాన పద్ధతిగనె యున్నది. ఇది యారంభమున కేవలము నామ మాత్రంబైన నతని వ్యవహారమునకు గణ్యత నిచ్చుట వలన ముఖ్యమయ్యెను.

ఇప్పు డేర్పరుపఁబడిన ప్రధాను లెవ్వరనిన.—(1) నీలూపంతు మోరేశ్వరు, పీష్వా (2) జనార్దన పంతు హానుమంతీ, అమాత్య (3) శంకరాజీ మల్హారు, సచివు (4) రామచంద్ర త్రింబకు, మంత్రి (5)శాంతాజీ ఘోరేపురే, సేనాపతి (6) మహాదాజీ గుడాధర్, సోమంతు (7) నీరాజీరావుజీ, న్యాయాధీశు (8)శ్రీకూరాచార్య, పండితరావు. పీష్వాయుద్యోగ మీవలకే నీలూపంతుకీయఁబడిన కారణముననుఁ, ప్రహ్లాదనిరాజీ యీ యుద్యమమున కెల్ల ప్రాణమై యుండుట వలన, రాజునకు ప్రతినిధియను మఱియొక యుద్యోగ మప్పుడుకల్పింపఁబడి యతఁడు ప్రధానుల కెల్ల పై వాడుగఁ జేయఁబడెను. ప్రహ్లాదనీరాజీ, వెనుక శివాజీ పనుపున కర్ణాట యాత్రకు ముందు,గోలకొండ నవాబుతో రాజకార్యమునఁమున బోయినప్పు డచ్చట గొప్ప బిరుదులకును యాడంబరములకును కొంత యభిరుచిని గ్రహించిన వాడయ్యెను, నీయుద్యోగ మాతఁడుకోరకనే యాతని యెడలనుండు గౌరవముచే నొసంగఁబడినది. శాంతాజీ ఘోరేపురే, తా పిసికుంటుంబమునం దున్న వారి యందఱిలోను పెద్దవాఁడుగావున సేనాపతియుద్యోగ మియ్యఁబడుటయేఁ గాక నతని వారసత్వపు బిరుదులకు

ఘోడుగ హిందూరావు మమ్లూకత్మద్దార్ అను బిరుదుతో గౌరవింపఁబడెను. జఖీపట్కాయను జెండాను కూడ చేసికొనుట కధికార మియ్యఁబడెను. అంతే కాక చక్రవర్తి యుద్యోగస్థులలో గొప్పవారివలె నౌబతు నుంచుకొనుటకు నింక ననేక చిహ్నములు ధరించుటకు ననుజ్ఞయియ్యఁబడెను. ధనాజీజాధవు జయసింగురావను బిరుదము నియ్యఁబడెను. మహాదాజీ నాయకుఁడు చనిపోయి నందున, జనులను గూర్చుకొని మొగలుల కొల్లఁబెట్టుటకు శాంతాజీ ధనాజీలు మహారాష్ట్రమునకు తిరిగి పంపఁబడిరి.

నూతన దర్బారు జింజీయందు ఉత్సాహముతోఁ దీర్చఁబడెను. రాజారాము సాహూపక్షమున రాజ్యమేలుచున్నటుల గద్దెపై నెక్కి యుండెను కాని సింహాసన మలంకరింపలేదు. ఈ వర్తమానమునుఁ దెలియఁబఱచుచు బంగారు మురుగులు, వస్త్రములు, శాలువలు, లేఖలు రహస్యముగ మహారాష్ట్రమున హిందూముఖ్యులకుఁ బంపఁబడెను. ఇంతకంటె చిత్రమేమన, నప్పుడు మొగలుల స్వాధీనములోనున్న మహారాష్ట్ర దేశమునను, అంతకు పూర్వమెప్పుడును మహారాష్ట్రుల వశములో లేని దేశమునను గూడ రాజారాము ఇనాములను జాగీరులను బహు ఔదార్యముతో నిచ్చివేసెను రాజారాముగాని సాహూగాని, వారు రాజ్యమును స్వాధీనము చేసికొనిన పిమ్మట, నా యినాముల స్థిరపరుపలేదు. అప్పటి కా దానము లన్నియును నామ మాత్రంబైనను, అందువలన నతని యుద్యమము బలపడి యనేకుల నాసక్తిఁ బుట్టించి జింజీ కాకర్షించినది.

ఔరంగజేబీ వ్యవహారముల నన్నిటిని వినినతోడనే మహారాష్ట్రాధికారముయొక్క కడపటి శిరంబునుఁ దునిమి వేయఁగలుగుదునని పెట్టియాళ
1691 తో గొప్పసైన్యము నిచ్చి జుల్ఫికరుఖానును కర్ణాటకమున కంపెను.
కాని దేశభక్తియను నమృతకలశంబు వారి పక్షంబున నుంటఁబట్టి మహారాష్ట్రుల శిరంబులు దెగినను మరల మొలచుచుండె. మహారాష్ట్రులను నాశంబున నొచ్చుటఁ జూచినను మూకలు మూకలు నాసిక, ఖీరు, బీజపు దేశంబుల నొక్కసమయముననేఁ దోచుకొనుచుండిరి. శాంతాజీ ధనాజీల

కేతనంబుల క్రింద వేలకొలది జనులు ప్రోగగుచుండిరి. శాంతాజీ, పూర్వపు పద్ధతి క్రింద సైన్యము నంగనిర్మితంబు చేయుటకు, ధనలోపముచే బాధపడుచుండెను. కాని రామచంద్ర పంతు అతనికి సాహాయ్యమును చేయుచుండెను.

ప్రహ్లాద నిరాజీ, శాంతాజీ ధనాజీలు మహారాష్ట్రమునం దుండుటవలననే యొక్కువ సహాయకారు లగుదురని, తలంచి, మోగలులు కర్ణాటకమునకు వచ్చునెడల నెదిరింపవలయునని, బీజపూరు నందదివఱకు పనిచేసియున్న నొక మహమ్మదీయుని నియమించెను. ఆ ప్రయత్నము చేయంబడెను అది విఫలమై పోయెను. ఆమహమ్మదీయుండు తరువాత మోగలులలో కలిసెను.

జుల్ఫికరుఖానుయొక్క కాల్బలమునందును, అశ్వసైన్యము నందుంగూడ కొందఱుమహారాష్ట్రులుకలరు. కాల్బలమందు రాయగడయందు పీసాల్ ద్రోహి క్రింద పనిచేసిన మావళీలు కలరు. అశ్వసైన్యమందు రాజారాము బంధువులే గలరు. అన్నాజీ దత్తో శంభాజీచే జంపంబడినపుడు, మోగలుల పక్షము తిరిగి పోయిన గున్నాజీ గానోజీ యను సిద్దుసిర్కేవంశజులు కలరు. జుల్ఫికరుఖానుక్రింద దావుదుఖాను పన్నియను కొంచెముప్రసిద్ధిగలిగి మధుపానాసక్తుండగు నొకసేనాపతియుండెను. జింజీకోట,యనేక వరుసగ నున్న కొండలపై కట్టంబడియున్నది. ఇది మంచి దిట్టముగ నున్నది. దీని చుట్టుకొలత, యనేక మైళ్లుండును. కోటచుట్టును ముట్టడించునంత సైన్యము కలిగి వెలుపలి సంబంధములను పూర్తిగ నడ్డగించినగాని సరియైన ముట్టడి చేసినట్టుల మోగలులు దలంపరు. ఈ కార్యమునకు జుల్ఫికరుఖాను తన సైన్యము చాలదని యెంచి, కొంత పని చేసిన తరువాత మఱికొంతసేన కావలయునని చక్రవర్తికిం దెలియపఱచుచు, నంతవఱకును కొంతసైన్యభాగ మచ్చటనుంచి, తాను దక్షిణమునకు దండెత్తిపోయి, యచ్చట తంజావూరు తిరుచునాపల్లి రాజులయొద్ద కప్పముం గైకొనుచుండెను.

ఔరంగజేబు,దేశమునం దప్పటి యల్లరిస్థితివలన, సైన్యభాగములు విరివిగం బంచి యిచ్చుటకు వీలులేని యవస్థయందుండెను. 'వాకింకర' యొక్క పెమ్మనాయకుని గంత్రగోళ మెక్కువగుట వలన నతనిపై సుల్తాను ఖాను బత్తునియు, రోయుల్లాఖానునుం బంపించ వలసి వచ్చెను. వారును ముట్టడి వేయుటకు తగి

నట్లు సిద్ధపడి రాలేదు. కాని పెమ్మనాయకుఁడు కోటను రక్షించుకొనుచు మట్టిడికి నిలిచెను.

జింజీయందు ప్రహ్లాదనిరాజీ యెంత యుపయోగియయ్యెనో, మహారాష్ట్రమునందు రామచంద్రపంతు అంత యుపయోగియయ్యెను. పరశురామ త్రింబకు కూడ నతనికి మంచి సహాయుఁడుగ దొరకెను. ఇతఁడు, కోటల
1692 యొక్క యేర్పాటు లెల్లను పూర్వమువలె చేసి, కావలి సైన్యంబుల కుత్సాహంబు పుట్టించుచుండెను. రామచంద్రపంతు, ఒక చోటనుండి మఱియొక చోటకు దిరుగుచు, సతారాను మాత్రము ప్రధాననివాసముగ నేర్పఱచుకొని, శంకరాజీ నారాయణ గాండేకరుఁడను కామ్గారు యొక్క సహాయ్యముచే, ప్రతి మిలిటరీ వ్యవహారమును శ్రద్ధతోఁ గనుఁగొనుటయే గాక, సివిల్యు వ్యవహారమును కూడ చక్కఁజేసి దేశమునందు కొంత క్రమమును స్థాపించెను. అతఁడు స్వంతముగ కొన్ని సేనలను తయారుచేసి, శాంతాజీ ధనాజీలు రాకముందు, మొగలులయొక్క చెదరిపోయిన భటనికాయంబులను దునుముచుండెను; కాని వారు కూడవచ్చిన తరువాత వారితో నాలోచించి వాయిలో నున్న ఖోజాదారు నకాత్తుగఁ బట్టుకొన నుద్యోగించెను. శాంతాజియు నా కృత్యంబునకు తత్క్షణము సమ్మతించిన పిమ్మట, వారిరువురును ఖోజాదారుని యతని భటులందఱితోడను ఖైదీలుగఁ బట్టి యిప్పటి మహారాష్ట్ర ఠాణాను నెలకొల్పిరి. శాంతాజీ ధనాజీల ప్రత్యక్షమే రామచంద్రుని యొక్క భటుల నుత్సాహపూరితులం జేసెను. అతఁడును వారి యుదాహరణంబును గొనుముని ప్రోత్సాహపఱచెను. మొగలు రాజ్యమునందు తమ పూర్వసిద్ధమైన చౌతుసర్దేశముఖీలు వసూలు చేయవలసినదని యాజ్ఞాపించి పంపెను. వారును జయశీలురైనందున మిగుల నుత్సాహబలసమన్వితులై యిదివఱకున్న పన్నులతో పాటు ఘాస్‌దానాయను యింకొక పన్నునుగూడ మొగలు రాజ్యము వారలపై విధించిరి. ఈ క్రొత్త పన్ను వారి జీతబత్తెములులేని వాలంటియరు సైన్యములకు కమ్మిసారియటు సప్లైలవలెనుండుట కేర్పఱుపఁబడినది. ఈ విధముగ నొక ప్రత్యేకవిధమైన సైన్యము కూర్పఁబడెను. దీనికి ముఖ్యనాయకులు పవారు, థోరాటు, అథ్వాలీ, అను వారలైయుండిరి.

ఈ నాయకులు దర్బారునుండి బహుమతులను, బిరుదములను గొనుచు వచ్చిరి. పవారునకు విశ్వాసరావు అను బిరుదు నామంబియ్యఁబడెను. ఘోరాటునకు దినకరరావు అనియు, అథ్వాలేకి షంషేరు బహద్దరనియు బిరుదు లియ్యఁబడెను. రామచంద్రపంతు తన సైన్యలో విస్తారము భటులుగఁజేరిన ధన్గరు (గొల్ల వారు) ల యెడల మంచి యభిప్రాయముఁ గలిగియుండెను. తరువాత మహారాష్ట్ర సామ్రాజ్యములో ప్రఖ్యాతివడసి గొప్ప ప్రభువులైన హోల్కారు మొదలైన వారియొక్క మూలపురుషులు రామచంద్రపంతు క్రిందనే సేవఁజేసిరి.

శంకరాజీనారాయణు డిదివఱకు సమర్థుఁడగు కారుర్కానుగనుండి, యిప్పుడు వాయీజిల్లా కధికారిగఁజేయఁబడి, రాజగడకోటనుగూడ పట్టుకొనినవాఁడై ప్రసిద్ధికెక్కెను. పరశురామత్రింబకు పాన్హాలా నతాత్తుగఁ బట్టుకొని రాజ్యమున కింకను గొప్ప యుపకారమును చేసినవాఁడాయెను.

శాంతాజీ, మెరిచ్ దగ్గరనున్న మొగలుద్యోగస్థుని పైఁగదిసి, వాయీయందు వలెనే విజయంబునొందెను. రామచంద్రుఁడు తనకున్న సర్వముఖ్త్యారధికారమున నతని ప్రోత్సాహపఱుచుట కా మెరిచ్ యొక్క దేశముఖి నతనికి బహుమానంబుగ నిచ్చెను. శాంతాజీ ధనాజీలు తగినంత బలములఁ గూర్చుకొనినతోడనే జింజీనుండి మొగలుల దృష్టిని భేదించుటకై గోదావరీతీరంబులకై ప్రయాణోన్ముఖులైరి. అచ్చటనే దేశమునందంతలోను పంట లాసమయమున బాగుగపండి మొగలులకు పోషణ కనుకూలంబుగ నుండెను. వారచ్చటకేగి కొల్లగొట్టి హిందూస్థానమునుండి వచ్చు భోజనపదార్థంబులనెల్ల నడ్డుగొట్టి, వానితో వచ్చిన రక్షకసైన్యంబులనెల్లఁ జీల్చి చెండాడివేసిరి. వారిపై బలంబులఁ బంపఁబడెను, కాని ఔరంగజేబు తాను సామాన్య దారిదోపిడి గాండ్రతో పోరాడుచుంటలేదని తెలిసికొనెను. అతని సేనాభాగములఁజూచి, వారు పాఱిపోవువారుగాక వెనువెంబడిని మూఁడు సైన్యంబులను నిరోధించి ప్రతిపర్యాయమును నాయకుని చెఱఁగొని శంతాజీయొక్క పద్ధతిప్రకారము, వారివిడుదలకై ధనంబును గొనియుండిరి. ఈయాచారము శివాజీ యొక్క సామాన్యపద్ధతి ప్రకారమే కాని యతని యనుష్ఠానప్రకారము మాత్రముకాదు. శివాజీ

గొప్పవారిని విడిచిపెట్టుట కొకగర్వముగ నెంచుకొనెడువాఁడు, మధ్యరకము వారియొద్దనుండి సాధ్యమైనంతఁ దీసికొనఁజూచెడువాఁడు. శాంతాజీ, శివాజీ యొక్క శిక్షను సాధ్యమైనంతవఱకవలంబించెను. తన యనుచరులయొక్క మంచినడతకై యతఁడు జామీను పుచ్చుకొనుట యందు శివాజీవలెనే శ్రద్ధవహించెడువాఁడు, మహారాష్ట్ర పతనుదారుల నెక్కువవిశ్వాసపాత్రులుగఁ జూచుచుండెడువాఁడు. ధనాజీజాధవుఁడు శాంతాజీయంత సదుద్యోగి కాఁడు గాని యెక్కువభటరంజకుఁడైన సేనానాయకుఁడు.

వారట్లు ఉత్తరప్రాంతములలో తమ దోపిడి దండయాత్రలను విస్తరింపు చుండ ఔరంగజేబేమిచేయుటకును మనోనిశ్చయములేనివాఁడై, భీమనదీతీరం
1693 బునుండి శిబిరము నెత్తివేసి, చిట్టచివరకు జుల్ఫికరుఖానునకు సాహాయ్యమును చేసియెట్టులైన జింజీని సాధింపవలయునని దలంచెను. ప్రధానవజీరగు అసధ్ఖాను సాహాయ్యముతో సుల్తాను ఖాను బఖ్షు నా యుద్యోగంబునఁ బనిచెను. వారు పైయనుఘాటీను సమీపించిన తోడనే మహారాష్ట్ర హయంబులు ప్రత్యక్షమై స్వల్పయుద్ధములతో వారిగమనంబు నాలస్య పఱచినవి, కాని వారుచిట్టచివరకు జింజీమర్గముఁ జేరియచ్చట ముట్టడికిఁగూర్చొనిరి.

కుమార సుల్తాను యొక్క రాకచే తన యాధిపత్యము పోయినదని జుల్ఫికరుఖాను మదిని సంతాపింపఁ జొచ్చెను. అసధ్ఖానుఁడును, తన కుమారుఁడు రాయగడకోటను పట్టుకొనిన తరువాత, నీ యవమాన మన్యాయమని తలంచెను. అందులో ముఖ్యముగ నీ యేర్పాటు ఔరంగజేబు ప్రియసతియు, కుమారసుల్తాను తల్లియునగు జోధ్పురీ (జోధపురపురాజు కుమార్తె) యొక్క ప్రేరేపణ వలన జరిగినదని తెలిసికొని వారు మఱింత కినుకం బూనియుండిరి.

మహారాష్ట్ర మంత్రులును, అట్టి సమయముల కెప్పుడును వేచియుండురు గాన, వారి పరస్పర మనస్పర్ధలు తమ కనుకూలమగునట్లు చేయ నుంకించిరి. వారు వారిద్దరతోడను రాయభారంబుల నడుపుచుండిరి. జుల్ఫికరుఖాను ముందు వారి పక్షమునకుఁ దిరిగి, కుమార సుల్తానుయొక్క యేర్పాటులకు భంగములు గల్పింప రహస్యముగ రాజారామునితో సమాధానమునం గూడెను.

చక్రవర్తి, బహుశః మహారాష్ట్రులను దక్షిణమున కాక్రమించు నుద్దేశముతో, తన సైన్యములను గల్గలాకు నడిపించెను. కాని శాంతాజీ ఘోరేపురే యింకను ఉత్తరముననే యుండెను. రామచంద్ర పంతు సైన్యములు షోలాపురమువఱకు కప్పములం గొనుచుండెను. ఔరంగజేబు తన నటన వ్యర్థమైనందున మరల తన నిర్భరసైన్యమును పంఢరపురము దగ్గర భీమనది యొడ్డుననున్న బ్రహ్మపురి యందు కంటోన్మెంటును *గట్టించి, యందు తన దర్బారు నేర్పఱచుకొని యాస్థానమునుండి తన సైనికా గమనంబులను, రాజ్యవ్యవహారములను అనేక సంవత్సరములు నడిపించెను.

ఈ సంవత్సరములలో పోర్చుగీసు ఇంగ్లీషు కంపెనీలు ఓడ దొంగతనములు విస్తారము చేయుచున్నందున ఔరంగజేబుచే శిక్షితులైరి. అందు ముఖ్య
ముగా ననేకమంది మొకాక్కా యాత్రాపరుల నెక్కించుకొని పోవు
1695 చున్న గంజసువాయి యనునొక యోడ యింగ్లీషుకంపెనీ వారిచే
1696 పట్టుకొనఁబడినపుడు, ఔరంగజేబు సూరతు గవర్నరును ఇంక ననేక
యింగ్లీషు జనులను చెఱసాలయందుఁ బెట్టించెను. కాని దర్బారునందు మొగలు సభికులకు లంచము లిచ్చి వారు ఔరంగజేబుయొక్క శాంతమును సంపాదించుకొనిరి.

ఈ మధ్యననేక వత్సరములు జింజీయొద్ద వ్యర్థముగ కాలయాపన చేయఁబడెను. శాంతాజీ ఘోరేపురే చాల నాశంబును గావించి, మహారాష్ట్రమున తన కెదురైన దాని నెల్లఁ జెండాడి, పర్సోజీభాంస్లే, హైబతరావు నింబాల్కారను నిద్దరు పరాక్రమ శాలురను, శివాజీక్రింద సేవ నెఱింగినవారిని, గంగోత్రీ బేగారులందు మహారాష్ట్రుల నుత్సాహసంపన్నులఁ జేయుటకు నిలిపి, 20000గుఱ్ఱపుదళములో తానుసతారామార్గమున ఔరంగజేబు యొక్క మహాశిబిరమునకు పశ్చిమముగ నడచి కర్ణాటకమునఁ బ్రవేశించి జింజీకి కొంతదూరమునకు వచ్చినతోడనే మూఁడవ వంతు సైన్యములో ధనాజీజాధవుని విడదీసి పంపెను. అతఁడును త్వరితగమనమున నేతెంచి కోటసమీపమున నున్న మొగ

* కంటోన్మెంటు అనగా భటులు స్థిరముగ విడియుస్థలము.

లు కావలిసైన్యమునుదాఁకి తన రాక నెఱింగించెను. వెంటనే చిన్నచిన్న గుంపు లన్నియుఁ గూడికొని యతని దక్షిణ వామపార్శ్వంబులను పెద్ద సమూహములుగాఁ గూడుకొన వలసినదని యాజ్ఞలియ్యఁబడెను. మోగలు లాజ్ఞలను మందముగ గ్రహింప నలవాటుగలిగి యుండుటవలన, ధనాజీ కోటలోని సైన్యములవలనను సిగ్నలుల వలనను వారిపైఁబడి పొరిచలనము జరుగకముందేచాల నాశముచేసెను.

శాంతాజీ, నెమ్మదిగ మహారాష్ట్రుల ప్రధానబలంబును వెనుకను దీసికొనివచ్చెను. అతఁడు కోవరపాకునకుఁ జేరినపుడక్కడ ఖాజాదా రడ్డగించెను గాని వాఁడోడింపఁబడి, వాని శిబిరపు సామానులెల్ల కొల్లఁగొట్టఁబడెను. వాఁడును జింజీకి పారిపోవుచుండ మార్గమున ఖైదీగఁ బట్టుకొనఁబడి గొప్ప ధనమిచ్చిన పిమ్మట విడుదలచేయఁబడెను.

జయశీలురైన మహారాష్ట్రులు, జయమొనఁగూడినపుడు తమకు సహజంబగు చురుకుదనంబుతో, నలుప్రక్కలను మోగలు పహరాలఁ (outposts) గొట్టుచు, వారి సంభారనిర్వాహకుల (Foragers) జంపివేసి, వారి సంబంధముల నన్నిటిని తెగఁగొట్టి వెలుపలినుండి సామగ్రులుగాని వర్తమానముఁగాని రాకుండ సంపూర్ణముగ నడ్డుకట్టివేసిరి. ఇంతేకాక చక్రవర్తి మరణవార్తనుఁ బుట్టించి మోగలుల మనోధైర్యమును చెడఁగొట్టి, యా సమయములో సుల్తాను ఖానుబత్షుని చక్రవర్తిగఁ జేసెదమని రాయభారముల వారు నడపిరి. సుల్తానా రాయభారమున కంగీకరించెనో లేదో గాని యా మిషమీద జుల్ఫికరు ఖానుఁడును, అసద్ఖానుఁడును అతనిని నిర్బంధింప నిశ్చయించిరి. మహారాష్ట్రులీ మిత్రభేదము నెఱింగినవారై యందువలన సైన్యమునందు కలిగిన కల్లోలము నూతగొని మఱింత తీక్ష్ణణంబుగ వారిని ముట్టడించి వేధింపఁజొచ్చిరి. ఖానుబత్షు యొక్క స్వంతసైన్యములు పోరాడ నిరాకరించెను. భయ కోలాహలంబులు పెచ్చుపెరిగెను. చిట్టచివరకు మోగలులు తమ ఫిరంగులను బ్రద్దలు గొట్టుకొని, ఫిరంగిస్థానంబుల (బ్యాటరీలు) విడచి తమ్మరే తమ శ్రేణులందు ముట్టడింపఁబడిరి.

ఈ యవస్థయందుండి, సామగ్రులందక గొప్ప యాపదలోనుండి మొగ లులు సమరవిరామముఁ(truce) గోరిరి. అసద్ఖానునకును శాంతాజీకిని సంధి సమకూర్పఁబడెను. మొగలులు నిరుపద్రవంబుగ వందవాసికి పోనియ్యఁబడుటకును, యచ్చట చక్రవర్తియొద్ద నుండి యుత్తరము వచ్చువఱకు నుండుటకు, నటు పిమ్మట దానిఁబట్టి నడచుకొనునట్లును, సంధి యేర్పడెను.

ఈ యవివేకపు చర్యవలని ఫలితముల నెల్ల ఔరంగజేబుదూరదృష్టిచేఁ జూచినవాడై, తత్క్షణమే అసద్ఖానును కమార సుల్తానును తన సముఖమునకుఁ బిలిపించి, తన యాజ్ఞనుబిరముతోడను బీజపూరున కరిగి జుల్ఫికరు ఖానును యుద్ధమును జరిగింప నాజ్ఞనిచ్చెను

కాని జింజీముట్టడి తత్క్షణమే జరిగింపఁబడలేదు. మహారాష్ట్రులు, బీజపూరు కర్ణాటకపు ఫౌజుదారుచేఁ బంపఁబడిన సామగ్రి రక్షక సైన్యమును కొట్టినందువలనను, పెర్మకోయిల్ మొదలైన కొన్ని కోటలను పట్టుకొనినందు వలనను, తమరిచ్చిన విరామమునతిక్రమించిరని, జుల్ఫికరుఖాను యుద్ధ మారంభించి వానినెల్ల తిరుగ వశముచేసికొని, దక్షిణమునకుఁ బోయి తిరుచనాపల్లి రాజుతో సఖ్యముచేసి, తంజాపూరురాజు వానినుండి తీసికొనిన కొన్ని కోటలతనికి తిరిగి యిప్పించి, తనకు కొంతకప్పముఁ గైకొని తిరిగివచ్చి జింజీకోట ముందు గూర్చుండెను.

రాజారాముతో రహస్య రాయభారము లతడంకను జరుపుచునే యుండెను. అతఁడు ముట్టడిని దీర్ఘముచేయు కోరికను బట్టి చూడగా చక్రవర్తి చనిపోయినతరువాత తాను కర్ణాటకమున స్వతంత్రముగ నొకరాజ్యమును స్థాపింపవలెనని యుద్దేశ మప్పటి నుండియు యతని కున్నట్లు కనుపడుచున్నది.

జుల్ఫికరుఖాను తంజావూరు నందుండగా, శాంతాజీ ఘోరపురే బీజపూరు కర్ణాటకమును ధ్వంసముచేసెను. అతని దండయాత్రల నణచుటకు బీజపూరునుండి యనేక నాయకులక్రింద గొప్పసైన్యము పంపఁబడెను. కాని వారి సహాయాలయొక్క గుడారము లింకను తిన్నగ పాతబడక మునుపే మహారా

ష్ట్రులు ప్రధాన సైన్యముపై నలుదిక్కులను గవిసి, గొప్ప హల్లామావులింకను తమ రెక్కల యేనుంగులను తయారుచేసికొనుటకు గూడ కాలము లేక ముందే వారి నల్లరిపెట్టిరి.

సైన్యములయొక్క వివిధ నాయకు లొకరిమాట యొకరికిఁ దెలియక భిన్న భిన్న మార్గములఁ ద్రొక్క నారంభించిరి. మహారాష్ట్రులును వారి శీర్ణ మనోవృత్తిని తమ కనుకూలంబుగఁ జేసికొని, వారిని విడువక పగ లెల్ల వారిపై శతఘ్నులఁ గాల్చుచు, రాత్రివేళల నవాయిలఁ బేల్చుచు వెంట నంటిరి.

చివరకు మొగలులు మూడవరోజున దోడయిరీఘురియందు శరణు జొచ్చిరి. ఆ స్థలమందు భోజన సామగ్రులు స్వల్పముగ నుండెను. అచ్చటి కోమట్లు గోడలపైనుండి సామగ్రుల నెక్కువధరకమ్ముచున్న,నవియు త్వరలో నాఖరయ్యెను. ఆ సైన్యమును దెబ్బతినియుండెను. నాయకుఁ డెవ్వఁడును సమర్థుఁడు లేఁడు. ధైర్యముచేసి త్రోసికొని శత్రుశ్రేణులను భేదించుకొని పోవుట కా మొగలుసైన్యము ప్రయత్నింపఁజాలకుండెను. వారిని దరిఁ జేర్చుటకు ప్రయత్నము చేయఁబడెనుగాని వారి సాహాయ్యమునకువచ్చుచున్న సైన్యమింకను దూరమున నుండగనే కాంతాజీ దానిఁ దాకి యోడించెను. అందు వలన నావర్తమాన మేమియు నా నిరాశులగు వారికిఁ దెలియలేదు. ఈ దురవస్థయందు మొగ లుద్యోగస్థులు లోఁబడిరి. సేనాయకుఁడగు కాళింఖా నవమానమును భరింపఁ జాలక విషముఁ గ్రోలి ప్రాణములు విడిచెను. తక్కిన యుద్యోగస్థులు మేని దుస్తులు తీయింపఁబడుటయే గాక తమ విడుదలకు గొప్పపణంబు నియ్యవలసిన వారైరి. వారు చక్రవర్తి శిబిరము చేరిన తరువాత గౌరవచిహ్నంబులు దొలఁగింపఁబడినవారై తక్కువ యుద్యోగములందు నియమింపఁబడిరి.

హిమ్మతుఖానుఁడు దోడయిరీ గ్రామమును రక్షించుటకు బంపఁబడినవుడు విఫల మనోరథుఁడై, తరువాత విన్నపము వ్రాసికొని చక్రవర్తి శిబిరము నుండి తగినంత సైన్యమునుఁ బడసి కాంతాజీ నన్వేషించుచుఁ జనియె. కాంతాజీ త్వరలోనే దర్శనమిచ్చెను. సమదేశమున మహారాష్ట్రులు బలముగఁ బో

దుపం బమటవలన పలాయితులైరి. హిమ్మతుఖాను కాందిశీకులఁ దరిమెను. అప్పుడు మహారాష్ట్రులు వారి యాచార ప్రకారము వాని నొక పురుష శిలామయంబగు భూమికి రానిచ్చి, వెనుకకుఁ దిరిగి శ్రేణులను చీల్చివేసి సంకుల యుద్ధమున హిమ్మతుఖానును బొరివుచ్చి, సైన్యమును సంపూర్ణముగ నోడించి సామగ్రులనెల్ల చూరఁగొనిరి.

శాంతాజీ, జింజీవైపునకు వెనుకకుతగ్గి, యచట జుల్ఫికరుఖానుచే దగిలి కొనఁబడి చాలదూరము తఱుమంబడెను. మరల జుల్ఫికరుఖాను జింజీముట్టడి జరుపుటకు వెనుకకుఁ దిరిగినతోడనే శాంతాజీయు పృచ్ఛభాగమున వెంబడించెను. ఇట్టి యాహావక్రియ (manœuvre) మహారాష్ట్రుల కసాధారణము కాదు. ఈవాంశమునందుమాత్రము, శాంతాజీకిని జుల్ఫికరుఖానునకును రహస్యస్నేహముండినందున, బహుశః కృత్రిమమై యుండవచ్చును. తరువాత శాంతాజీయొక్క విరోధులీసంగతినే, యతనికి వ్యతిరేకముగ చెప్పిరని యనుమానమున కాస్పదముగనున్నది.

జింజీయందు యుద్ధక్రియలు మందముగనే జరుగుచుండెను. ఒకవేళ ముట్టడి రక్తపాతము లేకుండగనే యీసమయమున సాంతమయ్యెడిది. జుల్ఫికరుఖానుయొక్క సహాయసేనాని యగు దావూదుఖాను మాత్రము
1697 మద్యపాన మత్తుఁడైయున్నపుడు తనభటులను, కోటబట్టుకొని కాఫరులను చంపుడని, కేకలుపెట్టి తఱిమివేయుచుండ, వారుపోయి కొంచెము యుద్ధముఁ గావించుచుండెడివారు. జుల్ఫికరుఖానుయొక్క ప్రవర్తనయెడల చివరకు ఔరంగజేబున కనుమానముగలిగెను. ఖానుఁడు స్నేహితులవలన రహస్యముగా, నిఁక కోటపట్టుకొని ముఖ్యులగువారిని ఖైదుచేయకున్న మానప్రాణములు దక్కవని, జాగ్రత్త చెప్పఁబడెను. మొగలుసేనాపతి యీ సమాచారమును రాజారామునకుఁ దెలియఁబరచెను. ఇక ముట్టడిని తీవ్రముగఁ జేసి సాంతపఱుప వలసియున్నందున నిత్తఱి రాజారాము తప్పించుకొనుటకు సందునిచ్చెను. రాజారాము మొగలుసైన్యములోనున్న తనబంధువులగు శిర్కేలద్వారా తప్పించుకొనెను. వారతని సురక్షితముగ విశాలఘడకుఁ దీసికొనిపోవుటకును, అతని

కుటుంబమును జాగ్రత్తగఁ గాపాడుటకును, తమకుఁ గొన్ని వారసత్వపుహక్కులను, కొంకణములో దాభల్ పట్టణము నినాముగను ఇచ్చినయెడల, తాము వీలయినతోడనే రాజారాముపక్షమునకుఁ దిరిగివచ్చుటకును, వాగ్దానముఁ జేసిరి. ఈ షరతులన్నియు నేర్పాటయినతరువాత రాజారాముసిర్కేల సాహాయ్యమున మొగలుశ్రేణులనుదాటి వెల్లూరుచేరుకొనెను. అచ్చట మన్నాజీ మోరేచే నాతఁడాతిథ్యం బియ్యఁబడెను.

అతఁడచ్చట కొంతవిశ్రాంతిఁ దీసికొని తనయనుచరులతోఁ గూడ విశాలగడకు డిసెంబరునెలలో సురక్షితముగఁ జేరెను. జింజీయిల్లు ఏడుసంవత్సరములు ముట్టడింపఁబడి యామరుసటి జనేవరియందు లగ్గలకెక్కి పట్టుకొనఁబడెను. రాజారాము భార్యలును, కుటుంబమును రాజాపూరునుండి సముద్రముమీద నీ వఱకు వచ్చి కోట చేరియుండిరి. సిర్కేలు తమ స్త్రీబంధువులు మరియేవర్ణమువారికింగాని యొప్పగింపఁబడినను, వెలుపల గనుపడినయెడలను, గౌరవహానిగలుగునని చెప్పుటవలన జుల్ఫికరుఖాను వారినివారికొప్పగింతపెట్టెను. తరువాత వారు మహారాష్ట్రమునకుఁ గొనిపోఁబడిరి.

జుల్ఫికరుఖాను, రాజారాము జనుల ననేకులను చెఱసాలం బెట్టెను. చక్రవర్తియెడల తానుచేసిన ద్రోహమును క్రమ్మివేయుటకై మోసకార్యము చేసినను అనేకులు దోపిడీవాండ్రుగను విద్రోహులుగ నుఱితీయఁబడిరి. ప్రహ్లాద నిరాజీ యంతకుపూర్వమే పరలోకగతుఁడయ్యెను. అతనికుమారుఁడు నారూప్రహ్లాదుఁడు విద్రోహుఁడుగ ప్రాణములు గోలుపోయెను.

ఆక్రిందటి సంవత్సరము మహారాష్ట్రు లేమియుఁ జేసి యుండలేదు. ధనాజీకిని శాంతాజీకిని కొంత కాలమునుండి మనస్పర్థ లుదయించెను. పోయిన బుద్ధిమంతుఁడగు ప్రతినిధి యొక్క హితోపదేశమువలన రాజా చాలారోజులవఱకు నుదాసీనముగ నూరకుండెను. అందువలననే బహిరంగ కలహము పొసగలేదు. కాని ప్రహ్లాద సరాజీ పోయినతరువాత రాజారామున కంత వివేకపు మంత్రి లేకపోయెను. అతఁడు శాంతాజీ యెడలనున్న నమూయను కొంత

కాలమునుండి యణచిపెట్టుకొనియుండి యిప్పు డితరులవలన ప్రేరేపింపఁబడి యుద్ధాని బహిరంగముగఁ బూని, శాంతాజీఘోరేపురేకు రక్షకుడుగా నుండవల సిన తాను, విరోధియయ్యెను. ధనాజీ, రాజాచే ప్రోత్సాహితుఁడై, యతనిపై వ్యతిరేకముగ నొక్క కక్షను బయలుదేరఁదీసెను. ఔరంగజేబిప్పుడు శత్రు వులలో భేదోపాయంబు చేయుసమయమునఁ జూచెను. అతని రాయభారులు మహారాష్ట్రుల యందుండి వారి క్రోధములను పెంపుఁజేసి యెప్పటి సంగతి నప్పుడు, వారి ఛిద్రముల నౌరంగజేబునకు తెలియఁజేయుచుండిరి.

శాంతాజీయొక్క సైన్యము త్రిప్పివేయఁబడెను. అతఁడును, తన సైన్య ముచేతనుధనాజీయొక్క సైన్యముచేతనుగలిసికొట్టఁబడు స్థితిలోనుండగా కొంచె ములో తప్పించుకొని కొద్దిమంది యనుచరులతో బయలుదేరి పాఱిపోఁగలిగెను. ఈ ద్రోహము బీజపూరు దగ్గర జరిగినది. శాంతాజీని తఱుముటకు మూకలంపఁ బడెను. మహారాష్ట్రులలో ప్రధానసైన్యము వీడిపోయెను. అందు సగ భాగము ధనాజీతో కర్ణాటకమున కేగెను. అచ్చట జుల్ఫికరుఖాను, మహా రాష్ట్రులయొక్క చిన్నచిన్న సైన్యభాగములతో జయప్రదంబుగఁ బోరా డుచు, వెల్లూరును పట్టుకొనఁ బ్రయత్నించుచుండెను. ఇందువలన నతఁడు, వారి యధికారము సంపూర్ణముగ నాగిపోవునని తలంచెను. తక్కిన సగము సైన్యమును సతారాయందు రాజునుఁ గలిసికొనుటకుఁ బోయెను. ఇప్పుడు రామచంద్రపంతు యుపదేశమువలన సతారా రాజధానిగఁ జేయఁబడెను.

జనార్దన పంతు చనిపోయినందున అమాత్య యుద్యోగము శక్తిసామ ర్థ్యములచే యోగ్యుండుగ మనము చూచిన రామచంద్రపంతున కియ్యఁబడెను. శంకరాజీ మల్హారు కాశీకిపోయినందున నతని సచివుని యుద్యోగము శంకరాజీ నారాయణ గాండేకరునకియ్యఁబడెను. పరశురాము త్రింబకు యుద్యోగమున కెక్కువ హక్కులుగలవాడనని యందుకు కొంచె మయిష్టముగ నుండెను. జింజీ కోటనుండి యేదోవిధముగ పారివచ్చిన జనార్దనపంతు కుమారుఁడు తిమ్మాజీ రఘునాథ హనుమంతు కుటుంబ హక్కునుఁబట్టి ప్రతినిధిపదవినొసంగఁబడెను.

మహారాష్ట్ర నావిసేనాపతియగు సిద్ధోజీ గుజార్, సిద్దీతో నిరంతర సంగ్రామంబు సలుపుచు, జయాపజయంబుల నొందుచు కాలధర్మము నొందెను. అతని పిమ్మటవచ్చిన కనోజీ ఆంగ్రియాక్రింద మహారాష్ట్ర నావి విలువ ఫలంబుల నొందెను. సకలజాతులవారి నావలు పట్టుకొనఁబడెను. తీరము పొడుగునను మరల మరల దండయాత్రలు సలుపఁబడెను. తిరువాన్కూరు మొదలు బొంబాయివఱకు వారు దర్శనమియ్యని స్థలములు లేవు. తీరమున దుర్గము లనేకములు వారి వశముననే యుండెను. వారి నావికాస్థానములు సువర్ణదుర్గ, విజయదుర్గములలో కూడనుండెను. కాని ముఖ్యస్థానము కొలాబాయందే యుండెను. వాడీయొక్క సావంతులు, వారిజిల్లాలు మొగలులచే జయింపఁబడ నపుడు, రాజారాము పక్షముననే యుండిరి. కార్వారు దేశాయి మాత్రము స్వతంత్రముగనే యుండి రాజాబిరుదు నామము వహించెను.

శాంతాజీ ఘోరేపురే యట్లు శత్రుభట నికాయంబులచేఁ దరుమఁబడి యొకచోటనుండి మఱియొకచోటికి వేటాడంబడెను. అంతవఱకును వారికి చిక్కకఁ దప్పించుకొనుచునే యుండెను. మస్వారు దేశముఖుడగు నాగోజీ మనే తన స్వకీయమత్సరముచే నతని విరామము లేకుండఁ దఱిమి, చివఱకుఁ గలిసికొని యతఁడు నదీజలంబుల విశ్రాంతి దీర్చుకొనుటకు స్నానంబుచేయుచు శత్రువు లెవ్వరును దగ్గర లేరనుకొని యజాగ్రతగ నుండగ నేకాకిని నిరాయుధు శ్రాంతిఁ జెందినవాని నేమరిపాటునమీఁదపడి ఘాతుకవృత్తిని జంపె. దేహమునుండి శిరస్సు ఛేదించినవాఁడై యతఁడు దానిని చక్రవర్తి శిబిరము దగ్గరకుఁ దీసికొనివచ్చి ఔరంగజేబుకు కానుకగా నంపె. అటుపిమ్మట కొద్దికాలమున నాతఁడు మొగలు సేవంజేరి మరల నప్పటి మంజూరీలందఱివలెనే త్వరలోనే మానుకొనెను. ఈ హత్యవలన చేసిన సేవను మొగలు లంగీకరించినట్లుల, క్షమాపణమును, గొప్ప బహుమానమును, మఱికొన్ని బిరుదులు నతనికియ్యఁబడెను. మహారాష్ట్ర చరిత్ర గర్వింపఁదగిన గొప్పయోధులలో శాంతాజీయొకఁడు. అతడు ఏడుసంవత్సరములవఱకు మొగలు సైన్యములకు భయంకర మూర్తి యయిన స్తోత్రంబున కర్హుండు.

శాంతాజీయొక్క మరణమును, ఆ కృత్యముయొక్క దారుణమును, అతని యనేక యనుచరులను వారి కృతఘ్నతా జ్ఞానమునకు మరల దీసికొనివచ్చినవి. ధనాజీ భయమువలన పాఱిపోయి యతనికుమారులగు రానోజీయు శీరాజీయు నతని యన్నకుమారుడైన సిద్ధోజీయు మొదలైనవారలు, శాంతాజీయొక్క యనుచరులు కొందఱివలన మరల త్వరలో గలిసికొనబడిరి. వారు మరల తమ వంశకేతనమును లేవదీసి తమరు స్వకీయముగ మొగలు దేశమును కొల్లబెట్టుచుండిరి.

రాజారాము సతారాయందు కొంతకాలమున్న తరువాత ఉత్తరమునకు సైన్య సమేతుడై వెడలెను. అచ్చట పర్సోజీభాంస్లే, నీమాజీ సింధియా, అథ్వాలీపంషీరు బహద్దర్ మొదలైన సేనాపతులు కొంత
1699 కాలమునుండి ఖాన్ దేశమును, గంగోత్రిని, బేరారులను కొల్లబెట్టుచుండి యప్పుడాయన కెదురువచ్చి కలిసికొనిరి. ఇట్లు గలిసిన సైన్యములు వెనుక శివాజీ నడపిన సైన్యముకంటె నెక్కువగా నుండెను. వీరందఱును గలిసి గంగోత్రిని ప్రవేశించి, తమ స్థిరహక్కులైన చౌతు సర్దేశముఖీల వసూలు చేయనారంభించిరి. ఈ పన్నుల నిచ్చిన వారందఱును రక్షింపబడిరి. దీని కెదిరించి యోడిపోయినవారు హతము గావింపబడిరి. ఈ పర్యాయము మహారాష్ట్రులయొక్క వసూళ్లు, పద్ధతి దప్పకుండ, నుండెను. రొక్కము దొరకినచోట రొక్కమును, లేనిచోట పటేలులనుండి వాగ్దానపత్రములను వారు పుచ్చుకొనియుండిరి. ఈ ప్రకార మందఱును, బేరారు, ఖాన్ దేశములను ప్రవేశించిరి.

రాజారాము తనయొక్క దండయాత్రను చాలవఱకు సమాప్తము చేసిన తరువాత, యతడు ఖండీరావు దాభరేను బగ్లానాలోను, నీమాజీ సింధియాను ఖాన్ దేశములోను, పర్సోజీ భాంస్లేను బేరారులోను, హైబత్రావు నింబాల్కారును గంగోత్రియందును, రాజాకు రావలసిన బాకీ చౌతు సర్దేశముఖీలను వసూలుచేయుటకు నియమించెను.

పర్సోజీ భాంస్లే బేరారునందీ యుద్యోగమందు నియమింపబడినపుడు సేనా సాహేబు సుభే యను బిరుదము నొందెను. హైబత్రావు నింబాల్కారు

సర్ లష్కరను బిరుదమును బడసెను. వీరిద్దఱును జరీ పట్కాల (జెండాలు) నియ్యఁబడిరి. రాజారాము తన తిరుగు ప్రయాణమునందు జాల్నాను కొల్లఁ బెట్టుచుండగ మొగలు సైన్యము హఠాత్తుగ వచ్చి యతనిపైఁ బడెను. వారి మధ్య నలవాటులేని బలవేగంబులతో నత్తఱి మహారాష్ట్ర సైన్యములం దాకిరి. వీరి పర్యాయము జూపిన మగంటిమికి కారణమును దెలుపుటకుఁగాను ఔరంగజేబు జుల్ఫికరుఖానుల చర్యలను మనము పరీక్షింపవలసియుండును.

కర్ణాటకమందు ధనాజీజాధవు వ్యవహారములు జయప్రదంబులుగ లేవు. జుల్ఫికరుఖాను దురాశ దుర్దానపరుండైనను వాడిమగంటిమి గల సేనాపతి. మహారాష్ట్రులు కొంచెమేమాత్రమైన భయమున నున్న నీ మొగలుద్యోగస్థుని వలననే యుండిరి. అతఁడు మరలమరల ధనాజీ నోడించుచు వచ్చెను. రాజారాము యొక్క దండయాత్రను చక్రవర్తి యెఱింగి తత్క్షణము జుల్ఫికరుఖానును బ్రహ్మపురి శిబిరమునకు రమ్మని యాజ్ఞ నిచ్చెను. అచ్చట అసదుఖానుతోడను, ఇంక నితర ముఖ్యోద్యోగస్థులతోడను మంతనంబున నూతనాహవతంత్రంబు ప్రయోగింప నిశ్చయంబు సేయఁబడెను. ఒక సైన్యభాగము మహారాష్ట్రుల రణరంగమునఁ దాకుటకును, ఇంకొకటి కోటలఁ బట్టుటకును నియోగింపఁ బడెను. ఈ రెండవదానిని చక్రవర్తి స్వయముగ నడుపుటకు పూనుకొనెను. మొదటిది, రాజారాము సైన్యమునుఁ దఱుముటకు మనుమండగు కుమార బేదార్ బక్తు (అజమ్ షాకుమారుఁడు) జుల్ఫికరుఖాను సహాయముతో నడుపుట కేర్పాటు చేయఁబడెను. పైన చెప్పినటుల రాజారాము తఱుమఁబడిన దీ సైన్యము వలననే యై యున్నది.

చక్రవర్తి సన్నాహములన్నియు పూర్తియైన పిదప, చక్కని మందిరంబుల నిర్మించుకొని సోమరులై సుఖంబున నున్న మొగలుద్యోగస్థులందఱకును విషాదంబు గలుగునటుల, బ్రహ్మపురి కంటోన్మెంటునుండి శిబిరము లేవఁదీయఁబడెను. మచ్నారు దుర్గరక్షణముక్రింద నొకరక్షక భటస్థానమును, బలమైన కావలిసైన్యము నచ్చట నుంచఁబడెను. ఔరంగజేబు తిన్నగ పశ్చిమమునకు ప్రయాణమై యిరువది దినములలో వసంతగడ కోటక్రింద శిబిరము

తోఁచెను. ఫిరంగిస్థావరములు నిర్మింపఁబడెను. మూఁడురోజులలో కోటకావలి సైన్యము లోఁబడెను. ఔరంగజేబు బందులకు సంతసించి యాకోటకు 'కిలిదిఫత్తే' (జయముయొక్క తాళముచెవి) యని పేరిడెను. పన్హాలా యీ పతకుసుల్తాను మోఅజము కుమారుఁడగు గాయి జొద్దీను వలన ముట్టడింపఁబడి గెలువఁబడనందున, దానిని మొగలులు ముట్టడింతురని మహారాష్ట్రులుద్దేశించి, దాని రక్షణకై తమ సన్నాహంబులఁ జేసికొనుచుండిరి. కాని ఔరంగజేబు సతారా దిక్కున కరిగెను. ఈ కోట రెండుమాసములకు మాత్రము తగినపదార్థ సంగ్రహణమును కలిగియుండెను. గాన నీ గమనము నెవ్వరు నెదురు చూచి యుండలేదని తెలియవచ్చుచున్నది. ఈయశ్రద్ధ గొప్ప దురదృష్టముగ నెంచఁబడెను. ఇందువలన రామచంద్రపంతు బుద్ధిపూర్వకముగ నిట్లు చేసెనేమో యని యొక యనుమానము తోఁచెను. ఈ యనుమానము నౌరంగజేబు తన కనుకూలమగునట్లు ద్రిప్పుకొనెను. ముట్టడి కాలములో రామచంద్రుడు, రాజారాము దేహమునందస్వస్థుఁడగుటవలన, సింహగడకు వెళ్లినపుడు ఔరంగజేబు యొక దొంగయుత్తర మాతనికి వ్రాసి పరశురాము త్రింబకుకు దొరకునట్లు చేసి వారిరువురికీ వరకున్న మనస్పర్థల నెక్కువఁజేసెను.

ఔరంగజేబు సతారాముందు జేరిన తరువాత ఉత్తరపు దిక్కున నిప్పుడు కరింజా గ్రామమున్నచోట తన స్వంతగుడారములను పాతించెను. అజమ్‌షా పశ్చిమదిక్కున నుంచఁబడెను. అప్పటినుండియు షాపూరని యాగ్రామమునకు పేరు గల్గెను. షరాజీఖానుడు దక్షిణదిక్కు బంధించెను. తర్బియతుఖాను తూర్పు దిక్కుఁగాసెను. నాలుగు శిబిరముల మధ్యను పహరాలయొక్క శ్రేణులు రచింపఁబడి సంపూర్ణయవరోధము కల్పింపఁబడెను. సతారాకోట యొక పర్వతశిఖరమున నిలచి యుండెను. పర్వతము సామాన్య పెత్తుగనుండెనుగాని మిక్కిలి నిలువుగ మాత్రముండెను. దానియొక్క రక్షణలు 40 అడుగుల నిలువుటెత్తులుఁగల నల్లని పరుసనగమును దానిపై రాతిగోడయునై యుండెను. శివాజీ సేవయందుఁ బెరిగిన ప్రయాగజీ ప్రభువు దానికి హవల్దారుగ నుండి రక్షించుచుండెను. ఆతఁడు మొగలుల దృఢంబుగ నెదిరించుచు

వారి పురోస్థానంబులను (Advanced Posts), ముందుకు జరుపుకొని వచ్చిన కొలదిని ప్రతిఘటుడుగు భూమికొఱకును పోరాడుచుండెను. వారు గిరిపార్శ్వంబు నే మాత్ర మైన నాక్రమించిన తోడనే, అతఁడు తన భటులను కోటలోపలికిఁ గొనిపోయి నగోపరి భాగమునుండి గండశిలల దొర్లించుచుండెను. అవియు శత్రుజనులపైఁబడి వారడ్డము కట్టుకొనుపఱకును ఫిరంగి గుండులతో సమానముగ వారిని నాశనముఁ గావించుచుండెను. అయినను అవరోధము పూర్ణముగఁ జేయఁబడెను. బాహ్యదేశముతో సంబంధము కట్టువడెను. కోటలోని కొలది నిలువ ధాన్య మాఖరైన పిమ్మట కోటలోని భటులు లోఁబడవలసినదే; పరశు రామ త్రింబకు పర్లీ కోటలోఁ జేరి అజముషాయొక్క యుపేక్షను లంచముచే సంపాదించుకొని, కోటలోని వారికి రహస్యముగ పదార్థముల నందఁ జేయుచుండెను.

పడమట దక్షిణ దిక్కులను ఫిరంగిస్థానములు కట్టఁబడెను. కాని పెద్ద దొమ్మియుద్ధ మీశాన్యమూల జరుపఁబడెను. ఈ ప్రక్క నగము 42 అడుగుల యెత్తును దానిపైన రాతికట్టడము 25 అడుగుల ఎత్తును కలిగి గోపురాకార మైన దృఢస్థాన మై యుండెను.

తర్బియతుఖానుఁడీ మూలను మైను (లోపలసుకన్నము చేసితుపాకిమందు కూరి యంటించుట) చేయ నుద్యోగించెను. అతఁడు నాలుగు నెలలలో
1700 రెండు మైనులను సిద్ధముచేసెను. మొగలులు జయమొందుదు మని విశ్వాసముతో నుండిరి. నగము పగులగనే దొమ్మియుద్ధమునకు దొరకొనుటకు భటనికరంబులు కొండక్రింద, కావలిసైన్యమునకు కనుపడకుండ, సిద్ధముగ నుండెను. ఔరంగజేబీ యాహవక్రియను దర్శించుట కాహ్వానము నేయఁబడెను. కోట కావలిసైన్యము నంతను ఆ వైపున కాకర్షించుట కొక్క యుపాయము పన్నఁబడెను. చక్రవర్తి సైన్యమంతయు నాటోపంబున మహాశ్రేణిగ దూరముగ నడచిపోవుటచే మైనునకు నగ్గి నంటించు నప్పటికి కోట కావలిసైన్యమంతయు నతని యద్భుత యనుచర బృందమునుఁ జూచుట కచ్చట మూగుకొనిరి. మొదటి మైను శ్రేణి నగమునందు బీటలుచేసి కోటనంతను వణఁకించి, రాతికట్టడమును లోపలికి గూలఁద్రోసెను. దాని క్రింద కావలిసైనికు

లనేకులు పడి హతమైరి. దొమ్మియుద్ధపు భటు లాతురమున దగ్గరకుఁ బోయిరి. అప్పుడు రెండవదియు పెద్దదియు నగు మైనునకు నిప్పంటించఁ బడెను. కాని యది తప్పుగ రచింపఁబడుట వలన వెలుపలికి ప్రేలి సుమారు 2000 మొగలు సైన్యమును నాశనము చేసెను. మొదటి ప్రేలుడునకు మహారాష్ట్ర హవల్దారు ప్రయాగజీ,భవానీ దేవాలయము దగ్గిర కూలిన నిర్మాణముల క్రింద,పడెను. కాని యతఁ డచ్చట త్రవ్వఁబడినపుడు, సజీవుఁడై యుండెను. ఇయ్యది శుభసూచన ముగ నెంచి, మహారాష్ట్రులు మరియొకపట్లు నుత్సాహంబుఁ బూని ముట్టడి కెంకను నిలిచియుండెడివారే. కాని అజముషా ధాన్యమును కోటలోనికి పంపు ట కెఁక నుపేక్షింప నియ్యకొనలేదు. అతనిద్వారా లోఁబడుటకు రాయభార ములు జరిగెను. ఔరంగజేబు కోటజయమును అతని కారోపించి యాస్థలము నకు ఆజముతారాయని పేరుఁబెట్టెను.

సతారా, ఏప్రిల్ నెల మధ్యను,లోఁబడెను. పర్లీకోట ముట్టడింపఁబడి జూను నెలలో స్వాధీనమయ్యెను. వర్షఋతువునందు మొగలు సైన్యము లతి కష్టంబులఁ బడుచు మానునదీ తీరంబున కవాసుపురమునఁ జేరుకొనెను. ఈ మధ్యకాలములో మహారాష్ట్ర రాజ్యమున గొప్పమార్పు జరిగెను. రాజారాము వెనుకఁ జెప్పినటుల జుల్ఫికరుఖానుచే తీక్ష్ణంబుగఁ దరుమఁబడి యాయా సముచే రక్తముఁ గ్రక్కుకొని ముప్పదిరోజులు చాలబాధపడి సింహగడ కోట లో మార్చి నెలలో చనిపోయెను.

శాంతాజీ ఘోరేపురే యొక్క నాశము తప్ప నితని చరిత్రయందింకే కళంకమునులేదు. కాని యది మాత్రము సామాన్యమైనదిగాదు. శాంతాజీ యొక్క శత్రువులట్టి దుర్బోధనలు చేసిరని ఇతని పక్షమున క్షమాపణ మనము దలంచినయెడల, నట్టి బుద్ధిహీనస మీ రాజపుంగవుని సుగుణంబుల గొప్పతన మును కొంత తగ్గించుచున్నది. ఇతఁడు తండ్రియొక్క విక్రమ సాహసంబు లను కొంతవఱకుఁ గలిగియుండెను గాని పరిపాలనా వ్యవహారముల నైపుణ్య మేమియును లేనివాఁడై యుండెను. ప్రహ్లాద నీరాజీవలన నితని రాజ్యవ్యవ హారములు ప్రశస్తముగ జరుపఁబడెను. రాజారాము సహజముగ శాంతస్వభా



తారాబాయి (రాజారాము భార్య.) 242

వము కలవాఁడును, దుర్వ్యసనంబులు లేనివాఁడును, తన యనుచరులయెడల ననన్యాదార్యవంతుఁడునై ప్రసిద్ధికెక్కెను.

రాజారాముయొక్క మరణవార్త చక్రవర్తి శిబిరమునం దత్యంత హర్షంబుతో నాలకింపఁబడినను, మహారాష్ట్రుల ధైర్యమించుకయును చలింపలేదు. రాజాకిద్దరు పుత్రులుండిరి. అందు పెద్దవాఁడు, తారాబాయి మొహితీ కుమారుఁడైన శివాజీ, యప్పటికి పది సం॥ వయస్సువాఁడు. రెండవవాఁడు, రాజాబాయి కుమారుడైన శంభాజీ, మూఁడు సంవత్సరముల పిల్లవాడు.

తారాబాయి, రామచంద్రపంతు శంక్రాజీ నారాయణ ధనాజీ జాధవు మొదలైనవారి సహాయ్యమున, పరిపాల నాధికారమును గైకొని, కుమారుఁడైన శివాజీని గద్దెపైఁ గూర్చుండబెట్టెను. రాజాబాయి యందతి యనుమతి మీఁదను ఖైదు నందుంచఁబడెను.

తిమ్మాజీ రఘునాథుఁ డాతని యు తమ యుద్యోగమునకు తగనందున నతనిఁ దప్పించి, పరశు రామంత్రిబకుని తారాబాయి ప్రతినిధి యుద్యోగము నందుంచెను. రామచంద్రపంతుని కీ మార్పువలన కొంత యసూయఁ గలిగెను. కాని తారాబాయియొక్క యాత్మ నిశ్చయభావ లాతని సంతృప్తిపడి యుండఁజేసెను. రామచంద్ర పంతు, తనయెడల కొంత యనుమానము రాణికిఁ గలిగిన దని, యింక నెరుఁగడు. తారాబాయి, తన నివాసము నొక్క చోట స్థిరముగ నుంచుకొనక స్థితిగతుల ననుసరించి యొకచోటనుండి మఱియొక చోటికి మార్చుచుండెను. ధనాజీ జాధవుఁడు విశాల బహిరంగ రణక్షేత్రమున నాహవ క్రియల నలుపుట కారంభించెను. దేశమునం దొకభాగమున మాత్రమే యుండక తన యశ్వసైన్యము నన్ని దిక్కులనువి స్తరింపఁజేసి సాహస కృత్యంబు లనేకములఁ జేసెను. నింబాల్కారు, భాంస్లే, దాభరే మొదలైన వారదే విధంబున ప్రసిద్ధిఁ గాంచిరి. ఘోరాటు, చౌవన్, సింధియా, పవారు, అథ్వాలీ, యింక ననేక ముఖ్యులు ఛౌతు సర్దేశముఖీ ఘాస్‌దానాల నన్ని ప్రక్కలను వసూలు చేయుచుండిరి.

ఇదివరకు వర్ణింపఁబడిన మొగలు శిబిరముయొక్క డంబముతోఁ బోల్చి యీ దోపిడి గాండ్రయొక్క సమూహముల నించుక పరిశీలించు టెంతయు మనోరంజకముగ నుండును. శివాజీయొక్క యంగ నిర్మితంబగు భటని కరంబులవలెఁ గాక, నంతకంటెను దేశమునకు నాశనకరంబులై, వేలకొలఁది గుఱ్ఱపు రౌతులు నానాముఖంబులఁ బోయినట్లు పోయి, వారు ముందుగ నుద్దేశించిన యొక నిర్జన ప్రదేశమున నందఱు నొక్కసారికూడుదురు. వారు భోజనపదార్థములుగాని, గుఱ్ఱపు జీనులపై నొకదుప్పటి తప్ప మఱి దుస్తులమూటలుగాని, లేకుండ గుఱ్ఱములపై దోపిడి ధనముంచుకొనుటకు సంచులనుకట్టుకొని మాత్రము బయలుదేరెదు వారు. రాత్రి యెచ్చటనైన నాగనయెడల, నవీన కాలపు పిండారీలవలెనే కళ్లెములను చేతులలోఁ బట్టుకొని నిద్రించెదువారు. పగ లెచ్చటనైన తమ గుఱ్ఱములకు దాణా పెట్టుకొని కొంచెము విశ్రాంతి నిచ్చునప్పుడు వారు చెట్టుక్రిందకాని పొదల చాటులఁగాని విశ్రాంతిఁ దీసికొనుచుండెడివారు. ఒకప్పు డదియును లేక యెండలోనే నిర్లక్ష్యముగ పడుకొని యుండెడివారు. ఆ సమయములయందు వారి ఖడ్గములు ప్రక్కల నుండును. వారి శూలములు నేలయందుఁ గ్రుచ్చఁబడి వానికి గుఱ్ఱములు కట్టఁబడి యుండును. మైదానమందు వారు నిలచిన యెడల నలుగురైదుగురు మనుష్యులు, తలల నన్నిటిని మధ్య గాఁ బెట్టుకొని, మిట్ట మధ్యాహ్నము పట్టి నేలమీఁద గాఢనిద్రం జెందుచు గుంపులు గుంపులుగ నుందురు. వారి తలలపై నొక చింకిరిగుడ్డ బల్లెములచే విస్తరింపఁబడి నీడనిచ్చుచు చిన్నగుడారమువలె నొకప్పుడుండును. వీరిలో చాలమంది యొక్క ముఖ్య యుద్దేశము దోపిడిగ నుండెడిది.

మంకూరీలు, శివాజీ వంశజులకు భక్తినిఁజూపుచు, నొకప్పుడు వారి జెండాలను జేరుచుండెడువారు. కాని యొక్కొక సమయము మొదవి నపుడు స్వకీయముగఁ దోపిడి కూడఁ జేయుచుండెడి వారు. దక్కనులో చక్రవర్తి, దేశవిాస్థితిలోనుండగ, శిస్తువసూలు చేయఁజాలకుండెను. ఔరంగజేబు తన శాసన ప్రకారము ధర్మమని పేరుపెట్టి వసూలు చేసికొను శిస్తును మహారాష్ట్రులు దోపిడి పేరున నపహరించుచుండిరి. కావున నాతఁడు తన సైన్యమును తన దర్బా

రు డంబమును నిలుపు కొనుటకు హిందూస్థానమునుండి చాలధనముఁ దెప్పించు కొనుచుండెను. సంచుల తరువాతసంచులు ధనరాసులు దక్కనునకు వచ్చి మార్గములో మహారాష్ట్రవానర బలంబుల చేతఁబడుచుండెను.చక్రవర్తిసైన్యము లనేక సమయము లందు బహుపిరికిగా ప్రవర్తించెను.

జుల్ఫికరుఖాను యొక్క నడకలను జయములనుఁ గూర్చి పరిషియన్ వ్రాత ప్రతులందు విపరీతముగా వ్రాయఁబడెనుగాని యవి నమ్మఁదగినవి కావు. కాని యా కాలమున మోగలుద్యోగస్థు లెవ్వరి యందును కొంచెమైన శక్తి సామర్థ్యము కనుపడ నపుడు జుల్ఫికరుఖాను మాత్ర మతని వాడి మగంటిమికి శత్రువులచే నయితము పొగడఁబడెను. ఆ మోగలుద్యోగస్థులలో నప్పుడు రాజ్యసంబంధపు విషయములలో నమ్మకమున కర్హులైన వారెవ్వరునులేరు. వారు బహుమందులుగను ఉపేక్షస్వభావముగలవారు గను ఉండిరి. ఈసర్వసామాన్య నీచత్వంబునకు,చక్రవర్తియొక్క వృద్ధాప్యమును, కుమారుల ప్రవర్తనలును ముఖ్యకారణములు. కష్టకాలమంతయును ముందున్నట్లుండెను. జనులందఱునింకొకయొక్కవ గంద్రగోళకాలకత్యాంతరద్వారమున నున్నట్లుగ నెంచుకొని, యీ వృథాయాసనిరంతర సంగ్రామము కంటె ముందే చక్రవర్తి చనిపోవునపుడు విప్లవము కొఱకు తమ శక్తి నంతను నిలువయుంచు కొనుచున్నట్లుండిరి.

ఔరంగజేబు యొక్క జీవిత మెంతకును సాగుచునేయుండెను. చిట్ట
1701 చివరవఱకును నా వృద్ధుఁడు మహారాష్ట్ర స్వాతంత్ర్యమునునలిపివేయ
వలెనని వ్యర్థ ప్రయత్నములు చేయుచునేయుండెను. ఈ సంవత్స
రము నుండి నాలుగు సంవత్సరములవఱకును ఔరంగజేబు పన్హాలా, విశాలగడ సింహగడ, పురందరు, రాజగడ, తొరణ, చందన, వందన, పాండుగడ,వరుసగ నొకదాని తరువాత నొకదానిని పట్టుకొనుచుండెను. ఇట్లు తమనెలవులగుకోటలనుండి మహారాష్ట్రులు తరుమఁబడి సమదేశములందు క్రమ్ముకొనిరి. 1702 సం॥ లో వారు సూరతుబరహాంపురములలోకప్పములఁ గైకొనుచుండిరి 1705లోవారు నర్మదను దాటితమదోపిడులనుమాల్వాలోనికిజరిపించిరి.ఖాన్ దేశ బేరారులుజయింపఁబడెను. 15000 మహారాష్ట్రులు గుజరాతు లోనికిఁ బ్రవేశించి ఫౌజుదారుల సైన్యముల నెల్లహతముఁ గావించిరి.

ఈవార్త వినినతోడనే చక్రవర్తి జుల్ఫికరుఖానును, మల్వాలోని కంపెను, గయిజుద్దీనును బేరారు సుబేదారుగఁజేసియంపెను, అజముషాను గుజరాతునకు ప్రయాణము చేసెను.

ఈ ప్రయత్నములయొక్క హడావిడియెక్కువే గాని కార్యానిర్వహణ మంతగాలేదు. ఆసక్తిలేదు. ప్రయోజనమేమియును లేదు. సామ్రాజ్యము దుర్భరమాయెను. పరిపాలన పద్ధతులన్నియు సళ్లువడలి పోయెను. ఉద్యోగస్థులందఱును లంచగొండులైరి. రాజ్యము లోలోన జీర్ణమయ్యెను; వెలుపల మహారాష్ట్రశక్తిచే చవుదురికి పోవుచుండెను. ఈరెండు కారణముల వలనను సామ్రాజ్యభవనము ముక్కలు ముక్కలుగాఁ గూలిపోవ సిద్ధముగనుండెను. మహమ్మదీయయుద్ధములచే తయారు చేయఁబడిన మహారాష్ట్రులు తమకలవాటగు దోఁపిడి వ్యాపారమునందు బాగుగ తమ యుద్ధకౌశల్యము నుపయోగించుచుండిరి. ఈ రెంటికిని తోడు వారి యందఱిలోను సోదరభావమును దేశాభిమానమును జేరి వారికార్యములకు బలాధిక్యత నిచ్చుచుండెను. ఎవరికి దోఁచినట్లు వారు మొగలు ప్రభుత్వమునుఁ ద్రోసివేయుటకు ప్రయత్నము చేసిరి. వానరులు లంకపైఁబడినట్లు వారు మొగలు రాజ్యంబుపైఁబడిరి. వారి శక్తిని వారు పూర్ణముగ నెఱుంగరు. రామ కార్యదురంధరులైన కపులు తమయిష్టము వచ్చినట్లు రాక్షసులపైనెట్లుపడి లంకనెట్లుధ్వంసము చేసిరో యటులే వీరును స్వాతంత్ర్యమునొక్క దానిని మనసునందు స్మరణమాత్రము చేయుచు నందుకై మొగలు రాజ్యమున దోపిడి నారంభించి వెనుకముందులేకుండ నిష్టము వచ్చినట్లు యుద్ధము చేసిరి. కాని ముఖ్యమైన నాయకులు మాత్రము తమ బాణంలు నమోఘంబుగ దాస్యరావణునిదిక్కునకే యెక్కుపెట్టి యుంచిరి.

జిల్లాల యధికారములోనున్న మొగలుద్యోగస్థుల లంచములుతిని మరిగి యుద్ధమాఖరై పోయిన లాభము లేదని యుద్ధమింకను వర్ధిల్లఁ గోరుచుండిరి. మొగలులక్రింద సేవలోనున్న మహారాష్ట్రులు తమ దేశీయులు దోఁచి తెచ్చిన ధనముతో వారిలోఁ గూడఁ గలిసి పండుగలు చేసికొనుచువిందుల నారగించుచు సంతోషముగ కాలముఁ గడుపుచు, విడిపోవునపుడు, మాటవినఁబడునంత

దూరము పోయిన తరువాత 'అల్లామదులిల్లా' యని కేకవేసి 'కీర్తివంతుడగు నాలంగీరునకు దీర్ఘాయుష్యమస్తు' యని దీవించుచు మహమ్మదీయులను హాస్యము చేయుచుండెడివారు.

రాజగడ తోరణ దుర్గములను చక్రవర్తి లోఁబరుచుకొనిన తరువాత నతఁడు జున్నారునందు కొన్ని మాసములుండి పూనా ప్రాంతము నాఖరుపర్యాయము విడిచిపెట్టి బీజపూరునకు ప్రయాణమాయెను.

మొగలుద్యోగస్థులలో కొందఱు సంధిఁ జేసికొనుట కాతురులై యుండిరి. ఔరంగజేబు ప్రియ కుమారుఁడైన ఖానుబక్షు బీజపూరునందు స్వతంత్రరాజ్యము నొక దానిని స్థాపింప చాలదినములనుండి యాలోచించు చున్నందున, మహారాష్ట్రుల హక్కుల కొన్నిటి నంగీకరించి వారితో సఖ్యము చేసికొనవలెనని మనసు నందు సంకల్పించుకొని, ధనాజీజాధవుతో తద్విషయమున రాయభారములు నడుప, చక్రవర్తియంగీకారమును సంపాదింపఁ బ్రయత్నముఁ జేసెను.

రాయభారములు, ముందు శంభాజీ కుమారుఁడగు సాహూనువదిలిపెట్టెదమని, మొగలులచేఁ జేయఁబడెను. ఔరంగజేబు కొన్ని దినములలో మహారాష్ట్రులకు దక్కను నందలి యాఱు సుభేలలోను సర్దేశముఖీ నిచ్చుటకును, వారందుకుఁగాను దేశమునందు శాంతి నిరుపద్రవములు కొంత సైన్యము నుంచి నెఱపుటకును సమాధానపడెను. దీనికర్థము వారిని లొంగఁదీయుటకు ఔరంగజేబునకు చేతి కాకపోయెనని యొప్పుకొనుటయే కదా! జనులు పట్టుదలతో నుండి యేకగ్రీవముగ నతనిరాజ్యము నంగీకరింపక పోయినపు డతఁడేమియును చేయులేక నింతవఱకు దిగివచ్చెను. ఈవర్తమానము దెలిసిన తోడనే మహారాష్ట్రులందఱును ధనాజీ జాధవుని జెండాకుఁ జేరిరి. వారొక్కచోఁ గూడుటతోడనే వారియొక్క బలము వారికి గ్రాహ్యమయ్యెను. వారి దండయాత్రల వలన నౌరంగజేబు సైన్యముపడుబాధ వారి కీవఱకు పూర్ణముగఁ దెలియలేదు. వేఱు తమసైన్యము నొక్కచోటఁ జూచుకొనుటతోడనే వారికాశ సహజముగ నెక్కువాయెను. ప్రార్థనలనుండి యడుగుటలును, అడుగుటలనుండి యాజ్ఞాపించుటలుగ వారికంఠస్వరంబు మాఱుచుండెను. శిబిరము దగ్గరకువచ్చి తమలో

70గురు ముఖ్యోద్యోగస్థులకు గౌరవకరమగు దుస్తులు చక్రవర్తినుండి రావలసి యున్నవని నిర్బంధముగాఁ బల్కినందున ఔరంగజేబు వారినుండి తిరస్కారమేగాక ద్రోహముకూడ సంభవింపఁగలదని భయపడెను. కావుననతఁడే సమాధానమును తెగఁగొట్టుకొని, తన రాయభారిని తిరిగి తనశిబిరమునకు బిలుచుకొనెను. మహారాష్ట్రులందుకు క్రోధావేశులై, యారాయభారి తమ శిబిరమును విడిచిపోవుచుండఁగ, నతనిఁ గొట్టిరి. ఔరంగజేబు,మహారాష్ట్రులలో నున్న యల్లరులు తెలుగుదేశమందును కర్ణాటకమందును గూడ వ్యాపించునను, భయముచేత, వెంటనే గూర్పునకుఁ బ్రయాణమాయెను. కాని త్రిలింగదేశమందలి బెహదులును,కర్ణాటకమందు పిండారీలును కొంత యల్లరులు చేసినను,దేశీయులుచోలవలెను దోపిడి వ్యవహారముల కలవాటు పడినవారు కారు. అంతియకాక వారియందు జాతీయోద్యమ మప్పటికుదయించి యుండలేదు. కాని వారుసంగ్రామేచ్ఛ లేనివారు కారు. ఆకాలమున దేహపటుత్వమునం దీ రెండుదేశములవారును మహారాష్ట్రులకు తీసిపోయి యుండలేదు. చక్రవర్తికాల్బలములో చాల భాగ మీకాలములో వీరేయైయుండిరి. అయిన ననేక భాగములందు బందిపోటువాండ్రు బయలుదేరిరి. వారి నాయకులు మిగుల ధైర్యవంతులరై బహిరంగముగ తమ గుంపులు తెచ్చిన బందిపోటుధనమును స్వీకరించుచుండిరి. స్వతంత్రులగు మహారాష్ట్రముఖ్యులు, ముఖ్యముగా ఘోరేపురేలు,బీజపూరు కల్బర్గా బీడరులదగ్గర తరచుగ దోపిడి చేయుచుండిరి. వాకింకరాలో బెహాదునాయకుఁడైన పెమ్మనాయకుఁడు చక్రవర్తి సేనాపతులచే తఱచుగ జరిమానాను విధింపఁబడినను,మొగలులుకొంచెము దూరము పోఁగానే మరలనెప్పటియట్టుల నుండెడివాఁడు. మహారాష్ట్రులీ నాయకునితో ఇష్టముగ నుండెడివారు. చక్రవర్తి సహ్యాద్రి పర్వతములలో దుర్గములను ముట్టడించుచున్నపుడు ధనాజీ జాధవుడు తనకుటుంబమును, ఎక్కువ సురక్షితముగ నుండునని యిక్కడ నుంచెడువాడు. క్రమక్రమముగా నీపెమ్మనాయకుని యధికార మెక్కువైనందువలన చక్రవర్తిమరల బీజపూరు వచ్చినపుడు వానిపై దండువెడల వలసిన వాఁడాయెను.

వాకింకరపట్టణము రక్షకనిర్మాణములు మాత్రముగలిగియుండెను. అయినను ముట్టడి కనేకనెలలు నిలిచెను. పెమ్మనాయఁకుడు పట్టుదలతో రక్షణ చేసి కొనుచు మొగలు పురోస్థాపములను తఱిమివేయుచువచ్చెను. ధనాజీజాధవుడు వారిశిబిరమును విడువకుండ బాధించుచువచ్చెను. చివరకు ధనాజీయొక్క యశ్వసైన్యము వాకింకరదగ్గర కనులబడగనే చక్రవర్తి యుద్యోగస్థులు ముట్టడిని వదలి లజ్జవిడిచి పాఱిందొడంగిరి. మొగలులలో పెద్ద యుద్యోగస్థులు దూరమునందుండిరి. జుల్ఫికరుఖాను మాల్వాలో నీమాజీసంధియాను తఱిమివేసి వచ్చినతరువాత నతనిని, కర్ణాటకమునున్న దావుదుఖానుని వాకింకెరను ముట్టడింప చక్రవర్తి బంపెను. అప్పుడాపట్టణ మిరుగడలవారికిని విస్తార జననష్టము కలిగిన తరువాతఁ బట్టుకొనఁబడెను.

మహారాష్ట్రులు చాలవరకు నుత్తరమున నున్నందున, కర్ణాటకము వారి వలన నెక్కువ బాధింపఁబడలేదు. 1704-వ సం॥ ములో మన్నాజీమోరే వెల్లూరుకోటను మొగలులకిచ్చివేసినందుకు చక్రవర్తిచే మన్సబుదారి వాగ్దానము చేయఁబడెను. కాని యతఁడు దానిని పుచ్చుకొనక మహారాష్ట్రమునకు పోయి మరల తనదేశీయులతోఁ గలిసెను.

మహారాష్ట్రులీమధ్య నన్నిదిక్కులనుఁ దోపిడులు సాగింపుచుండిరి. రామచంద్రపంతు ఆమాత్య మరల పన్హాలాపావనగడలను లగ్గల కెక్కుటవలన పట్టుకొనెను. తారాబాయి యింతటనుండి పన్హాలానుండుటకు నిశ్చయించుకొని రామచంద్రపంతునకు చాలయధికారము నొసంగెను. ప్రతినిధియగు పరశురాము త్రింబకు వసంతగడ సతారాలు మరల బట్టుకొనెను. సతారా అన్నాజీపంతు అను నొక బ్రాహ్మణుని యుపాయమువలనఁ బట్టుకొనఁబడినది. ఈతఁడు జింజీ కారాగారమునుండి తప్పించుకొని సన్యాసివేషమును ధరించెను. సతారాకోట యొక్క మొగలు సైన్యమునకు సాహాయ్యము జేయుటకుఁగాను వచ్చుచున్న

* ఏదైన గుఱ్ఱమెొకప్పుడు నీటిలో నీడనుచూచి బెదరి నీళ్లు త్రాగకుండిన మొగలులు దానిని 'ఏమి నీటిలో ధనాజీరూపము కనుపడినదా' యని గుఱ్ఱమునకుగు హాస్యవాక్యము కలదని మహారాష్ట్రులు చెప్పుదురు.

మొగలుకాప్లలముతో నతఁడు కలిసికొని, వారిని కథలతోడను గానములతోడను సంతోషపెట్టుచు, వారితో బాగుగ సఖ్యము చేసెను. వారును వానియెడల విశ్వాసముగలవారై కోటలోనికి తమతోఁ గూడఁ దీసికొనిపోయిరి. వాఁడు కలుగఁజేసిన సంతోషములకు మెచ్చి వానిని లోపల నుండనిచ్చిరి. అన్నాజీపంతు పూర్వము మావళీ కాల్బలములో కామ్దారుగనుండి యున్నందువలన, కొందఱు తన పూర్వస్నేహితులు సాయము చేసినయెడల కోటను స్వాధీనపఱచుకొను మార్గము నూహించెను. అతఁడు సమయము వేచియుండి, యీయుద్దేశమును పరశురామ త్రింబకునకుఁ దెలియఁబరచెను. అటుల కొందఱు మావళీలచే సహాయము చేయఁబడి యా బ్రాహ్మణుఁడు కోటలోని మొగలు సైన్యములను హతముఁగావించెను.

శంకరాజీ నారాయణు సచివుఁడూరకుండలేదు. మొగలు సైన్యములు పూనాప్రాంతమునుండి తిరుగగనే యతఁడు మరల సింహగడ రాయగడ రోహిడాదుర్గములను పట్టుకొనెను. మొగలు కాపలిసైన్యములో చాలభాగము కర్ణాటక కాల్బలముండెను. వీరు దుర్గములయందు మావళీలతోఁ బెనఁగఁజాలకుండిరి.

ఈకోటలు, ముఖ్యముగా సింహగడ పన్హాలాలు, పోయినందుకు ఔరంగజేబున కెంతయు ప్రాణము విసిగెను. ఈవ్యసనము వలన నతని వ్యాధి మఱింత యధికమై, స్వస్థతలోనికి వచ్చుట కష్టమాయెను.

జుల్ఫికరుఖాను సింహగడను పట్టుకొనుటకు మరల పంపఁబడెను. అతఁ ప్రయాణమై పోకముందు, సాహూనీతని రక్షణలోనికిఁ జక్రవర్తి యిచ్చెను. జుల్ఫికరుఖాను, ఖాను బక్షు గెడలనున్న ద్వేషము చేతఁ గొంత వఱకు సంధికొఱకు చేసిన ప్రయత్నమునుఁ గూర్చి నిగసనగాఁ బల్కెను. ఔరంగజేబు కూడ చేసిన పొరపాటును గూర్చివగచెను. అయినను సాహూను వదలిపెట్టవలెనను నుద్దేశముతో నతఁడిప్పుడు సాహూచేత, సరియైన రాజుయొక్క యధికారము నవలంబింపఁజేయుచు మొగలులకు లోఁబడవలసిన దని మహారాష్ట్రులందఱికిని యుత్తరములు వ్రాయించెను. అతఁడు తక్షణమే సాహూను వదలిపెట్టిన యెడల మహారాష్ట్రులందు కొంతయైకమత్యము విడిపోయెడిదే.

ఏదియెటులున్నను సాహూచే ను త్తరములు వ్రాయించుట మాత్ర మతని పక్షము న నుండి యంత వివేకమైన పనికాదు. అందువలననతఁడు శంభాజీయొక్క రాజ్యాధిపత్యము నంగీకరించి నటులను, అతని నురిదీయించి యుండుట యక్రమ మని యెఱింగియున్నటులను దెలియఁజేయుచున్నది. కావున నందు వలన నే ప్రయోజనమును కలుగలేదు.

జుల్ఫికరుఖాను మరల సింహగడ నాక్రమించెను. కాని యతఁడుమరల వెనుకకుఁ దిరుగగనే శంకరాజీనారాయణుడు మరల సింహగడను వశము చేసికొనెను. ఔరంగజేబుయొక్క మహాసైన్యము తిరిగి అహమ్మదు నగరమునకుఁ బోవుచుండగ మహారాష్ట్రులచే రణంబున దాకఁబడెను. మొగలు సైన్యములలో చాల భాగ మోడింపఁబడినది. మహారాష్ట్రులు తమకు చిక్కిన కీలు నింకనువృద్ధి పఱచుకొనిన యెడల మొగలు చక్రవర్తి వారి చేతులలో ఖైదీయయ్యెడివాఁడే. మొగలు లీ యవమానము మాట మఱచి తమచక్రవర్తి యదృష్టముమీదఁ దప్పించుకొనెనని యది యొక గొప్పగా తమ గ్రంథములందు వ్రాసికొనియున్నారు. చక్రవర్తి సైన్యము యొక్క గౌరవము కొంత ఖానుఆలమ్ అను ధైర్యముఁగల యుద్యోగస్థునిచేఁ గాపాడఁబడెను.

ఔరంగజేబు అహమ్మదు నగరము చేరి తాను 21 సం॥ ల క్రిం దమహా
1707 వైభవముతో శిబిరమును స్థాపించిన స్థలమునందే మరల తన శిబిరము నేర్పఱచి తనయవసాన కాలము సమీపించుచున్నదనియు, తనయుద్ధములు సమాప్తమైన వనియు తన జీవయాత్ర సాంతమైన దనియు, భవిష్యత్తు జెప్పెను. అతని పూర్వపు స్థితికిని ప్రస్తుతస్థితికిని తారతమ్యము హాస్తిమశకాంతరముగ నున్నది. ఈ మధ్యకాలముయొక్క కార్యములను విచారించి చూచిన యెడల యద్భుత చిత్రపటంబు కనులకు పొడకట్టుటయేఁగాక, దోపిడియధికారమెట్లువృద్ధి బొందెనో, అది యెట్లు పోషింపఁబడెనో తెలియఁజేయు చిత్రచరితంబు గ్యానావ్యం బగును. ఔరంగజేబు యొక్క ముగ్గురు కుమారులు అతని కదనంతరము నఱుకుజీవించియుండిరి. సుల్తాను షా అజము (షాఆలమ్) కాబూలు సుబన్నరుగానుండును. అజముసాయిప్పుడు తండ్రిని కలిసికొని మాల్వాగవర్నరు

గాఁ జేయఁబడెను. ఖాన్ బక్షు బీజపూరు గవర్నరుగా నియమింపఁబడి యచ్చటకుఁ బంపఁబడెను.

జుల్ఫికరుఖాను మహారాష్ట్రులను వెన్నుదాకి చని కృష్ణానదినిదాటి, తన పూర్వవైరియయిన శాంతాజీ యొక్క యన్నకుమారునకును అతనిపక్షము వారికిని సాహాయ్యముచేయుచు, తారాబాయి రాజ్యములో దోపిడిచేసినందుకు వారినిశిక్షింపవచ్చిన ధనాజీజాధవునిఁ దఱుముచుపోయెను. జుల్ఫికరుఖాను ఘోరేపురేతోఁగలిసి ధనాజీజాధవుని తఱిమివేసెను. అంత ఔరంగజేబు అహమ్మదు నగరమందు 1707-వ సం॥ ఫిబ్రేవరి 21-వ తేదిన చనిపోయెనను వార్తవినవచ్చెను. అతఁడు వెంటనే యుద్ధక్రియలనెల్ల నుపసంహరించి అజముషా వశములోఁబడిన దక్కను సైన్యముఁజేరఁ బోయెను.

ఇట్లు ఔరంగజేబు ఇరువదిసంవత్సరములు మహారాష్ట్రులతో యుద్ధము చేసి, జయములనొందినను ఓడిపోయిన వారికంటె నన్యాయమైన స్థితిలోనికి వచ్చి, తన యాశామనోరథంబు లందు పరిపూర్ణభంగము నొంది దుఃఖంబుతోడ ప్రాణములు విడిచెను. ఖడ్గంబుచేత నిష్టములేని ప్రజల నోడింపవచ్చునుగాని వారిని ఖడ్గముచేత పట్టియుంచుట యసాధ్యము. హిందూస్థానము పంజాబు కాబూలుల నాయన జయించి రాజ్యముఁజేయఁ గల్గెనుగాని యతని సామర్థ్యము దక్కను నందెందుకును పనికివచ్చినది కాదు. వారికంటె వీరు బలవంతులు కారు, వారికంటె వీరెక్కువ బుద్ధిమంతులుకారు, కాని దేశభక్తి హృదయము లోనఁ గల్గియుండుట వలన నతనికి లోఁబడుటకు మహారాష్ట్రు లియ్యకొన లేదు. అందువలననే మహారాష్ట్రులు కష్టములవలన బలయుతులైరి. మొగలు లైశ్వర్యమువలన బలహీనులైరి. మహారాష్ట్రులలో ప్రతివాఁడును దేశము కొఱకు. పోరాడెనుగాన కష్టమువచ్చినను ధైర్యముతో దాని నంగీకరించెను. మొగలులయందు ప్రతివాఁడును చక్రవర్తియను నొక్కని యైశ్వర్యముకొఱకు పోరాడుచుంటిననని యనుకొనుటవలన కష్టము రాఁగనే యధైర్యపడఁజొచ్చెను. ఇది యే స్వాతంత్ర్యయుద్ధము యొక్క రహస్యము.



సాహూమహారాజు.

252

ప్రకరణము. 14.

మహారాష్ట్ర రాజ్యముయొక్క పునర్నిర్మాణము.

1707—1720.

మహారాష్ట్రులయొక్క స్వతంత్రమును గూర్చినయుద్ధము ముగిసెను. మొగలు సైన్యంబులు దైన్యంబునొందెను. చక్రవర్తి కుమారుఁడగు అజముషా జుల్ఫికరుఖాను యుపదేశముచే సాహూను విడిచిపెట్టెను. ఇరువది సంవత్సరములకు మహారాష్ట్రులప్రభువు మొగలుల నిర్బంధమునుండి వెడలి తన ప్రజలఁ గూడెను. షాజీ శివాజీల కాలమునుండి దక్కనకు వచ్చు నను కొనఁబడిన మహాయాపద కొండవలె వచ్చి మంచువలె విరిసిపోయెను. కాని మహారాష్ట్రులందఱు నొక్కనాయకుని క్రిందనుండి పోరాడక విడివిడిగ నెవరికిఁ దోచి నటుల వారు తమ యిష్టమైన నాయకుల క్రింద పోరాడి మొగలులఁ దూలించిరి. వారియొక్క యాయువు పట్టొక్క నాయకుని యెడలనే కేంద్రము గలిగి యుండక పోవుట వలన మొగలులు దాని గుఱి చూచి కొట్టుట కసాధ్యమాయెను. వారియొక్క ప్రాణము రాయగడ యందుండెనో, జింజీయందుండెనో, పర్వతదుర్గముల నుండునో, సమదేశములం దుండెనో యని ఔరంగజే బనేక విధంబులఁ జింతించిచూచెను. కాని యతఁడు దాని నొక్కచోఁ గనుంగొనలేదు. ఎక్కడ చూచిన నదియే గాన్పించుచుండెను. దేశభక్తి వారి హృదయ సీమల యందుండెను. అయ్యది ఔరంగజేబున కగమ్య గోచరంబయ్యెను. దానితో నతఁడు చాలలేక విషణ్ణుడై ప్రాణముల విడిచెను. మహారాష్ట్రులకు స్వాతంత్ర్యము లభించెను. అంతటితో సరిపోలేదు. దానినిఁ గాపాడు కొనుటకు వారెట్లు ప్రయత్నము చేసిరో అప్పడున్న స్థితిగతులకు వారెట్టి యేర్పాటులు చేసికొని

మాస్వాతంత్ర్యమును నిలుపఁబెట్టుకొనిరో యీ ప్రకరణయందు విచారింపబడును.

ఖడ్గముచేత దేశమును జయించినను, ఆఖడ్గ శక్తిచేతనే దేశమును పట్టియుంచుట యెట్లు లసాధ్యమో యటులనే స్వాతంత్ర్యమును సంపాదించినను, ఆస్వాతంత్ర్యమును సంపాదించిన శక్తిచేతనే కేవల మాస్వాతంత్ర్యమునుఁ గాపాడుటయు కష్టమగును. స్వాతంత్ర్యము కొఱకొనర్చు యుద్ధమందు ప్రతినాయకుఁడును కష్టపడి రక్తమునోడ్చి సంపాదించినభూములనుహక్కులను తమ సామాన్య రక్షణ కొఱకై గూర్చుకొనుట కంగీకరింపఁడాయెను. తా మందఱును కలిసి పాటుపడుట వలననే తాము జయశీలురైన సత్యమును నాయకులందఱును మఱచి పోసాగిరి. ప్రతి వాఁడును తాను స్వతంత్రముగ నుండవలెనని కోరుటవలన దేశమునందు మరల స్పర్థలకు కారణమగుచుండెను. తమలో తమకు స్పర్థలులేక పరస్పర సాహాయ్యము చేసికొనుట వలననే తమ యందఱి స్వాతంత్ర్యము నొనగూడెనను సంగతిని వారంతలోనే మఱచిపోయిరి. పరబల భయంబువలన నొక్క సామాన్యోద్యమమునకుఁ గడంగిన దేశభక్తులా భయంబు బోయినతోడనే మరల భేదభావంబునకు తమ హృదయంబుల నెల విచ్చిరి. చక్రవర్తి కుమారుఁడైన అజముషా సాహూను విడిచిపెట్టుట యందు, మహారాష్ట్రుల జాతీయయభీప్సితంబును దీర్చుటయనుమిషమీఁద వారిలో నంతఃకలహములఁ గల్పింపవలె నను నుద్దేశము కలదేమో యనితోఁచుచున్నది. ఇట్లు దేశమునందు ప్రకృతి చెడిన వివిధనాయకుల మనంబులను సవరించుటకు తగిన బుద్ధిమంతుఁ డుదయింపక పోయినయెడల సాహూకాలము నాటితో మహారాష్ట్ర చరిత్ర యంతమయ్యెడిదే. కాని బాలాజీవిశ్వనాథుఁ డను కొంకణస్థబ్రాహ్మణుఁడు సాహూకాలమున నున్నతికి వచ్చి కొన్ని యేర్పాటుల వలన మహారాష్ట్ర రాజ్యమునకు మఱి నూఱుసంవత్సరముల యాయుస్సుపోసెను. ఆ పద్ధతిలో కూడ కొన్ని లోపము లుండుట వలన నది మరల సంస్కరింపఁబడక పోవుట వలన నంతకంటె యంగనిర్మాణశక్తిగల బ్రిటిషుప్రభుత్వమున కది స్వాధీనమాయెను. ఈప్రకరణమున బాలాజీవిశ్వనాథుఁడు మహారాష్ట్ర రాజ్యమును

ప్రవర్తిత్రాణము చేయుటకుఁగాను విచారణ చేయఁబడును. ఈ విషయమును బుద్ధి
యందుంచుకొని యీ కాలపు కథా సూత్రము ననుగమింతము.

రాయగడ వశము చేసికొనఁబడి నపుడు, శంభాజీ భార్యయు కుమారుఁ
డును చక్రవర్తి శిబిరమునకు ఖైదీలుగ కొని పోఁబడిరని యీవఱకు
1707 చెప్పియుంటిమి. వారు రాజగుడారము లోనికి తీసికొని పోఁబడిరి.
చక్రవర్తి కుమార్తె యగు బేగంసాహేబా యొక్క కోరికప్రకారము వారి కామె
నగ్గఱ బస యేర్పరుపఁబడెను. వారి నిర్బంధ కాలమంతయు నామె వారి
యెడల నపరిమిత దయఁ జూపుచుండెను. పిల్లవాఁడామె నెప్పుడు వదలక
యుండెడివాఁడు. ఔరంగజేబు తన కుమార్తెను జూడఁబోయినప్పుడెల్లను పిల్ల
వాని నతి ప్రేమంబునఁ జూచుచుండెను. సాహూ యొక్క మొదటి పేరు శివాజీ.
ఔరంగజేబు వానికి ముద్దుపేరు సాహూయని పెట్టెను. సాహూయనగా 'సాధు
వు' అని యర్థమిచ్చు పదమునుండి వచ్చి సాహూయని హిందుస్థానీయందు
వాడబడుచు నుండెను. ఈతని తండ్రి తాత లసాధువులై వర్తించి యుండ నిత
డు చిన్నతనము నుండియు సజ్జనుడుగాఁ గన్పడుచుండెనని ఔరంగజేబు తలం
చి యీ పేరుఁ బెట్టెను. ఇట్లు తండ్రి తాతల యెడలఁగల నిరసన భావము న
న్నౌరంగజేబుచే నీపేరుఁ బెట్టబడినను, సాహూ యీ పేరునే తాను యావజ్జీవ
మును ధరించెను. ఈతని రాజ్యకాలము పెద్దదగుట వలన నితని వంశము వా
రందఱికిని సాహురాజా యనుపేరు ఇంగ్లీషువారిచే రూఢముగఁ బెట్టఁబడెను.
ఈ కుటుంబము ననుసరించి వచ్చిన యనుచరులందఱును మొగలు సేవలోనున్న
మహారాష్ట్రు లందఱితోడను కథోపకథ లాడుకొనుట కంగీకరింపఁబడిరి. ఈ
స్వేచ్ఛ సాహూకును, అతని తల్లికిని, శంభాజీ యొక్క దాసీ పుత్రుఁడైన
మదనసింగునకును మాత్రమియ్యఁబడలేదు. తిరుగబాటుచేసిన మహారాష్ట్రు
లెవ్వరితోడను వీరుగాని అనుచరులు గాని మాటలాడ నంగీకరింపఁబడలేదు.

యశోబాయి మంచి వివేకవంతురాలు గాన నే కుట్రలలోనికినిఁ జేర
లేదు. ఔరంగజేబు మనస్సునందు సాహూను విడిచిపెట్టవలయు నను యుద్దే
శ ముదయింపగనే, యతనికి చక్రవర్తి సైన్యమునందున్న యుద్ధప్రసిద్ధ

కొక్కన మహారాష్ట్రియుద్యోగస్థుల పుత్రికారత్నముల నిచ్చి వివాహము చేసి, వారి నింక నితర యనుగ్రహంబుల వలన తన కాప్తులనుఁ జేసి కొనఁదలఁచెను. వీరిలో నొకరు సింధ్ఖేదు యొక్క జాధవుడు. ఇతనికి చక్రవర్తి రుస్తుమ్‌రావు అని బిరుదు నిచ్చెను. రెండవవాడు కున్నేరకార్ పటే లగు సింధియా. ఇతని యొక్క దాసీపుత్ర సంతానమే యొక మహారాష్ట్ర సంస్థానముయొక్క నాయకులుగ నాధునిక యిండియా రాజకార్యములలో ప్రసిద్ధులైరి. సాహూ తల్లి వైపుననుండి జాధవ వంశమువారితో నీవఱకు సంబంధము కలిగి యుండెను. సాహూయొక్క శోభనము డంబముతోఁ గాకపోయినను యథావిధిగ గౌరవముతో జరుపఁబడినది. చక్రవర్తి, జాధవు సింధియాలకు ననుగ్రహములు చూపుటయే గాక, సాహూను అక్కలకోట, ఇందుపూరు, సోపా, నవాసా ప్రాంతములు జాగీరుగ నిచ్చెను. ఈ సమయమున ఔరంగజేబు, సాహూ కితర బహుమానములతో పాటు, తాను తఱచుగ ధరించుచుండు నొక ఖడ్గమును, సాహూయొక్క యనుచరు లెప్పుడు నతని పలుమారు సాధ్యమైన యెడల సంపాదించ వలసినదని కోరుచున్న మఱిరెండు ఖడ్గములును ఇచ్చివేసెను. ఇందొకటి శివాజీయొక్క పేరు జొందిన భవానీఖడ్గము రెండవది అఫ్జులుఖాను నుండి గ్రహించినది.

కాని ఔరంగజేబు మన మీపఱకుఁ జూచినతీరున తన యుద్దేశమును వెంటనే నెఱవేర్చుకొనలేక పోయెను. అతని మరణానంతరము సాహూ ఆజముషా శిబిరము నందుండుచు వచ్చెను. అతఁడును, తన సోదరుఁడగు సుల్తాను మోఅజము తండ్రి సింహాసనముకై లాహోరునుండి వచ్చుచుండ, తన సైన్యములో నరుగుచు సాహూను నర్మదా నదినిదాటి చాలవఱకుఁ దేసికొని పోయి యుండెను.

తారా బాయియు ఆమె మంత్రులును, మోగలు సైన్యములు లేని కారణమున నాసమయము నింకనభివృద్ధి చేసికొనుచుండిరి. ధనాజీజాధవుఁడు పూనా ఖాజుదారగు, లోడీఖాను నోడించెను. అటుతరువాత చాకనను పట్టుకొనెను. మహారాష్ట్రి యెల్లదేశము నాక్రమించి కొల్లఁబెట్టుచుండిరి. అప్పుడు జుల్ఫికరు

ఖానుని యుపదేశముచే అజముషాసాహూను వదలిపెట్టి, తల్లిని యతని సోదరుని కుటుంబమును మాత్రముసత్ప్రవర్తనకు జామీనుగ తనదగ్గఱనుంచుకొనుటకు నిశ్చయించెను. అతఁడు తన యధికారమును సంపాదించుకొనఁగలిగి, భక్తివిశ్వాసములతో నున్నయెడల తాతగారిచే బీజపూరునుండి జయింపఁబడిన దేశమును, ఇంకను భీమగోదావరీ మధ్యదేశము నియ్యఁబడునట్లు వాగ్దానము కూడ చేయఁబడెను.

సాహూ తన యనుచరులలో నొకని, బేరారు ఖానుదేశములందు మహారాష్ట్ర సైన్యముల కధిపతులైన పర్సోజీ భోంస్లే చిమ్నాజీ దామోదరుల దగ్గఱకు, తాను వచ్చుచున్నానని దెలియపఱచుటకును, సాహాయ్యమునిమ్మని గోరుటకును,పంపెను. వారు తత్క్షణమే యామోదించిరి. హైబత్రావు నింబాల్కరును, నీమాజీ సింధియాయును తక్కినవీరపురుషులును సమ్మతించిరి. తారాబాయికి తెలియఁబరచుచు నుత్తరములువ్రాయఁబడెను; కాని యామె యంతకాలమునుండి యనుభవించుచున్న యధికారమును విడువనొల్లక, రాజ్యమునకు తన కుమారునకున్న హక్కులఁ బోఁగొట్టుకొనలేక, అతడుశంభాజీ కుమారుఁడు కానట్లు నటియించి,మంత్రులనెల్ల రావించి,యతని నెదిరింప నుద్యోగించితినని ఎఱిఁగించి ముఖ్య యుద్యోగస్థులందఱును తనకుమారుని యెడల విశ్వాసముతో నుందుమని శపథంబులు చేయ నాజ్ఞాపించెను. వారందు కంగీకరించిన పిమ్మట, రామచంద్రపంతు నీలూపంతులను, తనకు వారి సలహాలతో సాయము చేయనియమించెను. ధనాజీజాధవు పరశురామత్రింబకులను, రణరంగమునందు రక్షింప నియోగించెను; శంక్రాజీ నారాయణుని ఘూట్నాతాను రక్షింపుమనెను; కనోజీ ఆంగ్రియా శూరఖేలు నావి కధిపతిగ నున్నందున నతని తీరముఁగాయ నియమించెను. వాఁడీ యొక్క పూందుశావంతు తారాబాయియెడల విశ్వాసవంతుడుగ నుండునని వార్తనంపె.

సాహూ, తాను నిజమైన వారసుకాఁడని యభిప్రాయ మేమైననున్న యెడల నట్టిదానిని తీసివేయుటకు, ఈసంగతులు విన్నతరువాత కొంతకాలము వఱకు, గోదావరియొద్ద నాగెను; కాని యాతని సైన్యము 15000వఱకు పెరిగిన

మీఁదట నతఁడు పర్నాజీయొక్క సలహావలన నిఁక నాలస్యములేకుండ ప్రయాణమగుటకు నిశ్చయించుకొనెను. ధనాజీ జాధవుఁడును, ప్రతినిధియు నతని నడ్డగింపవచ్చిరి. గ్రామజనులు తారాబాయి పక్షమునకు మ్రొగ్గునట్లు కనుపడిరి. ఒక గ్రామమువా రతని భటులపై నగ్నివర్షంబుఁ గురిపింపకూడ సాహసించిరి. అతని భటుల సేకులు చచ్చుటవలన నచ్చట సంకులసమరంబు సలిపి యపరాధుల నుదాహరణంబునకు శిక్షింపవలసి వచ్చెను. ఆయుద్ధసమయమున నొక స్త్రీ తన చేతులతో నొకపిల్లవాని నెత్తుకొని పరువెత్తి వచ్చి వానిని రాజసేవ కర్పించితినని యతని పాదములముందు పడవేసెను. సాహూ వానిని తన రక్షణక్రిందకు తీసికొని, తన జయమునకు స్మారకంబుగ నతనికి * ఫత్తేసింగు అను నామంబిడి యటు తరువాత వానికి భాంస్లెయను తన యింటిపేరు కూడ నిచ్చి తన కుమారునివలె నెప్పుడు నాదరించుచుండెను. అక్కలకోట రాజులయొక్క చిత్రమైన యుత్పత్తియిదియే.

సైన్యములు దగ్గఱకు చేరినకొలదిని, తారాబాయి పక్షమునుండి ధనాజీజాధవుని భేదించు ప్రయత్నములు సఫలంబుగఁ జేయఁబడెను. ప్రతినిధి, పూనా కుత్తరమున 22 మైళ్ల దూరముననున్న ఖేడు గ్రామమున యుద్ధమున సహాయముచేయఁబడని వాఁడగుటచే, ధనాజీయొక్క సైన్యములనుండివిడిపోయి, సతారాకు పాఱిపోయెను. సాహూ ధనాజీచే కలుపఁబడినవాఁడై, చందనువందను దుర్గములపై కేగి వాని వశముచేసికొనెను. తనకు వ్యతిరేకముగ పనిచేయుచున్న వంశములవారి నందఱి నతఁడు పట్టుకొనెను. పంతు సచివుఁడగు శంకరాజీ నారాయణునకు పురందరు దుర్గము నిమ్మని యాజ్ఞనంపెను. పరశురాముత్రింబకునకు సతారాను వశముచేయుట కాజ్ఞచేసెను. వారిలో నెవ్వరునందు కంగీకరించలేదు. కాని షేకు మీరాయను నొక మహమ్మదీయ యుద్యోగస్థుఁడు ప్రతినిధిక్రింద పనిచేయుచు, నతని బంధించి కోటను వశముచేసెను.

సాహూ సతారాను వశము చేసికొనిన పిమ్మట మార్చి నెలలో యథావిధి

---

* ఫత్తేయన జయము.

సింహాసనాసీనుండయ్యెను. గుడాధరు ప్రహ్లాదు ప్రతినిధిగా నియమింపఁబడెను.
1708 భైరూపంతె పింగళే పీష్వాగాఁ జేయఁబడెను. ఈతని సోదరుఁడగు నీలూపంతు పింగళే తారాబాయి పక్షమునే యవలంబించి యుండి తరువాత కొద్దికాలమునకు రంగనా యందు లోకాంతరగతుఁడయ్యెను. ధనాజీజాధవుఁడు సేనాపతిత్వమున స్థిరపఱుపఁబడెను. చాల జిల్లాలయందు శిస్తు వసూలు చేయు నధికార మతని కియ్యఁబడెను. ఈ గందరగోళ కాలములో రివిన్యూ యొక్క పద్ధతి ప్రకారము చేయఁబడలేదు. కప్పములవలె పెద్ద మొత్తములుగ నప్పుడప్పుడు వసూలు చేయఁబడుచుండెను. రివిన్యూ వ్యవహారములలో ధనాజీ జాధవుడు నియమించిన ముఖ్యకార్యకర్తలు, శాస్వదు కులకర్ణియైన ఆబాజీ పురందరే యొకఁడును, చౌలు జిల్లాలో శ్రీవర్ధన గ్రామముయొక్క కులకర్ణియగు నింకొక బ్రాహ్మణుఁడు నైయున్నారు. ఆ గ్రామములో సిద్దీకి వైరియగు ఆంగ్రియాకు సంబంధించిన కుట్రకారణమున నా రెండవకార్యకర్తయక్కడ నుండి పూనాదగ్గరనున్న శాస్వదునకు పాఱిపోయి వచ్చెను. ఇతఁడు ఆబాజీ పురందరే చేతను, పరశురామత్రింబకు చేతను ధనాజీ జాధవునకు సిఫారసు చేయఁబడెను. పీష్వాయధికారమునకు మూలపురుషుండుగఁ దరువాత ప్రసిద్ధి వహించిన నీకులకార్ణియే బాలాజీ విశ్వనాథుఁడు.

ఈ మధ్య ఔరంగజేబు యొక్క పెద్దకుమారు లిద్దఱును ఆగ్రాయొద్ద పోరాడిరి. అందు అజముషాయు నతనియిద్దఱు కుమారులును మహారాష్ట్ర యుద్ధమున ప్రసిద్ధి కెక్కిన యోధులును యుద్ధమునందు మడిసిరి. జుల్ఫికరుఖాను అజముషాపక్షమున పరాక్రమంబుతో పోరాడి యోడిపోయిన తోడనే రణక్షేత్రమునుండి తప్పించుకొని పోయెను. సుల్తాను మోఅజము అతనిని రావించి తన యొద్ద గొప్పయుద్యోగము నిచ్చి అమీరు లుమ్రావు అనుబిరుదుతో దక్కనుకు వైసరాయిగఁ జేసెను. ఔరంగజేబు యొక్క మూఁడవ కుమారుఁడగు ఖానుబక్షు బీజపూరుగోలకొండల రాజ్యాధిపత్యమును వహించి, తండ్రి మరణానంతరము చక్రవర్తిగఁ బ్రకటించుకొని యుండెను. మోఅజము జయంబునొంది

---

* ప్రస్తుతము గొప్ప పురందరే కుటుంబమునకు మూలపురుషుఁడు.

హిందూస్థాన సైన్యమంతటి తోడను దక్కనుకు వచ్చి యౌదార్యముతో తమ్మునకు బీజపూరు గోలకొండ లిచ్చుట కుద్యుక్తుఁడయ్యెను. కాని యంతకు పూర్వమే తన యస్థిరప్రవర్తనచే నందఱి భక్తినిఁ బోఁగొట్టుకొన్న ఖానుబక్షు హిందూస్థానముయొక్క యావత్సైన్యముతో పోరాడ నిలిచెను. హైదరాబాదు నందు జరిగిన యుద్ధములో నతని పూర్వ బలవద్విరోధి యగు జుల్ఫికరు ఖానుని చేతిలో నతఁడు హతుఁడయ్యెను.

సుల్తాను మోఅజము, జుల్ఫికరుఖానుయొక్క యుపదేశములవలనఁ సాహూ పక్షము నవలంబించెను. ఇంకను సర్దేశముఖీ హక్కుకూడ లాంఛనముగ నంగీకరింపఁబడెడిదే. కాని మంత్రియగు మోనియముఖాను తారాబాయి యొక్క వకీళ్లచే దర్శింపఁబడి యామె కుమారుఁడే యథార్థమైన వార సని బోధింపఁబడుచుండెను. జుల్ఫికరుఖానుఁ డాతఁడట్టి రాయభారములకు చెవి యొగ్గినందుకు తన విసుగును గూడ పైకిఁ గనుబఱచెను. మోఅజము తనమంత్రికి వ్యతిరేకముగఁ జెప్పలేకను, అట్టి హక్కునిచ్చుట కింక కొంతకాలము గడుచుటకు నుద్దేశించి, సర్దేశముఖీకి పత్రములు సాహూ పేర వ్రాయించి మహారాష్ట్రాధి పత్యము యుద్ధమువలన స్థిరపడు వఱకును కాగితములు మాత్రమీయకుండ నుండుట కేర్పాటు చేసెను.

సాహూయొక్క సైన్యము వర్ష కాలమున సతారా సమీప దేశమందు నిలుపఁబడెను. అతఁడు తన శత్రువు నోడించుటకే ప్రయత్నము నశ్రద్ధ చేయలేదు. బొంబాయి గవర్నరును, కొన్ని ఫిరంగులును, మందు సామగ్రిని, కొంత ధనమును, యురోపియను సోల్జరుల నిమ్మని సాహూ యడిగెను కాని యతఁడియ్యలేదు. వర్షాకాలమంతము కాగానే, దసరా యుత్సవమైన పిమ్మట తారాబాయిపై యుద్ధ సన్నాహములు సేయఁబడెను. పన్హాలాకోట ముట్టడింపఁబడెను. హవల్దారు తన యుద్యోగ ముంచఁబడిన యెడల లోఁబడెదనని చె
1709 ప్పెను. అందు కంగీరింప నతఁడు కోటను స్వాధీనముచేసెను. విశాలగడయు పరశురామత్రింబకు యొక్క వకీలువలన నష్టీచేయఁబడెను. సాహూ, తరువాత తారాబాయి యున్న, రంగనా కోటపై కేగెను. అతని

రాక విని యామె మాల్వానుకోటకు పాఱిపోయెను. రంగనాకోట హావల్దారు ధైర్యముతో ముట్టడి వారి నెదిరించెను. సాహూ వర్షకాల మాసన్నమైనందున కొల్లాపురమున కరిగి యచ్చట సేనలను విశ్రమింపఁజేసెను.

మరల వర్షములు సాంతమైన పిమ్మట యుద్ధ ముపక్రమింపఁ నుద్దేశింపఁబడెనుఁగాని యీ తరుణములో మోగలులతో సంధి చేసికొనఁబడుట వలన వార సత్వపు వివాదము నిర్ణయము కావలసిన యగత్యము లేకపోయెను. అందువలన తారాబాయి నోడింపవలసిన యవసరము కూడ మునుపటికంటె తగ్గిపోయెను. జుల్ఫికరుఖాను తాను హిందూస్థానమునకుఁ బోయినపుడు దావూదుఖాను పన్ని తనకు బదులుగ దక్కనుయొక్క యారు సుభేలందును రాజ్యము చేయ నియమించెను. దావూదుఖాను, సాహూ పరిపాలన నంగీకరించిన మహారాష్ట్ర ముఖ్యులందఱకును రివిన్యూలో నాలవపాలు నిచ్చెదననియు, దానిని తానే వసూలుచేసి తన యేజంటుల ద్వారా నిచ్చెదననియు వారితో సమాధానము చేసికొనెను. ఇందువలన నన్ని వివాదములును చాలవఱకు మాసిపోయెను.

ఆ సంవత్సరాంతమున సాహూ సతారాకు తిరిగివచ్చి యిద్దఱు భార్యలను పెండ్లాడెను. ఒక యామె మోహితీ వంశజురాలు; రెండవామె సిర్కెవంశజురాలు. అతని యొక్క మొదటి యిద్దఱు భార్యలును తల్లితో ఢిల్లీయందే యుండిరి. అందొక యామె, సింధియా కుమార్తె, తరువాత కొన్ని దినములకు చనిపోయెను. ధనాజీ జాధవుఁడు కాలియందు ప్రాఁత గాయమొకటి మరల బ్రద్దలగుటచే చాలరోజులు వ్యాధిగ్రస్తుఁడై కొల్లాపురము వచ్చుచుండగ వరణా ద్వీపవతీ తటాంచలమునందు పరలోక గతుండాయెను. అతని కార్కూను, బాలాజీ విశ్వనాథుఁడే ప్రయాణమునందు వెంట నరిగి, యతని వ్యాధికాలములో నతని వ్యవహారము లన్నిటిని చూచుచుండెను. ఇందువలన ధనాజీ కుమారుఁడగు చంద్రసేన జాధవునకును, ఇంక నతని సేవయందున్న ననేకమంది బ్రాహ్మణులకును నతనియెడల యీర్ష్యకలిగెను.

సాహూ సైన్యములు పూనా కింకను జేరక మునుపే, తారాబాయి పన్హాలా హావల్దారుని ప్రోత్సాహము వలన, పూంఢు శానంతుని సాహాయ్య సైన్య

1710 ములో కూడుకొని, యచ్చటకు వచ్చెను. పన్హాలా యామె వశము
చేయఁబడెను. ఆమె పక్షమునకు కొంత గొప్పతనము వచ్చుటకు
నాకోటయు దగ్గరనున్న కొల్లాపుర పట్టణమును ఆమె రాజధానిగాఁ జేయఁ
బడెను. రామచంద్ర పంతు ఆమె పక్షమునందు స్థిరముగ నుండెను. శంక్రాజీ
నారాయణుఁడు కూడ నామె యెడలనే విశ్వాసముతో నుండెను. ఇతఁడాక్ర
1711 మించుకొనిన దేశభాగము మొట్టమొదట శివాజీయొక్క సామ్రా
జ్యమునకు శంఖుస్థాపన చేసినస్థలంబు గావున, పన్హాలాను జయించు
టకంటె నీ పంతు సచివుయొక్క దేశమును వశము చేసికొన సాహూ నిశ్చ
యించెను. ఈ సమయములో నతఁడు తన రాజధాని నహమ్మదు నగరమునకు
మార్చ దలంచెనుగాని యది జుల్ఫికరుఖానున కసమ్మత మగుటచే మానివేసెను.

పూనాదిక్కున కొక సైన్యము బయలుదేరి రాజగడను వశముచేసికొనెను
కాని సచివుని యొక్క కోట లన్నియును భోజనాది పదార్థములతో పుష్కల
ముగఁ నుండుటవలనను, మావలీ ధీరులచే పరి రక్షింపఁబడుట వలనను,
దుస్సాధ్యములై యుండెను. కాని సచివుఁడు సరియైన రాజునకు వ్యతిరేక
ముగ తారాబాయి పక్షము నవలంబించుటకు శపథము తీసికొనినందుకు పశ్చా
త్తప్తుఁడై జలసమాధి * వలన ప్రాణములు విడువ నిశ్చయించుకొనెను. ఇందు
వలన నైన కోటలు స్వాధీన పడగలవని యది వినినప్పుడు సాహూ సంతోష
మునొందెను.

ఈ సమయములో, జనేవరి మాసమున, తారాబాయి కుమారుఁడగు శివాజీ
1712 స్ఫోటకముచే మృతి నొందెను. ఈరాజకుమారు డున్మత్తుఁడు, కాని
యతని మరణము వలన కొల్లాపురమునందు విస్తారముమార్పుకలిగెను.

---

* జలసమాధి యనగా కుండలు కొన్ని భోర్లించివానిపై నొకబల్లచెక్క
వేసి తెప్పవలె కట్టి దాని నొక పుణ్యనది యందుగాని సరస్సునందుగాని
వేసి యాకుండలకు సన్నని రంధ్రములుచేసి దానిపై నాత్మహత్యచేసి కొనఁదల
చినవారు ప్రాయోపవిష్టులగుదురు. కొంతసేపటికి మెల్లగా నా కుండలోనికి
నీళ్లువచ్చి తెప్పపై వానితో కూడమునగును.

రామచంద్రపంతు ఈతరుణమునఁ గొని తారాబాయిని పరిపాలన నుండి తొలఁగించి, రాజారాము యొక్క రెండవ భార్యయగు రాజాబాయి నామె స్థానమందుంచి యామె కొమారుడగు శంభాజీని గద్దెపై నెక్కించెను. ఈపద్ధతి హిందూధర్మశాస్త్ర ప్రకారమే గావున నందఱిచే నంగీకరింపఁబడెను. తారాబాయియు, ఆమె వితంతు కోడలగు భవానీ బాయియు కారాగారమునం దుంచఁబడిరి. భవానీబాయి మగడు పోవునప్పటికి గర్భిణి యైయుండెను. రామచంద్రపంతు, తారాబాయి యొక్క యడ్డ మేమియు లేక పోవుట వలన నెక్కువ తీవ్రముగ పనిచేయుచుండెను.

దావూ దుఖాను గవర్నమెంటు ఉన్నంతవఱకు, సాహూయొక్క యాధిక్యత కేమియు నుపద్రవములేదు. మంచి యనుభవ శాలురగు మంత్రులచే నతఁడు కొలువఁబడుచుండెను. శంభాజీయొక్క దుర్వ్యసనము లేవియు నతనియందులేవు. శంకరాజీనారాయణుడు చనిపోవుటవలన కొల్లాపురపు పక్షమునకు జాలనష్టము కలిగెను. సాహూ తన సహజమగు సామభావముతోడ శంకరాజీ కుమారుఁడును, అప్పటికి రెండేండ్లవాఁడగు నారూ శంకరునకు పంతుసచివు యుద్యోగమును స్థిరపఱచుచు దుస్తుల నంపెను. ఈ యేర్పాటు వెంటనే యా పక్షము వారి యొక్క విశ్వాసమును సంపాదించెను. సచివు మరెప్పుడును తరువాత భక్తినుండి తొలఁగి పోలేదు. ప్రతినిధి కుటుంబము యొక్క మెంబరుల నీ విధముగ తన పక్షమున కతఁడు త్రిప్పుకొన లేక పోయెను.

సాహూ పరశురామ త్రింబకును ఖైదునుండి విడిపించి, గదాధర ప్ర
1713 హ్లాదును తొలఁగించి, ప్రతినిధి యుద్యోగము నతనికి మరల నిచ్చి విశాలగడయు దానికి సంబంధించిన ప్రాంతములును వశముచేసెను. ప్రతినిధి తన పెద్ద కుమారుఁడగు కృష్ణాజీభాస్కరుని నా దుర్గమును తత్ప్రాంతములను పాలించుటకుఁ బంపెను. కాని యతఁడు తత్ప్రాంతములు వశమయినంతనే తిరుగఁబాటు చేసి శంభాజీకి తన సేవనర్పించి, కొల్లాపురమునందు ప్రతినిధి యాయెను. ఈద్రోహమునకు పరశురామ త్రింబకు మరల ఖైదునందు త్రోయఁబడెను. ఆతిరుగబా టతనిచే ప్రోత్సాహము చేయఁబడెనని

సాహసాయుము పూనించి యతని చంపింప నుద్దేశించెను. కాని యా యుద్య మమునుండి యతఁడు తొలఁగింపఁబడెను.

చక్రవర్తి దర్బారు నందు జరిగిన మార్పుల కారణమున, దావూదుఖా ను గుజరాతు గవర్నమెంటువకు పంపఁబడెను. ఇందు వలన మొగలు మహా రాష్ట్రుల సంధి యాఖరయ్యెను.

ధనాజీ జాధవుఁడు చనిపోయినపిమ్మట, నతని కుమారుఁడగు చంద్రసేన జాధవుడు సేనాపతిగ నియమింపఁబడి సతారానుండి గొప్పసైన్యముతో మొగ లు జిల్లాలనుండి చౌతు సర్దేశముఖీ ఘాస్ దానాలు వసూలు చేయుటకు పం పఁబడెను. అతనివెంట తండ్రియొక్క కార్యకర్తగు బాలాజీ విశ్వనాథుఁడు, రాజా కొఱకుఁగాను రివిన్యూలో కొంతభాగమును వేఱుగఁ దీని సేకరించుటకు నియమింపఁబడి పంపఁబడెను. అట్టి పై యధికారమును సేనాపతి సహించి యుండఁజాలడు. పూర్వము కొద్దిగ నున్న మత్సరము దశగుణితమై వి స్తరిల్లినది. కావున చంద్రసేనుఁడొకసారి, వేటయందు బాలాజీయొక్క యాశ్వికులు తన లేడి నొకదానిని కొట్టిరను స్వల్పవిషయమునుగురించి కలహము కల్పించుకొని, తన మనసునం దణచి పెట్టుకొని యున్న యాగ్రహము నెల్ల వెడలఁజూపెను. బాలాజీ పాఱిపోయి తనప్రాణమును గాపాడుకొనవలసిన వాఁడాయెను. మొ దట అతఁడు శాస్వదునకుపోయెను. అచ్చట పురందరలోని సచివునియేజంటు, అతఁడు కోటలో ప్రవేశింప నిమ్మని యెంత వేడుకొనినను, రక్షించుటకు సాహ సించ లేకపోయెను. అతనిని తఱుముకొని వచ్చుచున్న ఆశ్వికులు దృగ్గోచర మయిరి; కాని కోట హవల్దారు మూర్ఛించి యుండెను. అప్పుడు కొంద ఱను చరులతోడ, కుమారులగు బాజీరావు చిమ్మాజీలతో కూడ నెదురుగ నున్న పాండుగడకోటకు ఏఱు దాటిపోవ యత్నించెను. జాధవుని యాశ్వికు లప్పుడే యతని మార్గమును పట్టి వచ్చుచుండిరి. ఇట్టిమహాపత్కాలములో నొక చోట కొన్ని దినములవఱకు దాగియుండెను. అప్పు డిద్దఱు మహారాష్ట్రులు, పీలాజీ జాధవు అను నతఁడును, ఘూమాలు అను నతఁడును, అతని సేవలో సా మాన్య సిలేదారుగ నున్నవారు, తమ బంధువులను కొందఱునుఁ గూర్చుకొని,

కొంత యశ్వసైన్యమును పోగు చేసికొని, తమ ప్రాణములనైన నర్పించి యతనిని, అతని కుమారు లిద్దఱను, పాండుగడ యొద్ద మాచి గ్రామమునకుఁ గొనిపోవుటకు వాగ్దానము చేసిరి.

బాలాజీ విశ్వనాథుఁడు, గుఱ్ఱపు సవారు* చేయుటకప్పటి కలవాటు పడినవాఁడు కాఁడని యతని జీవిత చరిత్రకారుఁడు చెప్పుచున్నాఁడు. కాని సిలేదారులు, చిన్న జగడమొకటి చేయవలసినవారైనను, తమ వాగ్దానమును విశ్వాసముతో నెఱవేర్చిరి. కోట హవల్దారు కూడ సాహూరాయొక్క యాజ్ఞ ప్రకార మతని రక్షించెను. చంద్రసేన జాధవుఁడు గీర్వాణంబుతోడ నతని తన వశము చేయవలసినదని కోరుచు, నట్లు చేయనియెడల సాహూరాయొక్క సేవను విడుతునని బెదరించెను. సాహూరా ఈ ధిక్కారపు కోరికకై శిక్షించుటకు సంసిద్ధుఁడు కాలేదు గాని బాలాజీని మాత్రము వశము చేయుటకు నిరాకరించి, అప్పుడు అహమ్మదు నగరమునందున్న సర్ లష్కరు హైబత్రావు నింబాల్కరును తత్క్షణము సతారాకు రమ్మని యాజ్ఞనిచ్చెను. ఈ మధ్యకాలములో బాలాజీ విశ్వనాథుఁడు పాండుగడలో చిక్కుఁబడి యుండెను. సేనాపతి సైన్యములు చుట్టుముట్టడించి యుండెను. హైబత్రావు నింబాల్కరు ఇదివఱకే సేనాపతిగఁ జేయఁబడనందు కసూయాపరుండై యుండి, జాధవుని ప్రవర్తనకు ఆగ్రహావేశుఁడై త్వరితగతిని నాజ్ఞను శిరసావహించెను. జాధవుఁడు, అతడు ఫల్టనుకు చేరిన వార్త నెఱింగి, పాండుగడను విడిచి, దేవూరునకుఁ బోయెను. రెండు సైన్యములకును సమావేశమై యుద్ధము జరిగెను. జాధవుడోడిపోయి ఘాట్గేషిరాజీరావుతోఁ గూడ కొల్హాపురమునకుఁ బోయెను. అచ్చట నతఁడు శంభాజీవలన కాగలు వారసత్వపు వతనునందు స్థిరపరుపఁబడెను. వారిద్దఱును గలిసి, అప్పుడే మొట్టమొదట దక్కనుకు వైసరాయిగ నియమింపఁబడిన చేనుకూలిచిఖాను (నిజాముల్ ముల్కు) ను జూడఁబోయిరి. అతనియొద్ద

* ఇద్దఱు మనుష్యులు చేరియొక వైపున గుఱ్ఱముమీద నప్పు డతనిపట్టుకొని యుండవలసి నట్లుగా జీవితచరిత్రకారుఁడు చెప్పుచున్నాఁడు.

నుండి జాధవుఁడు బీడునకు 25 మైళ్లు తూర్పున నున్న పాల్కి సమీప ప్రదేశము, సైన్యపోషణ నిమిత్తము జాగీరుగాఁ బడసెను.

1712 వ సంవత్సరమున సుల్తాను మోఅజము చనిపోయిన తోడనే చక్రవర్తి కుమారులలో నెప్పటి కలహములు జరిగెను. అబ్దుల్లాఖాను హుస్సేనల్లీఖాను అను నిద్దఱు సయ్యదుసోదరుల వలన రాజ్యము మోఅజము మనుమఁడగు ఫెరుకుసీరునకు లభించెను. జుల్ఫికరుఖాను ఘోరముగ నురితీయఁబడెను. సయ్యదులకు సాహాయ్యము చేసిన చేను కూలిచిఖానుఁడు దక్కను వైసరాయిగ నియమింపఁబడెను. ఇతఁడు గాజియుద్దీను కుమారుఁడు. ఇతని మొదటి పేరుమీరు కుమారుద్దీను. ఇతఁడు చిన్నవయసున నున్నప్పుడు ఔరంగజేబుచే 5000 అశ్వదళమునకు మన్సబుదారుగాఁ జేయఁబడెను. తరువాత చక్రవర్తి యవసానకాలములో బీజపూరునకు సుభేదారుగ నియమింపఁబడెను. ఇతఁడు జుల్ఫికరుఖానునకు బలవద్విరోధి కావున నతఁడు ఢిల్లీయందు జఁరిగిన వెనుకటి విప్లవములో చంపఁబడిన తోడనే దక్కనునకు వైసరాయిగ నిజాముల్ ముల్కు అను బిరుదునామములో నియమింపఁబడెను. ఇతఁడే ప్రస్తుత నిజాము రాజ్యమునకు మూలపురుషుఁడు.

అసంతుష్టుఁడైన జాధవుఁడు నిజాముల్ ముల్కును చేరఁగనే యతఁడు గౌరవముతో నాదరింపఁబడెను. అతనితోడవచ్చిన ఘాట్గేషిరాజీరావును, రంభాజీ నింబాల్కరు కూడ గౌరవింపఁబడిరి. ఈ రెండవ యతఁడు మొగలు సేవయందుఁ బ్రవేశించి, 'రావురంభా' యను బిరుదును బొంది తన సంతతివారి కద్దానొసంగెను. ఈ వంశము వారిప్పటికిని నిజాము రాజ్యమున గొప్ప యుద్యోగముల నున్నారు. నిజాములు ముల్కు రాజనీతి ప్రకార మిప్పుడు శంభాజీ పక్షమును వహించెను. జాధవుఁడు పగఁ దీర్చుకొనుట కాతురపడుచుండెను. నిజాములు ముల్కు సాహూయుద్యోగస్థుల దండయాత్రల నాపదలంచుచుండెను. వీరిద్దఱి సైన్యములును సర్లష్కరు పైకేగెను. అతఁడు గోదావరి ప్రాంతముల నుండి భీమనది ప్రాంతముల కేగెను. సాహూ యతనిఁ గాచుటకు బాలాజీవిశ్వనాథుని, సేనాకర్తయను బిరుదునిచ్చి సైన్యముతో నంపెను. బాలాజీ తన

సైన్యమును, పురందరు సమీపమునకు వెనుకకు తగ్గిన హైబత్రావు నింబాల్కారు సైన్యముతో సంగమింపఁ జేసి యచ్చట మోహారంబునకు నిలువఁబడిరి. అచ్చట జరిగిన యుద్ధమునందు మహారాష్ట్రులు జయంబు నొందిరి యందురు. గాని తరువాత వారు సాల్పీఘాటునకు పలాయనంబగుటనుఁబట్టి యది యనుమానంబగుచున్నది. మొగలు సైన్యములో నొక భాగమగు మహారాష్ట్ర సైన్యము రంభాజీ నింబాల్కారు క్రింద పూనాప్రాంతమును పట్టుకొని నందుకు ఆయన తత్సమీపమున నొక జాగీరును బడసెను. చివరకెటులనో సమాధానము జరిగి యుభయపక్షముల వారును తత్కాలమునకు తమ తమ రాజ్యస్థానముల కరిగిరి.

మహారాష్ట్రములలోని మొగలుజిల్లాల లోని దేశముఖులును, దేశపాండ్యలును, తమ తమ గ్రామములను రక్షించుకొను మిషమీద, కోటలుగ జేసికొని ఏ పక్షము వారైనను, మహారాష్ట్రు లందఱిని, తప్పించుకొని వచ్చిన వారినిగాని, రక్షణకు వచ్చిన వారినిగారిని, దాగుకొనుటకు వచ్చిన వారినిగాని, సాహాయ్యము చేయుచు వచ్చిరి. సూరతు నుండి ఔరంగబాదునకు, మహమ్మదు ఇబ్రహీము త్రైబాజీ రక్షణక్రింద వచ్చుచున్న చాలధనము పూర్తిగ దోచుకొనఁబడెను. ఈదోపిడి బహుశఃఖండీరావు దాభరే వలన జరిగింపఁబడియుండవచ్చును. అనేక సంవత్సరములనుండి యీ యుద్యోగస్థుడు, తన యనుచరులను, గుజరాతు కతియావాడు దేశములలో కప్పములఁగొనుచు, పోషించుచుండెను. ఇతఁడు సాహూఁధిపతిగా నంగీకరించెను. సాహూకుమిత్రుడైన దావూదుఖానుగుజరాతు గవర్నరుగాఁ జేయఁబడినతోడనే యతఁ డచ్చటినుండి మరలి నందోలు రాజపిప్పలిమధ్యనున్న బలమైన దేశము నాక్రమించుకొని యటుతరువాత మొట్టమొదట నీయుద్ధమునే చేసినటులఁ గన్పించుచున్నది.

నిజాములుముల్కు, కొల్లాపూరు పక్షము నవలంబించుటవలన, శంభాజీ యొక్క ప్రతిష్ఠయెక్కు వయ్యెను. సాహూయొక్క ప్రతిష్ఠ తక్కువకాఁ జొచ్చెను. కీర్తివంతుఁడగు శాంతాజీ ఘోరేపురేయొక్క మనుమఁడును, గుత్తి యొక్క ప్రథమ మురారి రావుయొక్క కనిష్ఠ సోదరుఁడువగు సిద్ధోజీఘోరేపురే

శంభాజీపక్షముచేత ప్రోత్సాహము చేయఁబడెను. శంభాజీ యతనికి సేనాపతిత్వమునిచ్చెను. కాప్సీ మధోలులయొక్క యనేకఘోరపురేలకని యుదాహరణ నవలంబించి కొల్లాపురపక్షముఁజేరిరి. కాని సిద్ధోజీయు నతని మిత్రుఁడగు పావనూరు పఠానునవాబును కర్ణాటకమందు తమ జయములయెడలను,దోపిడులయెడలను వాసక్తిగలవారై యచ్చటనుండి వెడలుట కిచ్చగింపకుండిరి. ఈసమయముననే సిద్ధోజీ బళ్లారికి 25 మైళ్లదూరముననున్న బలమైన యుపత్యకమునందలి సుందూరు కోటను పట్టుకొనెను.

పెరాగలులపలనవృద్ధిలోనికిఁదీసికొనిరాఁబడినక్రిష్ణారావు కుత్తేవుకారుఅను నొకబ్రహ్మణుఁడు మహదేవనగముల దగ్గరదేశమును స్వాధీనముచేసికొని యేపక్షమునను జేరక, స్వంతముగదేశమును కొల్లఁబెట్టుచు జీవించుచుండెను. రామచంద్రపంతులు క్రిందచాలకాల ముద్యోగస్థుఁడుగ నున్నదమ్మాజీథోరాటుఅను నతఁడు పూనాకు తూర్పున 40 మైళ్లదూరముననున్న పాతూసు దగ్గిరహింగీలేకహింగంగాముఅనునొకగ్రామమునదుర్గమునొకదానిని బలపఱచుకొనిచుట్టును ·0 మైళ్లవఱకును కప్పములఁగొనుచుండెను. ఇతఁడు కొల్లాపూరు పక్షముచేరినను,మొట్టమొదట నియమించి,జింజీముట్టడి కాలములోసోపాపాతూసులు జాగీరు నిచ్చిన రామచంద్రపంతునుతప్ప మఱియెవ్వరిని యధికారిగ నెంచకుండెను. మహారాష్ట్రుల యభిప్రాయములో కూడ నీతనికి దుల్యుండగు దుష్టుఁడులేఁడు. రామచంద్రపంతు ఉద్యోగస్థులలో మఱియొకఁడును, వాత్నీగ్రామవాసుఁడునైనఊదాజీచావను బత్తాసుసేరాలయొక్కదుర్గమును స్వాధీనముచేసికొనికొంతకాలములోనతిప్రబలుఁడైనందున సాహూ యతనికిసేరలకరారులయొక్క చౌతు నిచ్చి సమాధానము చేసికొనవలసివచ్చెను. వీరందఱును గాక నింకననేకచిన్నచిన్న దోపిడివాండ్రు శంభాజీ పక్షము నవలంబించియుండిరి. వీరందఱిలోను ప్రబలుఁడైనవారు కనోజీఅంగ్రియా.అతఁడు సావంతవాడీనుండి బొంబాయివఱకును తీరము నధీనములో కలిగియుండి కొంకణములో కళ్యాణమునందు కూడ తన యధికారమును నెఱపుచుండెను.

ఇప్పుడు దేశమునందున్న యరాజకపుస్థితి యీవిధముగనుండెను.ఏ యదృష్టపు మార్పుచేతనైన సాహూరాజ్యమునబలముదయింపకున్న మహారాష్ట్రుల

పైనతని యధికారము శూన్యమయ్యెడిది. బాలాజీవిశ్వనాథుఁడతనిసభాస్థానంబునకు జవసత్వంబు లొసంగుచు, రాజకీయ వ్యవహారములందు నాయకత్వమును వహించుచుండెను. అతఁడు దమ్మాజీ థోరాటు గర్వమడఁగింప సైన్యసమేతుఁడై యతనిపై నరిగెను. కాని యతఁడు రాయభారంబునకుఁ బిలువంబడి యచట నన్యాయంబుగ స్నేహితుఁడగు ఆబాజీపురందరుని తోడను, కుమారులగు బాజీరావు చిమ్మాజీల తోడను మఱికొందఱు దగ్గిఱ యనుచరుల తోడను బద్ధుఁడు కాఁబడి చెఱసాలఁ ద్రోయఁబడెను.

థోరాటు, వారనందఱికిని మూతులకు బూడిదె తోడనించినదాణాసంచులను గట్టి ఘోరముగ మరణశిక్ష విధింతునని బెదరించుచు, చాల ధన మిచ్చినఁగాని వారి నందఱిని విడువనని విఱ్ఱవీగుచుండెను. అనేక యవమానంబులకు లోనయిన పిమ్మట వారి కొఱ కియ్యవలసిన ధనము నిర్ణయింపఁబడి సాహూ చే నియ్యఁబడెను. వారు కారాగార విముక్తులైనపిదప థోరాటు యొక్క దుండగముల నడఁగించవలసినదని సాహూ పంతుసచివునితోఁ జెప్పెను. పంతుసచివుఁడాజ్ఞప్రకారము చేయ సంసిద్ధుఁ డయ్యెను. కాని యతని సైన్యము లోడింపఁబడి యతఁడును యతని ముతలికును పట్టుకొనఁబడి హింగంగామునందు చెఱసాలఁ ద్రోయఁబడెను.

ఈసమయముననే సతారా రాజధాని నుండి మఱిరెండు యుద్ధయాత్రలు సలుపఁబడెను. పీష్వాయగు భైరవపంతుపింగళే, కన్హోజీ ఆంగ్రియాను పాఱఁద్రోలి, కొంకణమును రక్షింపఁబోయెను. రెండవది, క్రిష్ణారావు కుత్రేకారు అను బ్రాహ్మణుని మద మడంచుటకు బాలాజీ విశ్వనాథుఁడు సైన్యసమేతుఁడై యుద్ధయాత్రఁ జేసెను. ఆ బ్రాహ్మణువిద్రోహియు నధికాహంకారప్రమత్తుఁడై సాహూ రాజాయొక్క సైన్యముల నెదుర్కొనుటకు ఔండ గ్రామమునకు వచ్చెను. కాని వాఁడు రణంబున సంపూర్ణ పరాభవంబు నొందెను. ఈయుద్ధమున ప్రతినిధియగు పరశురామ త్రింబకు యొక్క రెండవ కుమారుఁడగు శ్రీపతిరావు, అన్నయొక్క దుష్ప్రవర్తనము తొలగించునటుల రణవిక్రమంబుఁ గనుబఱచి, తన చెఱ విడిపింపవలయునని తండ్రిచే బోధింపఁబడినవాఁడై

ధైర్యసాహసంబుల నవార్యముగ సంగ్రామ రంగమునఁ బ్రసిద్ధపడునట్లు ప్రతించిసాహురాయొక్క మెప్పు వడసెను. ప్రతినిధి, స్వేచ్ఛయును ఉద్యోగమును మరల నియ్యఁబడిన వాఁడాయెను. కృష్ణారావు సంపూర్ణముగ వినయ వినమ్రుఁడగుట వలన క్షమింపఁబడి కుత్తావు గ్రామము నినాముగఁ బడసెను. అందుకొంతభాగ మిప్పటి వఱకు నాసంతతివారిచే ననుభవింపఁబడుచుండెను.

ఈజయము చాల ముఖ్యమైనది. కాని పీష్వా యొక్క దండ యాత్ర యిట్టియదృష్టము నొందలేదు. భైరవపంతు ఓడింపఁబడి అంగ్రియాచే కారాగార బద్ధుఁడయ్యెను. లోహగడ శత్రు వశమాయెను. రాజమాచి జయింపఁబడెను. అంతియకాక అంగ్రియా సతారాపై దాడి వెడలునని వదంతికూడ పుట్టెను. కూడినన్ని సైన్యములు బాలాజీ విశ్వనాథుని క్రింద నతని నెదిరించుటకు సిద్ధము చేయఁబడెను. బాలాజీయును తనకు అంగ్రియాతో పూర్వమున్న సంబంధమువలన అట్టిబలాధికుఁడగు గడిశత్రువుతో దీర్ఘ యుద్ధమునఁ బెనంగుటకంటె మేలయిన సమాధానం బొడగూర్పఁ గలనను ధైర్యముతో సైన్యాధిపత్య మవలంబించెను. అంగ్రియా బలసాహసములు గల నాయకుఁడనియు, అతని యుపాధులు, కేవల మతనివశములో నున్న రాజ్యావధులకు లోను గాక, విశాల సముద్రంబు మీఁద ననంత నావికా చౌర్యంబులకు విస్తరించి యుండెననియు బాలాజీ యెఱింగినవాఁడై యుండెను. బాలాజీ ప్రయత్నములు సఫలంబులయ్యెను. అంగ్రియా 10 కోటలను,16 పరిరక్షితములైన స్థలములును వానిపై నాధారపడియున్న గ్రామములతోఁ బాటు నిచ్చు పద్ధతి మీఁదను నావసైన్యాధిపత్యమును,శూరఖేలు బిరుదును స్థిరపఱచు పద్ధతిమీఁదను,శంభాజీ పక్షమునువదలి, పీష్వాను విముక్తుఁజేసి, రాజమాచి తప్పతక్కిన జయార్జితముల నెల్ల విడిచి, సాహూపక్ష మవలంబించుటకు సమాధానపడెను.

ఈసంధివలన సిద్దీ యిదివఱకు 20 సంవత్సరములనుండి రివిన్యూననుభవించుచున్న కొన్ని ప్రదేశములు పోఁగొట్టుకొనిన వాఁడాయెను. ఇందుచే నా జంజీరా నాయకునకును అంగ్రియాకును భేదముగలిగెను. బాలాజీ విశ్వనాథు డంతట అంగ్రియాకు తోడై సిద్దీ రాజ్యములోనికి జొచ్చి యతని నమ్రుఁ

జేసెను. బాలాజీ యీ రాజకార్యము లెల్లసాహూయొక్క మనః ప్రీతియగు
1714 నట్లు నిర్వహించి నందున నతఁడు సతారాకు తిరిగివచ్చినప్పు డత్యం
తగౌరవముతో స్వాగతం బీయబడెను. భైరవపంతు పింగళే యొక్క
యపజయమువలన నుద్యోగమునుండి తొలఁగింపఁబడి ముఖ్యప్రధాను పదవియం
దు బాలాజీ విశ్వనాధుఁడు నియమింపఁబడెను. అతని మిత్రుఁడగు ఆబాజీ
పురందరే యతని ముతలికుగను, రామాజీ పంతుభానూ అతని ఫద్నవీసుగను
నియమింపఁబడిరి.

చంద్రసేనజాధవుడు సాహూయొక్క సేవను పరిత్యజించిన పిమ్మటఁ మన్నాజీమోరే సేనాపతియొక్క ఉద్యోగదుస్తు లియ్యఁబడెను. కాని యతఁడు విధ్యుక్తకార్యములను నెరవేర్చియుండలేదు. అతఁడిప్పుడు హైబత్రావు నింబాల్కరుతో కూడ బాలాజీ ననుసరించి పూనాప్రాంతమున కరిగి దమ్మాజీ థోరాటు యొక్క మదభంజనముఁ గావింప నాజ్ఞాపింపఁబడెను. హింగంగాము నం దింకను కారాగార బద్ధుఁడై యున్న సచివుడు, ఆప్రదేశము ముట్టఁడింపఁ బడినయెడల, చంపఁబడునేమోయని విశ్వనాధుఁడు మనస్సునందు సంకోచముఁ గలవాడై యున్నందున, పంతు సచివు తల్లియగుయశోబాయి కలహము లారంభము కాకముందు కుమారునికి స్వేచ్ఛా విహారమును గల్పింప నతనిఁ బ్రార్థించెను. ఆ ప్రకారము చేయఁబడినందున యశోబాయి కుమారుని రక్షించినందుకు కృతజ్ఞతా పూర్వకంబుగ పూనా జిల్లాలోనిసచివుని హక్కుల నత నికి ధారపోసి, అప్పటికి శాశ్వదు నందు నివసించుచున్న విశ్వనాథుని కుటుంబమునకు శరణ్యస్థానంబుగ పురందరు కోట నతని కిచ్చివేసెను. ఈ కారణముననే సాహూ దగ్గఱనుండి కూడ నీదానముయొక్క హక్కు నాతఁడుపొందెను. విశ్వనాథునియొక్క రాజకార్య ధౌరంధర్య సామర్థ్యమువలన సామ దాన భేద దండోపాయంబులచేఁ దక్కిన ముక్కడి మహారాష్ట్రముఖ్యులెల్ల మహారాష్ట్ర ప్రధానత్వంబునకు లోబడు క్రమంబును, ఆప్రధానస్థానంబు యొక్క బలంబు సాహూనుండి పీష్వాకు సంక్రమించు విధంబును, చదువరులు చూడఁగలరు. పీష్వాయొక్క యధికార బలమునకు సచివునియొక్క హక్కులు చేరుట యే పీష్వాయొక్క యాధిక్యమున కారంభముగ నెంచవలసి యున్నది.

పూనాయందుఁ గూడిన బలంబులు థోరాటు తేరి చూడఁజాలడు. హింగంగామున కతఁడు త్రోలఁబడి యా ఘరి* బ్రద్దలు కొట్టఁబడి దొమ్మియుద్ధమున వశముచేసి కొనఁబడెను. దమ్మాజీ థోరాటు చెఱపట్టుకొనఁబడి, యతని ఘరి నాశనముచేయఁబడెను.

సర్‌లష్కరు, తాను సేనాపతిగా నియమింపఁబడనందుకు, రాజాతో పోరాడి గోదావరికి తిరిగి వెడలిపోయెను. అతఁడు మరల నెప్పుడును సమా
1715 ధానపడలేదు. పూనా ప్రాంతమును వశములో నుంచుకొనిన మొగలు ఏజంటు అగు బాజీ కద్దమును, రంభాజీ నింబాల్కరుయొక్క జాగీరును గౌరవింతునను వాగ్దానముమీఁద, నచ్చటి యుత్తమాధికారమును తన కిచ్చుటకు బాలాజీ బోధించి యొప్పించెను. అటుతరువాత తత్క్షణము తత్ప్రాంతము నాశ్రయించి యున్న చోరబృందము నెల్ల నణచివేసెను. గ్రామములలో నెల్ల సక్రమమైన పరిపాలనను పాదుకొల్పెను. రివిన్యూను గుత్తకిచ్చు నాచారమును తప్పించెను. చాలతక్కువ శిస్తు విధించి క్రమక్రమముగ వృద్ధి పరచుటచే వ్యవసాయమును ప్రోత్సాహపఱచెను.

మహారాష్ట్రుల వ్యవహారము లెల్లదిక్కులను ప్రకాశమానంబుఁగాఁ జొచ్చెను. కానియిప్పుడు వర్ణింపఁబడిన యల్లరి, దుర్బలము, సంపూర్ణ అరాజకము పోయి పిమ్మట మరల సాహూ యధికారము విజృంభించుట విచారించిచూడనది సుప్రసిద్ధముగ నుండును. దాని కారణాంతరముల నరయక పూర్వమవిశ్వసనీయముగఁగూడఁ నదిలోచును. సాహూ రాజాయొక్క యాధిక్యతను నిలువఁబెట్టిన స్థితిగతులు తృప్తికరముగఁ దెలుపఁబడును. మహారాష్ట్రుల యందుదయించిన గృహకల్లోల మంతయు వారి దోపిడి వ్యాపారముయొక్క ప్రతిఫలముగానెంచఁబడవచ్చును. వారు వివిధ నాయకులక్రిందచేరి చేసిన దోపిడి వ్యాపారమువలన మొగలు రాజ్యంబును జీర్ణింపఁజేసి స్వతంత్రమును సంపాదించుకొనిరి. ఈస్వాతంత్ర్యమే వారికి దొరకిన సత్ఫలమగు నమృతము కాని యా దోపిడియొక్క, దేశమథనకారణముననే జహాలునాయక పరస్పరభేద భావ

---

* ఘరి అనగా రక్షణ నిర్మాణములు కల గ్రామము.

మను హాలాహల ముదయించెను. మేలును పరిగ్రహించి కీడును పరిత్యజింప వలెను గాన నా పరస్పరభేదభావ మను విషంబును మ్రింగివేయఁగల సూత్ర మారయ వలసియున్నది. అది బాలాజీ విశ్వనాథునివలనఁ గనిపెట్టఁబడినటుల ముందు మనము గ్రహింపఁగలవారము.

బాలాజీ విశ్వనాథునియొక్క ప్రతిష్ఠ యెక్కువగు చుండెను. అతని యుపదేశములేక నే ముఖ్యరాజకార్యమును నిర్వహింపఁబడుటలేదు. సాహోపాయమే సాహూ కంగీకారమయ్యెను విశ్వనాథుని మంత్రంబు లన్నియు దాని ననుసరించియే యుండెను. వారి యేర్పాటులకెల్ల శివాజీపద్ధతియే యాధారముగ స్వీకరింపఁబడెను. కాని శంభాజీ కాలమునుండియు జయశీలుఁడైన ప్రతిమహారాష్ట్రినకును అతఁడు స్థాపించుకొనిన దేశమంతయు నతని స్వాధీనమునందుంచుచు విపరీత ఔదార్యముతో పత్రములనొసంగి రాజుయొక్క యాధిక్యతను నిలుపుకొనవలసివచ్చిన యవసరమే వారి యైకమత్యమునకును, సంఘముయొక్క బలయుపాధులకును నాశనహేతువయ్యెను. కాని తాత్కాలికముగ నుద్దేశమును నెఱవేర్చుట కదియే యుత్తమరాజనీతియయ్యెను. దీనినిగూర్చి కొంతవఱకు శివాజీయొక్క పరిపాలనాపద్ధతులయందు విచారించి యున్నాము.

సాధ్యమైనంతవరకు మంత్రిమండలియందు పూర్వమునుండి యున్నవారుగ నేయుంచిరి.

ఈకాలమున నున్న మంత్రిమండలి యీక్రిందఁ జూపఁబడుచున్నది.

ప్రతినిధి-పరశురామత్రింబకు

అష్టప్రధానులు

1.	పీష్వాలేక ముఖ్యప్రధాను	బాలాజీవిశ్వనాథుడు
2.	అమాత్య	అంబారావు బాపురావు హనుమంతే
3.	సచివు	నారోశంకరు
4.	మంత్రి	నారూరావుశన్వీ
5.	సేనాపతి	మానుసింగు మోరే (మన్నాజీ)
6.	సోమంత	ఆనందరావు

7. న్యాయాధీశు — ఖోనాజీ అనంతు

8. పండితరావు — ముద్గలభట్టు ఉపాధ్యాయ

పర్సోజీ భాంస్లేయును, హైబత్రావు నింబాల్కారు నీ సమయమున కాలము చేసిరి. మొదటి వాని కుమారుఁడగు కన్నోజీభాంస్లే తండ్రి,యాస్తికంతకును కర్తగఁ జేయఁబడి, యతని బిరుదగు సేనాసాహేబుసుభేను కూడఁ బడసెను. సర్లష్కారు పదవి మాత్రము దాని యొక్క హక్కు గౌరవములతోఁ గూడ దోవల్షీ సోమవంశీ కియ్యఁబడెను. కావున హైబత్రావు కుమారుఁడు తొలగింపఁబడినందు కసంతుష్టుఁడై సాహూ సేవను విడచి చంద్రసేన జాధవుని గూడియటు తరువాత నిజాముల ముల్కు నుండి బార్శియు మరికొన్ని జిల్లాలును జాగీరుగాఁ బొందెను.

సాహూ సామాన్య సామర్థ్యము లేనివాఁడు కాడు. అతఁడు సహజముగ కరుణా స్వభావుండును మతసంబంధమైన ప్రతిష్ఠాపనల యెడల నౌదార్యశీలుండును హింమాధర్మబోధి తాచారానుష్ఠానపరుండును, భూదేవకులాభితర్పణప్రియుండునై యుండెను. ఘాట్మాతాయు, పసమంబగు కొంకణమును నతని జన్మహక్కగు దేశము. కాని దృఢగాత్రుండగు తాతగారివలె ఘాటీ లెక్కుటకును, పర్వత పార్శ్వారణ్య ప్రదేశములందు జీవించి పరిభ్రమించుటకును, నలవాటు లేక సాహూ యొక్క శైశవమంతయు చక్రవర్తి యంతఃపురమందుఁ గడుపఁబడిన దగుటచే నతఁ డనుభవించిన యైశ్వర్యభోగంబుల వలన ప్రీతుండై మహమ్మదీయుల యొక్క మార్దవలక్షణంబు లతఁడు గ్రహించుట యందాశ్చర్యములేదు. అతఁడప్పుడప్పుడు మహారాష్ట్రులకు సహజంబగు క్షత్రియ కాఠిన్యం బవలంబించుచుండును. కాని సామాన్యముగ నతఁడు తనకుఁజూపఁబడిన భక్తిగౌరవములతోడను, తన యాజ్ఞలకు మంత్రులు దప్పక చూపించెడు వినయ విధేయతల తోడను తృప్తిఁ జెంది యుండెడివాఁడు. వ్యవహార భారమేమియు తనకుఁదగులకుండ, తనప్రియంబగు మృగయావిహారంబున కాలంబు పుచ్చనియ్యఁబడి నందు కతఁడు సంతోషించువాఁడు. ఇట్లు చేయుటవలన తన యధికార బలము క్రమముగ నింకొకరికి సంక్రమించుచున్నదని యెఱుంగ లేక

పోయెను. రాజ్యభారమును వహించుటకు కావలసిన గుణము లితని యందును, తండ్రి యందును, తాతయందును వేఱువేఱు విధంబులుగ నుండె నటులనే రాజ్యలక్ష్మికూడ వారి నాశ్రయించుటయందు వివిధరీతుల మెలంగెను. వార సత్వము వలన నన్నిగుణములును వచ్చునను స్వభావ విరుద్ధమగుసిద్ధాంతమునుఁ బట్టి రాజ్యధురంధరత్వ మొక్క వంశము నందే యుండుట వలన నీ సంక్రమణము జరిగె నను సంగతి యదార్థముగఁ గనుపడుచుండగ నింగ్లీషు మహారాష్ట్ర చరిత్రకారులు బ్రాహ్మణులు మహారాష్ట్ర రాజ్యమును క్రమక్రమముగ స్వాధీనము చేసికొనిరని పలుమారులుగ్గడించు టెందుకో తెలియరాకున్నది. మహారాష్ట్ర రాజగు సాహూకు పరిపాలన నిర్వాహణంబు నందు అభిరుచి విస్తారము లేకుండెను. అట్టియెడ బాలాజీ విశ్వనాథుఁడు చాల యధికారము తా నవలంబింపకున్న మహారాష్ట్ర రాజ్యమున కప్పుడే వినాశము కల్గెడిది.

మొగలు లతని నాశ్రయించిన రీతి వలన మహారాష్ట్రుల నాయకుఁడగుటచే నా జాతి వారికిఁ గూడ ప్రాముఖ్యత యెక్కువయ్యెను. అతఁ డాక్రమించిన స్థితిని బట్టి యతని కొసంగఁబడిన వాక్కు గౌరవము లతని పేరు ప్రతిష్ఠలకు కారణ మయ్యెను. వేఱు స్థితిగతుల యందు మాత్ర మతని కట్టి గొప్పతనము రాకపోయెడిదే. శివాజీ యొక్క పుత్రు లిద్దఱును సింహాసన మాక్రమించి నది మొదలు స్వాతంత్ర్యము నెప్పుడును ప్రకటించు కొనియుండిరి. కాని సాహూమాత్రము డిల్లీ యధిరాజ్యము క్రింద సామంతుడనని యొప్పుకొని, హిందువులయొక్క రాజని పేరుఁ బెట్టుకొని మొగలులతో వ్యవహారములందు సామ్రాజ్యముయొక్క జమీఁదారుగను లేక పెద్ద దేశముఖుఁడుగ నెంచుకొనుచు వచ్చెను.

చక్రవర్తి ఫెరూక్సీరు, సింహాసనాధిష్ఠుఁడైన తరువాత, సాల్వీఘాటు నొద్ద కలహములు సాంతమైన పిమ్మట, సాహూను 10000 గుఱ్ఱపు దళమునకధిపతిగఁ జేసెను. తరువాత 17 నెలల వఱకు నిజాములు ముల్కు జాగ్రతగ పరిపాలించుట చేత నల్లరులు లేకుండ నుండెను.

ఫెరూక్సీరు సయ్యదుల యధికారము నుండి స్వాతంత్ర్యమును సంపాదించుకొనఁగోరి వారిలో నొకఁడగు హుస్సేనాలీఖానును దక్కనుకు వైసరాయిగ

నియమించి పొమ్మని బలవంతపెట్టెను. అతఁడును ఫెరూక్సీరు మాటలను నమ్మి తన తమ్ముఁ డొక్కనిని ఢిల్లీయందు వదలి తాను బయలువెడలి దక్కనునకు రాఁగా నచ్చట చక్రవర్తిచే రహస్యముగ ననుజ్ఞాతుఁడై దావూదుఖాను మార్గమున
1716 నెదిరించెను. ఇందెవరు గెలిచిన వారి పక్షము చేరుదుమని దూరమున నిలిచి చూచుచున్న నీమాజీ సింధియా దావూదుఖాను రణనిహతుఁడైన తోడనే హుస్సేనాలీఖాను పక్షమున వచ్చి చేరెను. ఫెరూక్సీరు తన కుతంత్రము నెరవేరినది కాదని రహస్యముగ మహారాష్ట్రులను హుస్సేనాలీఖానుయొక్క పరిపాలన కాటంకములు గల్పింప ప్రోత్సాహము చేయుచుండెను.

హుస్సేనాలీఖాను యొక్క మొదటి దండయాత్ర, సూరతుకును బర్హాంపురమునకును మధ్య సైనికాస్థాన శ్రేణి నేర్పరచుకొని దేశము నాక్రమించుకొనిన ఖండీరావు దాభరేపై, నడుపఁబడెను. 8000 సైనికులు జుల్ఫికరు బేగు క్రిందనంపఁబడిరి. దాభరే యీవర్తమానము నెఱిఁగి యతనికడ్డమై మహారాష్ట్ర యుద్ధక్రమ ప్రకారము ముందు తఱుమ నిచ్చి, మొగలుల శ్రేణులు చెడిన తోడనే తిరిగి, యా యనుభవశాలియగు యోధుఁడు వారి నెల్ల నురుమాడి సేనాపతిని రణరంగమునఁ గూల్చెను.

హుస్సేనాలీఖాను యొక్క దివానగు మాకూబుసింగు చంద్రసేన జాధవునితోఁ గలిసి యీ యవమాన కరమగు నపజయమునకు కసి దీర్చుకొనఁ జనెను. ఖండీరావు సర్లష్కరు సైన్యములతోఁ గలిసి మొగలులతో నహమ్మదు నగరము నొద్ద యుద్ధమొసంగెను. గొప్ప యుద్ధము జరిగి యం దుభయ పక్షముల వారును జయమును చెప్పుకొందురుగాని మొగలులు మాత్రము ఔరంగబాదునకు తిరిగి పోయిరి. ఖండీరావు ఈ జయముల పిమ్మట సతారాకు పోయి యచట సేనాపతిత్వమును బొందెను. మన్నాజీ మోరే యసమర్థుఁడగుటం జేసియు దుర్వర్తనపరుఁడగుట వలనను తొలగింపఁబడెను.

మహారాష్ట్ర యుద్యోగస్థులు, జయములచేతను, ఫెరుక్సీరు యొక్క రహస్యప్రోత్సాహముల చేతను, ధైర్యవంతులయి దావూదుఖాను వలన నన్ని పొక్క-

లకు మారుగ నియ్యఁబడిన యొక్క చౌతంతు తృప్తినొందక, సెల్ల చౌటు లను సర్దేశముఖిని కూడ వసూలుచేసి, విజృంభింప మొదలు పెట్టిరి.

ఈస్థితిగతులలో దక్కను సైసరాయిగవచ్చిన హుస్సేనాలీఖానుఁడొక వైపున మహారాష్ట్రులపోరు పడలేకను రెండవవైపున చక్రవర్తి దర్బారు యొక్క దూరాలోచనలకు సహింపలేకను సాహూతో సమాధానము చేసి కొనఁదలంచెను. పూర్వము కొన్నిదినములు శివాజీయొద్ద కార్యానుగనుండి, రాజారాముచే సచివుగ కొంతకాలము నియమింపఁబడి, జింజీముట్టడి జరుగు చుండగ విరాగియై కాశీయాత్రపోయిన శంకరాజీ మల్హారుఁడను నతఁడు తన స్వభావమునకు కాశీశాంతనివాసము సరిపడక పోవుట వలన మరల సరాగియై మొగలితనమందు హుస్సేనాలీఖానుక్రింద నుద్యోగియై మహారాష్ట్రులతో సంధి రాయభారము నడుప నిర్వహించెను. ఇతఁడు సతారా ప్రభుత్వము వారితో నుత్తరప్రత్యుత్తరములుచేసి మహారాష్ట్రులు కోరిన హక్కులిచ్చినయెడల వారు దేశక్షేమము నందాసక్తి గలిగి శాంతమును గాపాడుదురనియు, అట్టి బలవంతు లగు మిత్రుల ప్రాపుకలిగినయెడల చక్రవర్తియొక్క కుట్రలనుండి భద్రముగ నుండి కడపట నతనియొక్క విరోధమును కూడ నిర్లక్ష్యపెట్టవచ్చుననియు హుస్సేనాలీఖానునకు సలహానిచ్చెను.

ఈ యభిప్రాయములు హుస్సేనాలీఖానుయొక్క నమ్మకపు ఉద్యోగ స్థుడగు బర్హాంపూరు గవర్నరుచేఁ గూడ నామోదింపంబడెను. కావున నీ సమా ధానమును నడుపుటకు మల్హారుఁడు సతారా కంపఁబడెను.

ఈ రాయభారము బాలాజీ విశ్వానాధుని యొక్క యభీప్సితమునకు విశాల మార్గమిచ్చెను. దక్కను నందలి ఆఱుసుభేలయందును చౌతు సర్దేశ ముఖీలు మాత్రమేగాక, శివాజీచే జయింపఁబడిన ఖానుదేశము తప్ప యావ త్తుమహారాష్ట్రమును, ఖానుదేశమునకు బదులుగ తూర్పన పంధరపురము వఱకు నున్న దేశమును ఇచ్చుటకు సాహూకోరెను. మఱియును శివనేరు దుర్గమును, త్రింబకుదుర్గమును, ఇంకను కర్ణాటకమునందున్న పూర్వజిల్లాలును, క్రొత్తగ చేజాపాహాబును చేయుగు తనోజిఖాంన్లే చేజయింపఁబడిన గొండ్వానా దేశా

రులలోని భాగములు స్థిరపఱుపఁ బడుటకును, సాహూయొక్క తల్లియు కుటుంబమును సాధ్యమైనంత త్వరలో నప్పగింపబడుటకును కోరఁబడెను.

ఇందుకు సాహూ ప్రాంతరాజ్యమునకుగాను పదిలక్షల పేష్కషు నిచ్చుటకును, తక్కినసుభేలమీద యావత్తు శిస్తులో పదియవవంతగు సర్దేశముఖీహక్కునకుగాను, దేశమునందు చోరుల శిక్షించి శాంతి నేర్పరచుటకును, రివిన్యూలో నాలుగవవంతగు చౌతునకుగ్గాను, 15000 గుఱ్ఱపు దళముతో చక్రవర్తిసేవ కవసరమైనపుడు సహాయము చేయుటకును, సాహూ యొప్పుకొనెను. కొల్లాపురమురాజగు శంభాజీ పక్షమువారిచే నప్పుడు చాలవరకాక్రయింపఁబడిన కర్ణాటకమును బీజపూరు గోలకొండ సుభేలును నిష్కంటకములుగ జేసి యిచ్చుటకును సాహూ ఒప్పుకొనెను.

శంక్రాజీముల్హా రదివఱకు మహారాష్ట్రమున సేవఁజేసిన వాఁడగుటచే
1717 వారికి సదుపాయముగ సమాధానము నేర్పాటుఁజేసెను. ఈ సమాధానము స్వల్ప మార్పులతో హుస్సేనాలీ ఖా నంగీకరించెను. వైసరాయిక్రిఁద లేని రాష్ట్రములను కోటలను సాహూ తనకు వీలనితోఁచిన ప్రకారము రాఁబట్టుకొనవచ్చునని కూడ యొప్పందల జరిగెను. ఈలోపున 10000 గుఱ్ఱపుదళము వైసరాయికి సాహాయ్యముగఁ బంపఁబడెను. సేనాసాహేబు సుభాయగు కనోజీ భాంస్లేకుబంధువులైన శాంతాజీ పర్సోజీ భాంస్లేలును, ఉదయాజీ పవారు విశ్వాసరావును, ఈ సైన్యముల యధికారముతో నచటికి పోయిరి. జిల్లాలయొక్క స్థితిగతులను కనుఁగొనుటకును, రివిన్యూ వసూలు చేయుటకును వకీళ్లు (ఏజంట్లు) నలుదిక్కులకుఁ బంపఁబడిరి.

చక్రవర్తి యీసంధి నంగీకరింపలేదు. అతఁడొక మంత్రి ప్రోత్సా
1718 హము వలన సయ్యదు సోదరులనుఁ జంపింపయత్నించెను. హుస్సేనాలీఖాను రాజధాని కరిగి చక్రవర్తిని శిక్షించుటకు సాహూను సాహాయ్య మడిగెను. ఆ తరుణము వ్యర్థముగ పోనియ్యఁబడలేదు. బాలాజీ విశ్వనాధుఁడును ఖండేరావుదాభదేయును గొప్ప సైన్యములతో వైసరాయిని కలిసికొనుటకు బయలుదేరిరి. వీరు నర్మదానదిని దాటి తిరిగివచ్చుపర్యంతమును దినమునకు కొంత ధన మియ్యఁబడుటకు వాగ్దానము చేయఁబడిరి. ఇం

తియకాక సంధి స్థిరపఱుపఁబడుటకును, సాహూ యొక్క కుటుంబము వారి కొప్పగింపఁబడుటకును వాగ్దానము జరిగెను. బాలాజీ విశ్వనాథుఁడు వెడలునపుడు, దౌలతాబాదు చాందా కోటలు కూడ సంపాదించుటకును, మహారాష్ట్రులవలన గుజరాతు మల్వాలలో వసూలు చేయఁబడుచున్న కప్పమునకుఁ గూడ వాక్కు నడిగి పుచ్చుకొనుటకును సాహూ యతనికి చెప్పి పంపెను. ఈ యసాధారణ కోరికలకు వంకయేమని చెప్పఁబడెననగా,నచ్చట నిదివఱకు కప్పము వసూలు చేసికొను మహా రాష్ట్రులట్టితమ యధికారమునకు సాహూ యొక్క యాధిపత్యము దిక్కు చూడకుండిన, వారు తద్దేశముల పైఁబడి దోచు కొందురనియు, సాహూ కీ యధికారమిచ్చిన యెడల తద్రక్షణ కతఁడు బాధ్యుడై యుండుననియు నై యుండెను.

ఈ సైన్యసమూహము లన్నియు ఢిల్లీ చేరెను. ఆ దురదృష్టపు ఫెరూక్సీరు కుట్రలయందు దిట్ట ధైర్యవంతుఁడో కార్యములందంత మనస్థైర్యము లేనివాఁడు. అతఁడు భీరుఁడును మోసగాఁడు నై యుండెను. సయ్యదు సోదరులు మహారాష్ట్ర బల సాహాయ్యమున వానిని వెంటనే తొలగించి ఖైదు చేసి తరువాత చంపించిరి. అటు తరువాత నిద్దరు రాజకుమారుల నొకరి పిమ్మట నొకరిని చక్రవర్తిగా వారు చేసిరి. ఆ యిద్దరు చక్రవర్తులును ఏడు మాసముల లోచనిపోయిరి.తరువాత నా రాజసృష్టికర్తలు, సుల్తాను మౌ అజమునకు మనుమఁడును, జహందరుషా పుత్రుఁడును, అగు రోషను ఇక్తియారను నతని,
1719 మహమ్మదుషా యను బిరుదుతో చక్రవర్తిగాఁ జేసిరి. సయ్యదులే రాజ్యాధికారమును పూర్ణముగఁ దమ చేతులలో నుంచుకొని పని చేయుచుండిరి. తమ పక్షమునకు విరోధముగ లేని బలానుభవములు కల సర్దారుల నుద్యోగమునందు వారు ఉంచుకొని యుండిరి. నిజాముల్ ముల్కు అట్టి వారిలో నొకఁడు. ఇతఁడు లోపల సయ్యదుల యెడల నిష్టములేని వాఁడైనను పైకి మాత్ర మా యుద్దేశము నేమాత్రమును కనుఁబఱచక యుండెను. ఇతఁడు కొన్ని దినములు హుస్సేనాలీఖానుకు పూర్వము దక్కనుకు సైనరాయిగ నుండి తరువాత మొరదాబాదునకు మార్పఁబడి యటుపిమ్మట దర్బారునకు

పిలువఁబడి యచ్చట కొంత కాలమునుండి యుద్యోగమేమియు లేక ఫెరూక్సీరు కొద్ద నుండెను. ఫెరూక్సీరు బంధింపఁబడిన తరువాత, సయ్యదులు స్థాపించిన చక్రవర్తికి భక్తియుతుఁ డగుట వల్లొప్పింపఁ బడెను. సయ్యదుల సిఫారసుచే నితఁడిప్పుడు మాల్వా గవర్నరుగా నియమింపఁబడెను. ఇతఁడు తన రాజ్యైశ్వర్యతను వృద్ధి చేసికొనుటకై గంద్రగోళ సమయములో మంచి తరుణము నకై యెదురు చూచుచుండెను.

బాలాజీ విశ్వనాథుడును మహారాష్ట్రులును, మహమ్మదుషా సింహాసనా
1720 ధిష్ఠుఁడగు వఱకు నచ్చట నుండిరి. ఫెరూక్సీరు నిర్బంధమునకు పూర్వము జరిగిన కోలాహలమందు కాంతాజీ భాంస్లేయును, 1500 మందియతని సైన్యమును డిల్లీ వీధులయందు ప్రజలచే నఱకఁబడిరి. సయ్యదుల వాగ్దానము ప్రకారము సైన్యమునకు ధనమియ్యఁబడెను. సాహూ యొక్క తల్లియు కుటుంబమును ఒప్పగింత పెట్టఁబడెను. పీష్వాయు సేనాపతియు దక్కనునకు ప్రయాణమైరి. హుస్సేనాలీఖానుతో జరిగిన సమాధానము ప్రకారము మూఁడు చక్రవర్తీయ సనదులు, ఒకటి ఛౌతునకును, రెండవది సర్దేశముఖీకిని, మూడవది స్వరాజ్యమునకు నియ్యఁబడెను.

అట్లు డెబ్బదిసంవత్సరములు విరామములేని సంగ్రామము పిమ్మట, 1650వ సం॥ములో శివాజీ వలన మొట్టమొదట హక్కులు తెలియఁ బఱుపఁబడిన వుడు నిర్వచింపఁబడిన యుద్దేశములు అతని మనుమఁడగు సాహూ యొక్క మంత్రి పుంగవులచే జయప్రదముగ నెఱవేర్పఁబడినవి. పూర్వపు 'స్వరాజ్య మియ్యఁబడుట మాత్రమే గాక దానియొక్క సరిహద్దులప్పుడు జయింపఁబడిన దేశమంతకును విస్తరింపఁజేయఁబడి రాఁబోవు కాలమందు సాధ్యమైన యాక్రమణలు చేసికొనుటకుఁ గూడ ద్వారము నేర్పఱుపఁబడినవి. స్వరాజ్యసనదు నందున్న దేశమందు, ఘట్టాతాయు, దక్షిణమున హిరణ్యకేశి నదికిని ఉత్తరమున ఇంద్రాయిణీ నదికిని మధ్యను శివాజీచే పూర్వము జయింపఁబడిన పూనా యొక్క పశ్చిమ మావలులును. సతారాయు, కొల్హాపురము నున్నవి. తూర్పునకు

విస్తరణము భీమనీరా యుపత్యక ప్రదేశముల పొడుగునను చేయఁబడెను. ఘాటీలక్రింద స్వరాజ్యమునందు ఉత్తర దక్షిణ కొంకణములు, రామ్నాగర్, జవారు, చౌల్, భివాడి, కళ్యాణము, రాజపూరు, పోండా, ఉత్తరకనరాలో కొంతభాగము, అకోలా, కూరాలు నుండెను. ఇఁక దక్షిణమున గాడగ, హాల్యాలు, బళ్లారి, కోపాలు, శివాజీచే తంజావూరు జింజీలతో సంబంము గలిపియుంచుటకు ఉంచుకొనఁబడెను. ఈశాన్యదిక్కున శివాజీ యొక్క దేశము, సంగమ్నేరు, బాగ్లాను, ఖానుదేశము, బేరారులలో నచ్చటచ్చట స్థానములుగా నుండెను. ఈవంకర టింకర సరిహద్దులుగల దేశభాగము స్వరాజ్యముగా సాహూ కియ్యఁబడెను. సాహూ యడిగిన ఖానుదేశమునకు బదులుగా భీమాయుపత్యకము (Bhima Valley) వెంబడి పంధరపురము పఱకును విస్తరణ మొసంగఁబడెను. చౌతు పనూలు చేసికొనుట కధికార మియ్యఁబడిన యాఱు సుభే లెవ్వియనిన, బేరారు, ఖానుదేశము, ఔరంగబాదు, బీదరు హైదరాబాదు. బీజపూరు. సామ్రాజ్యముయొక్క లెక్కలలో నీ యాఱు సుభేలును 18 కోట్లు శిస్తు మొత్తము నిచ్చునట్లు వ్రాసియుండెను. ఇందులో సర్దేశముఖీ ఖర్చు పదియవ వంతును, చౌతు నాల్గవ వంతునై యుండెను దేశములో నీహక్కునకు చక్రవర్తియొక్క యంగీకారము తప్ప మఱి యే పద్ధతియు, శాంతమును గుదర్చదని బాలాజీ విశ్వనాథుని మనమున నాటుకొనెను. దక్కనులో వివిధభాగములందును తమ యధికారమును స్థాపించుకొనిన పద్ధతులయందు స్థిరభావములేదు. ప్రతి గొప్పనాయకుఁడును పూర్వ రాజ్యక్రమమునకును ప్రస్తుతరాజ్య క్రమమునకును, మొగలుగవర్నరగు ఫౌజుదారులకును ఇంకననేక సివిలుపరిపాలకులకును, పూర్వపు ప్రనాదులపై యధికారమును వహించిన మహారాష్ట్ర సేనానాయకులకును మధ్యసంబంధముగ నుండుట తమ యందఱియొక్క లాభము కొఱకే యని లెస్సగ గ్రహించియుండెను. చౌతుక కియ్యఁబడిన సనదులో సాహూ 15000 గుఱ్ఱపుదళమును చక్రవర్తిసేవలో నుంచవలెనని యుండెను; మొగలు గవర్నరుల యొక్క యవసరముల కొఱకు వారివారి దేశభాగములలో నవి యుంచఁబడవలయును. చౌతు సర్దేశముఖీసనదు

వలను కాదు. దేశమును శాంతముగ నుంచుటకును, పరరాజాక్రమణమునుండి రక్షించుటకును, తరువాత అనేక సంవత్సరములకు మార్క్విసు ఆఫ్ వెలస్లీ దేశీయరాజులతో చేసిన యుపబల స్నేహపద్ధతివలెనే మహారాష్ట్రులచే నేర్పాటుచేయఁబడినది. సనదులో వెయ్యఁబడిన యంకెప్రకారము ఆఱుసుభేలును కప్పము గట్టఁబడినయెడల నందువలన 4½ కోట్ల రూపాయలువచ్చెడివి. కాని దేశము ఔరంగజేబుయొక్క యుద్ధములవలన నాశనమై మొత్తపు శిస్తులో నాలవవంతైనను వసూలు కాకుండెను. మొగలు రాజ్యమువారు స్వయముగ పూర్వము శిస్తు వసూలు చేసికొన్నను ఖర్చులక్రింద నాలగవవంతు పోయెడిదే కావున మహారాష్ట్రులు శిస్తువసూలు చేసిపెట్టినను వారికి నాలువవంతుఇచ్చినందున ఖర్చులుపోఁగా మిగిలినధనమందు చక్రవర్తి ధనాగారమునకు నష్టములేనందున చౌతునకు మొగలు లంగీకరించిరి. కాని దేశము నిరసస్థితి యందుండుటవలన, చౌతుసర్దేశముఖీలు, వసూలైన కూవత్తుశిస్తును మ్రింగివేసి చక్రవర్తి ధనాగారమున కేమియు మిగల్చకుండెను. ఇందుకై మనసులో దుఃఖము, సనదులిచ్చినను, ఉండెను. రాజాయొక్క బాపతులని పిలువఁబడు నీచౌతు సర్దేశముఖీలు, మహారాష్ట్రులు యుద్ధములందు విజయము నొందిన చోటులనెల్ల, కఠినముగ వసూలుచేయఁబడుచుండెను. తక్కిన మూడువంతుల మదింపు చేయఁబడిన శిస్తునందలి భాగమును పూర్వపుమొగలు గవర్నరుల కియ్యఁబడుచువచ్చెను. అయినను వారు తమశిస్తుభాగమును వసూలు చేసికొనఁజాలమిచే క్రమక్రమముగ నధికారము మహారాష్ట్రులకు వశగతమయ్యెను. ఈ యధికారముయొక్క మార్పు సంగ్రామమేమియునులేక పూర్తిగ జరుగలేదు. చక్రవర్తి సనదులను సులభముగ నిచ్చెనుగాని సుభేదారు లందఱును తమ యజమానుని యాజ్ఞలను జరుగనిత్తురా? బలములేక కేవలమంత్రము సాగదు. దక్కను సుభేదారుఁడైన నిజాము ఇందుకుపెట్టిన తగవులను మనము ముందు బాజీరావు కాలమునందుఁ జూడఁగలము.

బాలాజీవిశ్వనాథుఁడు తాను మహారాష్ట్రమునందు జేసినయేర్పాటులకల్ల, డిల్లీశ్వరుని యొద్దనుండి తెచ్చిన సనదులవలన, సంపూర్ణవిజయం బొడ

గూర్చెను. అంతరంగమునందు శ్రుతిదప్పి చెడిపోయిన రాగంబులనెల్ల మేళవింపఁజేసి వానికి ప్రౌఢిరొసంగు *అనుశబ్దకముల వెలుపల నిలువంబెట్టెను. ఈతఁడు తనజీవితమునఁ జేసిన సంస్కారముల నొక్క యాలోకనంబున నొక్కసారి విమర్శించిన చదువరులకెంతయు నుపయుక్తంబుగ నుండక మానదు. ఈతఁడు మొట్టమొదట ఘోరాటకుత్తావు మొదలైన సామాన్యదోపిడిదారులను దండోపాయమున నణచివేసెను. కాని కేవల బలస్సాహసములెల్ల యెడలను కార్యకారులు గావు. యుద్ధనైపుణ్యమునందు బాలాజీ విశ్వనాథుఁడు ప్రసిద్ధికెక్కినవాఁడు కాఁడు. బలాధికులై ప్రబలి వివిధదేశములను బాహుపరాక్రమముచే నాక్రమించుకొనిన ఖండీరావు, భాంస్లే, మొదలైన గడిఁదిశత్రువులయెడల దండోపాయము నష్టమేఁగాని లాభములేదు. కావున వారియొక్కయుత్తమబుద్ధిని ప్రబోధింపవలసి వచ్చెను. వారియొక్క లాభమే సంయుక్తమహారాష్ట్ర సంఘముయొక్క లాభమని చూపింపఁవలసివచ్చెను. వారుకలసియుండినయెడల బలసత్వసంపన్నులై యుండురనియు విడిపోయిన నెల్లరకును నాశనమగుననియు నతఁడు మనస్సునచ్చునట్లుబోధించెను. ఆనాయకులయొక్క దేశభక్తినాతఁడుపురికొల్పి సామాన్య యుద్యమమునకు వారి నాకర్షించెను. చంద్రసేను జాధవుఁడును, నింబాల్కారు, నిందుకు లక్ష్యపెట్టని మాట సత్యమేకాని ఖండీరావు, దాభరే, ఉదయాజీపవారు, పర్సోజీ భాంస్లే, ఇంకతక్కినమఱికొందఱునాయకులు సాహూ యొక్కయధికారముతోడ దే తమ మేలని గ్రహించి యతని పక్షమున చేరిరి. ఖండీరావు సైన్యాధిపతిగఁ జేయఁబడెను. పర్సోజీ సేనాసాహేబు సుభేగా చేయఁబడెను. ఈ నాయకులు ఖాను దేశమందును బేరారునందును వరుసగ సంపాదించుకొనిన రాజ్యములు వారు స్వతంత్రముగ పరిపాలించుకొనుట కంగీరింపఁబడిరి. ఇంకను ఖండీరావు పశ్చిమముగ గుజరాతులోనికిని, భాంస్లే తూర్పుగ గోండ్వానాలోనికిని ప్రవేశింప ననుజ్ఞయియ్యంబడిరి. ఇదేవిధముగ ఉదాజీపవారునకు మాల్వాలోనికి ప్రవేశింప ననుజ్ఞ యియ్యంబడెను. వీరు మువ్వురును ప్రధాన రాజ్యస్థానమునకు సాహాయ్యము చేసినయెడల వారి

---

*అనుశబ్దక మనఁగా నాదమును వృద్ధిచేయు సాధనము.

హక్కులన్నిటికిని ఢిల్లీశ్వరుని యొద్దనుండి యధికార పత్రము తెప్పింపఁబడు నని వాగ్దానము చేయఁబడిరి. పంతు సచివుఁడును, పంతు ప్రతినిధియు నిదే విధముగ నైకమత్యమువలన లాభమును చూపఁగలిరి. అక్కలకోటకు ముఖ్యుఁడుగ సాహూచే చేయఁబడిన ఫత్తేసింగు భోంస్లే కర్ణాటకమందు రాజసైన్యముల నడుపుట కేర్పఱుపఁబడెను. కనోజీ ఆంగ్రియా నావసైన్యాధిపతిగఁ జేయఁబడెను. ఇతఁడు సముద్రముమీఁద సర్వసంఘముల నావలను పట్టుకొనుచు వారి యొద్ద నుండి చౌతు వసూలు చేయుచుండి రాజునకు ఫిరంగులు, శతఘ్నులు, ఆయుధసామగ్రి, మందుగుండు సామాను, ఇంకను యూరోపు చీనా దేశములయొక్క చిత్రవిచిత్రవస్తువులు తెచ్చి నజరుగా నర్పించుచుండెడువాఁడు. ఇంగ్లీషు పోర్చుగీసువారలుకలసి యతనిపై వచ్చిననతఁడు లక్ష్యముచేయకుండెను. ఇంక ననేకుల ననేక విధముల తృప్తిఁగావించి, విశ్వనాథుఁడు తాను మాత్రము సాహూయొక్క కేవల మంత్రిగా నుండెను. అతనికున్న సైన్యాధిపత్యమెల్ల ఖానుదేశ బాలా ఘాటులలో రాజు కుఁగల కొన్ని హక్కులకు మాత్రమే యుండెను. ప్రసిద్ధమైన నీ స్వార్థ రాహిత్యమే, వివిధ నాయకులకును, సామాన్య రక్షణ కొఱకును ఆక్రమణకొఱకును అతఁడేర్పఱుపఁ దలచుకొన్న, యైకమత్యబంధమును స్థాపింపఁగల రాజనీతిని జయప్రదంబుగ నిర్వహించుటకు, సమర్థునిగాఁ జేసెను. ఇట్టి యైకమత్యము వలననే మొగలు సేనాపతులును, ఢిల్లీమంత్రులును సాహూ మహారాజునకు కొద్దికాలములోనే తగిన మర్యాదను జూపుచు వచ్చిరి.

ఈ క్రొత్త యేర్పాటువలన నదివఱకే నామమాత్రంబయిన శివాజీయొక్క యష్టప్రధాన పద్ధతి మూలఁబడెను. శంభాజీయొక్క దుష్పరిపాలనమందు ఈపద్ధతి వ్యవహారమ మందంతరించెను. రాజారాము పునరుద్ధారణ చేసెను కాని యా గందరగోళ కాలములో నధికారము ఒలమైనవారి చేతులలో నుండవలసి యుండెను. అప్పుడు ప్రహ్లాద నిరాజీయే ప్రధానసభను స్వయముగ నడుపుచుండెను. తరువాత రాజారాము దక్కనుకు తిరిగి వచ్చినప్పటికి వ్యవహారభారము వలన నతఁడు సరియైన స్థితియందు దాని నుంచలేదు. తరువాత స్వారం

క్రొత్త యుద్ధమూఖరగునప్పటి కది మరలనంతరించెను. సాహూ సతారాయందు సింహాసనాసీనుండైన తరువాత దానిని మరల స్థాపింపఁదలంచెను గాని మారిన స్థితిగతుల కది పనికి వచ్చినదికాదు.

అష్టప్రధాన పద్ధతి దృఢమైన ప్రధాన రాజ్యస్థాన ముండినఁగాని జరుగనేరదు. సాహూ తనతాతయొక్క సుగుణంబులులేని వాఁడాయెను. అతనివలె నితఁడు చేసిన యేర్పాటులందెల్ల భక్తివిశ్వాసముల్ ప్రజలందు కలిగించు శక్తి కలవాఁడు కాఁడు. అంతియకాక రెండవ కారణ మేమన, అష్టప్రధాన పద్ధతి చిన్న సరిహద్దులలో నున్న రాజ్యమున కనుకూలించునుగాని, స్వాతంత్ర్యయుద్ధమైన తరువాత మహారాష్ట్రులు నర్మదా కావేరుల మధ్య నెల్ల దేశమునకును విజృంభించియుండ, దూరదూరముగ నున్న దేశభాగములను నాయకులాక్రమించి చుట్టును మొగలులయొక్క యధికారములను కలిగియుండ, అష్టప్రధాన పద్ధతి సహజముగ సరిపడక మాసిపోయెను. సాహూయొక్క సభయందు, బిరుదములు వహించి ప్రధానులు పేరుకు మాత్రముండిరి కాని, వారు దూరదేశములో తమ సైన్యములను కలిగియుండి ప్రధానాధికారస్థానమునకు లోఁబడి యుండలేదు. కావున బాలాజీ వారివారికి స్వంతదేశములలో స్వాతంత్ర్య పరిపాలనాధికారము నిచ్చి రాజ్యముయొక్క సామాన్య రక్షణకొఱకు సామాన్య శత్రువులతో పోరాడుట కంగీకరించునట్లు చేసెను. ప్రస్తుత మహారాష్ట్రము చుట్టును, సావనూరు, హైదరాబాదు, గుజరాతు, మాల్వా, మొగలు గవర్నరులుండిరి. పశ్చిమ తీరమున సిద్దీలు, పోర్చుగీసు, ఇంగ్లీషువారుండిరి. మహారాష్ట్రులు తమ రాష్ట్రకూటమువలననే, భయభక్తులతో పై వారెల్లరి చేతను చూడంబడుచువచ్చిరి.

ఈ పద్ధతి జయప్రదమైన దనుటకు మొదటి నిదర్శనము. అది కేవలము తాత్కాలిక కార్యావసరమును నెఱవేర్చుటయే గాక నూఱు సంవత్సరము లతిమించియు నేకాపత్కాలములందుపకరించినదైయున్నది. తత్కారణమువలననే మహారాష్ట్రులు గుజరాతు, మాల్వా, బందలఖండు, ఒరిస్సా, గోండ్వానా, తుంగభద్రావది పఱకును కర్ణాటకము జయింపఁగలిగిరి. అందువలననే కాజ

పుత్రస్థానములోను, ఢిల్లీ దర్బారులోను సంస్థానముల నన్నిటిని వశపఱచుకొనుటకును తమకనుకూలమైనరీతి నా చక్రవర్తులను సింహాసనాసీనవిహీనులఁ జేయుటకును సమర్థులైరి. కావుననే వారు తమ రాజ్యమును సింధునదివఱకు నొకవైపున వ్యాపింపఁజేయుటకును, తూర్పున ఔద్ధు, బెంగాలు, ఒరిస్సానవాబులను వశము చేసికొనుటకును, దక్షిణమున నిజాము, సావనూరు, కర్ణాటక నవాబుల యొక్క రాజ్యములను వెనుకకుఁ ద్రోసివేయుటకును వారు సమర్థులైరి. అంతియ కాక బేసీను నుండి పోర్చుగీసువారిని తఱిమి వేయుటకును, ఇంగ్లీషు వారితో సరిసమానముగ రెండు యుద్ధములు చేయుటకును వారు సమర్థులైరి. ఆ కారణముచేతనే పానిపట్టు నొద్ద గాఢమైన యోటమి గలిగినను తెప్పిరిల్లి మరల నుత్తర యిండియాయందు ఢిల్లీలో తమ యాధిక్యత నేర్పఱచుకొనుటకు వారు సమర్థులైరి. తరువాత నూఱు సంవత్సరములకు అది వ్యర్థమై పోవుటకు కారణమా రాష్ట్రకూటముయొక్క సాంప్రదాయములనుండి విడివడి స్వార్థాభివృద్ధికొఱకంచలి నాయకులు కొందఱుపాటుపడుటయే యై యున్నది. ఈ వంద సంవత్సరములలో నొడఁగూడిన జయముల వలననే దానియొక్క జవసత్వములు గానంబడుచున్నవి. ఈ విజృంభణము, పూర్వపు అష్టప్రధాన పద్ధతి వలన జరుగకుండెడి దనుట స్పష్టము.

ఈ బలమునందే నీరసకారణము కూడ నున్నదనుటకు సందేహములేదు. విశ్వనాథున కిది తెలియకపోలేదు. ఈ రాష్ట్రకూటము, సామాన్య సాంప్రదాయములును, సామాన్య దేశభక్తియు లేకపోయినయెడల, సికతాబంధనంబె యగును. విశ్వనాథుడీ నీరసమును కనిపెట్టి యందుకు తగిన రాజనీతి నవలంబించి యుండెను. ఆ రాజనీతి లక్షణంబు లెవ్వియన, (1) రాష్ట్రకూటము శివాజీయొక్క సాంప్రదాయముల వలనను, అతని మనుమనికి చూపఁబడు భక్తివలనను దృఢపరుపఁబడెను. బాలాజీవిశ్వనాథుడీ భక్తిబంధమును సాధ్యమైనంత దృఢతమంబు సేయఁ బ్రయత్నించెను. అన్నివ్యవహారములును, పత్రములును, సమాధానములును సాహూ పేరననే జరుపఁబడుచుండెను. (2)